6-2Pg1exHMNWJQE.qxd:6-2Pg1exHMNWJQE.qxd 01/01/01 9:46 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ fb.com/vaartha

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-2-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 5 పేజీలు: 12 వెల: 6.50

ముస్లింల ఆధ్యాత్మిక గురువు ఆగాఖాన్ కన్నుమూత 9లో

గాజాను స్వాధీనం చేసుకుంటాం: ట్రంప్



బుధవారం ప్రయాగరాజ్‌లో త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానమాచరిస్తున్న ప్రధాని మోడీ

## 'మహాకుంభ్'లో ప్రధాని మోడీ

### త్రివేణి సంగమంవద్ద పుణ్యస్నానం ఆచరించిన ప్రధాని

**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 5:** ప్రపంచంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహా కుంభ్‌మేళాలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్నారు. బుధవారం ఆయన పవిత్రత్రివేణి సంగమం >>2

# విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్



## విశాఖ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు రైల్వే డివిజన్లతో ఏర్పాటు

### ఆధికారిక ఉత్తర్వులు జారీ

### విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు

**విజయవాడ,ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖపట్నం రైల్వే డివిజన్, వైజాగ్ కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిలను కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని తాజాగా అధికారిక ఉత్తర్వులు విడుదల చేసింది విజయవాడలో రైల్వే పౌరసమాచార అధికారయంత్రాంగం ఈ వివరాలు వెల్లడించింది. కేంద్రం. వాల్తేర్ డివిజన్ పేరును విశాఖపట్నం డివిజన్‌గా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. విశాఖ డివిజన్ పరిధిని కూడా మార్పు చేస్తూ తాజాగా ఉత్తర్వులు రిలీజ్ అయ్యాయి. సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిలోకి విశాఖ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు రానున్నాయి. రాయగడ రైల్వే డివిజన్ పరిధిని కూడా ఖరారు చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ డివిజన్‌లో 410 కిలోమీటర్లు పరిధిని చేర్చారు రైల్వే అధికారులు. కొండపల్లి మోటుమర్రి సెక్షన్‌ను సికింద్రాబాద్ డివిజన్ నుంచి విజయవాడ డివిజన్‌గా మారుస్తూ రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది.

ఎన్నో రోజులుగా ఉత్తరాంధ్ర వాసులకు చిరకాల వాంఛగా ఉన్న సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిని నిర్ణయించడంతో పాటు విశాఖ కేంద్రంగా విశాఖ రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్రం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో పాటు విశాఖ రైల్వే డివిజన్ పరిధిలో మొత్తం 410 కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌ను చేరుస్తూ నిర్ణయం తీసుకున్నారు. విశాఖ డివిజన్ పరిధిని కూడా మార్చింది కేంద్రం. విశాఖ డివిజన్ పరిధిలో ఏయే మార్గాలను చేరుస్తున్నారనే విషయాన్ని కూడా వెల్లడించింది కేంద్రం. అదే విధంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలోకి విశాఖ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లను మార్చారు. విశాఖ రైల్వే డివిజన్‌లో పలాస నుంచి విశాఖపట్నం దువ్వాడ, కూలేరు నుంచి విజయనగరం, నవపాడు జంక్షన్ వరకు.. సింహాచలం నార్త్ నుంచి దువ్వాడ బైపాస్ వరకు.. వడ్లపూడి నుంచి దువ్వాడవిశాఖపట్నం స్టీల్ ప్లాంట్ వరకు రైల్వే ట్రాక్ మొత్తం విశాఖ రైల్వే డివిజన్‌లోకి వస్తుందని కేంద్రం పేర్కొంది. రాయగడ రైల్వే డివిజన్‌లోని కొన్ని మార్గాలను విశాఖపట్నం రైల్వే డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చారు. రెండు డివిజన్ల పరిధిని ఖరారు చేశారు. విశాఖ రైల్వే డివిజన్‌ను కొత్తగా ఏర్పాటు చేయడంతో సౌత్ కోస్టల్ >>2

## నేడు కేబినెట్ భేటీ

**విజయవాడ,ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కేబినెట్ నేడు ఉదయం 11 గంటలకు సమావేశం కానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీకి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలిలో కీలక చర్చ జరగనుంది. ప్రధానంగా వైకాంగ్రెస్ పార్టీ హయాంలో ఫ్రీ హోల్డ్ చేయబడిన 22ఏ భూముల వ్యవహారం చర్చకు వచ్చే అవకాశం కనిపిస్తోంది. విశాఖ పంచగ్రామాల సమస్యపైనా చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆ భూములకు సంబంధించి ఏపీ సర్కార్ పరిష్కారం చూపించింది. అయితే స్థానికులకు ప్రత్యామ్నాయంగా అదే విలువ కలిగిన భూముల కేటాయించాలని చంద్రబాబు ప్రభుత్వం యోచిస్తోంది. దానిపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

ఎస్ఐపిబిలో ఆమోదించిన రూ.44.776 కోట్ల విలువైన 15 ప్రాజెక్టులకు క్యాబినెట్ ఆమోదముద్ర పడే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టుల ద్వారా 19,580 మంది యువత ఉద్యోగ అవకాశాలు పొందనున్నారు. ఈ నెలాఖరులో జరగనున్న అసెంబ్లీ సమావేశాలపై క్యాబినెట్ మీటింగ్ అనంతరం సిఎం చంద్రబాబు మంత్రులతో చర్చించనున్నారు. ఏపీలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధత పైనా చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. ఉన్నత విద్యామండలికి ప్రత్యేక కమిషనరేట్ ఏర్పాటుపైనా క్యాబినెట్‌లో మంత్రులు చర్చించే అవకాశం కనిపిస్తోంది.

## బిజెపికే ఢిల్లీ పీఠం!

### ఆప్‌కు రెండోస్థానం ఇచ్చిన ఎగ్జిట్‌పోల్స్

### ఒకటి, రెండు సీట్లకే కాంగ్రెస్ పరిమితం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నిల పోలింగ్‌ముగిసిన వెంటనే వెల్లడవుతున్న ముందస్తు సర్వేలు బిజెపికే మొగ్గుచూపిస్తున్నాయి. అత్యధిక సర్వేసంస్థలన్నీ కూడా బిజెపి ప్రస్తుత అదికార పార్టీ ఆమ్ ఆద్మీపార్టీకంటే ఎక్కువస్థానాలు గెలుస్తుందని అంచనావేస్తున్నారు. పీపుల్స్ పల్స్ మినహా మిగిలిన అన్ని సర్వేసంస్థలు బిజెపికి 50స్థానాలకు తగ్గకుండా వస్తాయని ప్రకటించాయి. పీపుల్స్ పల్స్ మాత్రం బిజెపికి 51 నుంచి 60 స్థానాలు వస్తాయని, ఆమ్ ఆద్మీపార్టీకి 10 నుంచి 19స్థానాలు మాత్రమే వస్తాయని అంచనావేసింది. వివిధ సంస్థల అంచనాలకు అనుగుణంగానే ఎన్నికల ప్రచారం కూడా జోరుగా సాగింది. పోటీ ఆసాంతం ఆమ్ ఆద్మీ భారతీయ జనతాపార్టీమధ్యనే నడిచిందని పోలింగ్ సరళి రుజువుచేస్తోంది. వివిధ సర్వేసంస్థలన్నీ చేసిన సర్వేలనుచూస్తే కాంగ్రెస్ పార్టీకి ఒకటిరెండు స్థానాలకు మించి రావని స్పష్టంచేస్తున్నాయి. వివిధ సర్వేసంస్థల అంచనా స్థానాలు ఈ విధంగా ఉన్నాయి. ఢిల్లీలో మొత్తం రిజిస్టరు అయిన ఓటర్లు 1.52కోట్లకుపైగా ఉన్న ఢిల్లీ ఓటర్లు ఈసారి చైతన్యం ప్రదర్శించారని స్పష్టం అవుతోంది. ఎక్కువగా కొత్తగాచేరనవారి ఓట్లు పోలింగ్‌కు ఎక్కువ రావడంతో విజయం బిజెపికే ఖాయం అని విశ్లేషకులు అంచనాలువేస్తున్నారు. ఈ ఎన్నికల్లో బిజెపి 68 స్థానాల్లోపోటీచేస్తుంటే ఆప్ మొత్తం 70 స్థానాల్లోను పోటీచేస్తోంది. 15 ఏళ్లపాటు ఢిల్లీని పాలించిన కాంగ్రెస్ గడచిన రెండుదశాబ్దాలుగా ఒక్కస్థానం కూడా సాధించుకోలేకపోతోంది. ఇప్పటివరకూ వచ్చిన ఎగ్జిట్‌పోల్స్‌ను చూస్తుంటే కనీసం ఆరుసంస్థలు బిజెపికే గెలుపు అవకాశాలు ఎక్కువ ఉన్నట్లు ప్రకటించాయి.

| సర్వేసంస్థ పేరు | ఆప్ | బిజెపి | కాంగ్రెస్ | ఇతరులు |
|---|---|---|---|---|
| చాణక్య స్ట్రాటజీస్ | 25-28 | 39-44 | 2-3 | 0 |
| పీపుల్స్ పల్స్ | 10-19 | 51-60 | 00 | 0 |
| పోల్ డైరీ | 18-25 | 42-50 | 0-2 | 0 |
| వుయ్‌ప్రిసైడ్ | 46-52 | 18-23 | 0-1 | 0 |

### ఢిల్లీలో పోలింగ్ 57.7%

కేజ్రీవాల్ నియోజకవర్గంలో 54 శాతం 2లో



## హెచ్‌వన్‌బి వీసా రెన్యువల్ రద్దుకు ట్రంప్ నిర్ణయం

### బైడెన్ నిర్ణయాన్ని రద్దు చేయాలంటూ సెనేటర్లు తీర్మానం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 5:** అమెరికాలో ఉద్యోగాలుచేసే విదేశీయులకు ట్రంప్ ఒక్కసారిగా షాక్ ఇచ్చారు. హెచ్‌వన్‌బీ, ఎల్‌వన్ వీసాలను ఆటోరెన్యువల్ చేసుకోవడానికి ఉన్న అవకాశాన్ని రద్దుచేయాలని ఇద్దరు రిపబ్లికన్ అమెరికన్ సెనేటర్లు తీర్మానం ప్రవేశపెట్టారు. వర్క్ వీసాలను ఆటోరెన్యువల్ అనేది ఇమిగ్రేషన్ అమలుకు అత్యంత ప్రమాదకరమని వారన్నారు. హెచ్‌వన్‌బీ, ఎల్‌వన్ వీసాల గడువును పొడిగింపును పెంచుతూ బైడెన్ సర్కారు నిర్ణయించింది. గతంలో ఇది కేవలం 180 రోజులుంటే గత సర్కారు 540 రోజులకుపెంచింది. ఈక్రమంలో ట్రంప్ కఠిన వలసల నియంత్రణ, కఠిన వీసా నిబంధనలకు ఇది అడ్డంకిగా మారుతుందని సెనేటర్లు వాదిస్తున్నారు. >>2



బుధవారం న్యూఢిల్లీలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌తో భేటీ అయిన మంత్రి లోకేష్. చిత్రంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపి కృష్ణదేవరాయలు తదితరులు

## డేటా చౌర్యం నిరూపిస్తే 10 కోట్ల బహుమతి

### వాట్సప్ గవర్నెన్స్‌పై ఆరోపణలను ఖండించిన మంత్రి లోకేష్

### న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాధ్, గూగుల్ క్లౌడ్ ఎండి విక్రమ్‌సింగ్, కంట్రీ డైరెక్టర్ అశుతోష్‌తో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ,ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** వాట్సప్ గవర్నెన్స్‌లో డేటా చౌర్యం నిరూపిస్తే రూ.10 కోట్లు బహుమతిగా ఇస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో ఢిల్లీలోని ఆయన నివాసంలో ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో అభివృద్ధి కార్యాచరణలు, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన కార్యక్రమాలను రాజ్ నాథ్ సింగ్‌కి వివరించారు. డిఫెన్స్ రంగం పరికరాల తయారీలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు వస్తున్న నేపథ్యంలో కొన్ని యూనిట్లు ఏపికి వచ్చేలా సహకరించాలని కోరారు కేంద్రం అందిం >>2

## దస్తగిరి ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు

### వివేకా కేసు దర్యాప్తులో కీలక మలుపు

**ప్రభాతవార్త బ్యూరో కడప ఫిబ్రవరి 5:** మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. వివేక కేసులో అప్రూవల్ గా మారిన దస్తగిరి ఫిర్యాదు మేరకు దేవిరెడ్డి చైతన్య రెడ్డి,డీఎస్పీ నాగరాజులతో సహా నలుగురి పై జీరో ఎఫ్ ఐ ఆర్ ను ఈనెల 3వ తేదీన పులివెందుల పట్టణ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసినట్టు పులివెందుల పోలీసులు తెలిపారు. 341 , 506 , 323 ,195 (ఏ) , 330 ఐ /డబ్ల్యూ, 109 ఐపీసీ సెక్షన్ల, మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ1గా వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న దేవి రెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్య రెడ్డి , ఏ 2 గా జమ్మలమడుగులో పనిచేసిన డి.ఎస్.పి నాగరాజు, ఏ 3 గా ఎర్రగుంట్ల సీఐ గా పనిచేసిన ఈశ్వరయ్య, ఏ4 గా కడప జైల్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ప్రకాష్ ఉన్నారు. 2023 అక్టోబర్ లో దస్తగిరి బంధువుల అమ్మాయి ప్రేమ వివాహ విషయంలో దస్తగిరిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులో దస్తగిరిని ఏడు రోజులపాటు చీకటి గదిలో ఉంచి పోలీసులు చితకబాదినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అంతేకాకుండా ఈ కేసులో 2023 అక్టోబర్ నుంచి ఫిబ్రవరి 2024 >>2

## తెలుగులో కూడా ఇక ప్రభుత్వ ఉత్తర్వులు

### సర్కార్ కీలక నిర్ణయం • తొలుత ఇంగ్లీషు, తర్వాత తెలుగులో జారీ

**విజయవాడ.ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగు భాషలో కూడ జారీ చేయనుంది. గత నెలలోనే ఈ ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించగా, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమైంది. ప్రస్తుతం ఈ ప్రక్రియను హోంశాఖ ప్రారంభించింది. తొలి సారిగా ఒక ఖైదీ పెరోల్‌కు సంబంధించిన జిఒను తెలుగు భాషలో విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం స్థానిక ప్రజల కోసం కీలకమైన చర్యగా భావిస్తున్నారు. ప్రతి జిఒ మొదట ఇంగ్లీషులో విడుదల కానుంది. ఆ తర్వాత రెండు రోజుల్లోపు అదే జిఒను తెలుగు భాషలో జారీ చేస్తారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వ నిర్ణయాలు,ఉత్తర్వులు ప్రజలకు సులభంగా అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వులు రెండు భాషల్లో జారీ చేయాలనే ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మరింత పారదర్శకతను, భాష పట్ల గౌరవాన్ని అందచేస్తుందని భావిస్తున్నారు. తెలుగు భాషలో ఉత్తర్వుల ప్రక్రియ త్వరితగతిన కొనసాగేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

## భీమునిపట్నం బీచ్‌వద్ద అక్రమ నిర్మాణాలుంటే కూల్చేయండి: హైకోర్టు

**విజయవాడ, ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖపట్నంలోని భీమునిపట్నం బీచ్ వద్ద నిర్మాణాలు అక్రమణ నిర్ధారణైతే కూల్చివేయాలని ఏపీ హైకోర్టు ఆదేశించింది. విశాఖ జిల్లా కలెక్టర్‌తో పాటు సిఆర్‌జెడ్ జోనల్ అధికారి, ఇతర అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. భీమునిపట్నం వద్ద చేపట్టిన నిర్మాణాలను కమిటీ పరిశీలించాలని, అవి అక్రమ నిర్మాణాలని తేలితే కూల్చివేయాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తదుపరి విచారణ అయ్యేటప్పటికీ పూర్తి నివేదిక సమర్పించాలని కమిటీని న్యాయస్థానం ఆదేశించింది. నివేదికను సమర్పించ డంలో విఫలమైతే అధికారులు కోర్టుకు హాజర >>2

## మద్యం అక్రమాలపై 'సిట్'

**విజయవాడ.ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో గత ప్రభుత్వ హయంలో జరిగిన మద్యం అక్రమాలపై సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు ఆధ్వర్యంలో ఏడుగురు సభ్యులతో ఈ సిట్ ఏర్పాటయింది.,మద్యం అమ్మకాలకు సంబంధించి సిట్‌కు అవసరమైన పూర్తి సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ శాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి.

దర్యాప్తు బృందం సీఐడీ చీఫ్ ద్వారా ప్రతి 15 రోజులకు ఒక పర్యాయం ప్రభుత్వానికి నివేదికను సమర్పించాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టం చేసారు.ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ సుబ్బరాయుడు,అడిషినల్ ఎస్పీ కొల్లి శ్రీనివాస్, సీఐడీ ఏఎస్పీ శ్రీహరిబాబు, డోన్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శివాజీని నియమించారు. సీఐడీ డీఐజీ ఆధ్వర్యంలోనే సిట్ పనిచేస్తోందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. సిట్ బృందానికి పూర్తి అధికారాలు కల్పించారు.2019 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు రాష్ట్రంలో మద్యం విక్రయాలకు సంబంధించి రూ.90వేలు కోట్ల నగదు లావాదేవీలు జరిగాయన్నది అభియోగం, నగదు లావాదేవీలతో పాటు హోలో గ్రామ్ వ్యవహారంలో కుడా పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## రిజిస్ట్రేషన్లలో అవధుల్లేని అక్రమాలు

### చర్యలకు జారీ చేసిన జీవోలు బుట్టదాఖలు

### వందల డాక్యుమెంట్లలో బయల్పడిన అక్రమాలు

### కడప రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి బాగోతం

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** ఒకరిని చంపినా ఒకే కేసు..ఇద్దరిని చంపినా ఒకే కేసు..తెగించిన క్రిమినల్స్ చెప్పే మాటలివి. ఎన్ని చేసినా ఒకే మర్డర్ కేసు కదా అనేది వారి ధీమా. రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో కూడ అధికారులు కూడా అలా మారారు. ఒక తప్పు చేస్తే సస్పెన్షన్ చేస్తారు. మరలా ఆరు నెలలకు పోస్టింగ్ ఇస్తారు. మహా అయితే ప్రభుత్వ భూములు రిజిస్టర్ చేస్తే, ఒకరి ఆస్థులు మరొకరికి రిజిస్ట్రేషన్ చేస్తే చీటింగ్, క్రిమినల్ కేసులు నమోదు చేస్తారంతే కదా.. ఉద్యోగం నుంచి తొలగించడం అనేది అరుదు కదా అని ధీమాగా భావిస్తున్నారు. అందుకే క్రిమినల్ మైండ్‌తో ఉద్యోగం చేశారు. ఒకటి కాదు రెండుకాదు ఏకంగా వంద డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌లో వారి అక్రమాలు నిర్ధారణ అయ్యాయి. వారి అక్రమాలను పెంచి పోషించిన ఒక జిల్లా రిజిస్ట్రార్ ఒక డీఐజిపై రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక జీవో జారీ చేసి క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు ప్రకటించింది. అయితే డీఐజిని వెంటనే ట్రాన్స్‌ఫర్ చేశారు. మిగిలిన జిల్లా రిజిస్ట్రేషన్ అధికారిని కనీసం బదిలీ చేయలేదు..చర్యలు లేవు..కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వందల కోట్ల విలువైన ఆస్థుల రిజిస్ట్రేషన్‌ల అక్రమాలు నిగ్గుతేల్చడంలో రెవెన్యూ శాఖ ఎందుకు మీనమేషాలు లెక్కిస్తోంది?

కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2022 మే నుంచి పనిచేసిన సబ్ రిజిస్ట్రార్లు అనేక అక్రమాలకు పాల్పొడినట్టు ఆరోపణలున్నాయి. ఎనివేర్ రిజిస్ట్రేషన్ కింద ఏకంగా అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌కు కేటాయించిన భూములనే రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇక్కడ బీజం పడిందంటే ఎంత బరితెగించిన సబ్ రిజిస్ట్రారో అర్థంచేసుకోవచ్చు. అలాంటి సబ్ రిజి >>2



బుధవారం ఢిల్లీలో ఓటు వేసిన అనంతరం సిరా చుక్క చూపిస్తున్న రాష్ట్రపతి ముర్ము, ఆప్ అధినేత కేజ్రీవాల్, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక తదితరులు

# ఢిల్లీలో పోలింగ్ 57.7%

## కేజ్రీవాల్ నియోజకవర్గంలో 54 శాతం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బుధవారం జరిగిన పోలింగ్ ముగిసేనాటికి 57.7శాతం మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్లు తేలింది. 2020లో ఇదే సమయానికి 54.2శాతం ఓట్లు పోలయ్యాయి. ఐదేళ్లనాటికంటే ఓటరు నమోదు పెరగడం, ఓటర్లలోచైతన్యం వచ్చిందనే పెరిగిన ఓటింగ్‌శాతం చెపుతోంది. మొత్తం 699 మంది అభ్యర్థులు పోటీచేస్తున్న ఢిల్లీ అసెంబ్లీలోని 70స్థానాలకు ఒకే విడతగా పోలింగ్ జరిగింది కేజ్రీవాల్‌పోటీచేస్తున్న న్యూఢిల్లీ స్థానంలో సాయంత్రం ఐదు గంటల సమయానికి 54.27శాతం పోలింగ్‌నమోదయింది. ముఖ్యమంత్రి అతిశిమొర్లేనే పోటీచేస్తున్న కల్కాజీ స్థానంలో 51.81శాతం,మాజీ డిప్యూటి సీఎం మనీశ్‌సిసోడియా పోటీచేస్తున్న జంగ్‌పుర స్థానంలో 55.23 శాతం పోలింగ్ జరిగింది. ఆరోగ్యమంత్రి సౌరభ్‌భరద్వాజ్ పోటీచేస్తున్న గ్రేటర్ కైలాష్‌స్థానంలో 52శాతం పోలింగ్‌జరిగినట్లుతేలింది. ఢిల్లీ మొత్తంగా 1.5 కోట్లమంది ఓటర్లు పోలింగ్‌కు వస్తారని ఆశించినా 57.7శాతం మాత్రమే నమోదయింది. ఎగ్జిట్‌పోల్స్ అన్నీ బిజెపికే అవకాశం అన్న సర్వేలను వెల్లడించడంతో ఆప్‌కు ఈసారి హ్యాట్రిక్‌సాధించడం కష్టమేనన్న వాదన వస్తోంది. అలాగే ఢిల్లీలోచక్రం తిప్పిన ఆనాటి షీలాదీక్షిత్‌ప్రభుత్వమే మళ్లీరావాలంటూ ప్రచారంచేసిన కాంగ్రెస్‌కు ఒకటిరెండుమినహా స్థానాల్లో గెలుపు అవకాశాలు లేవని సర్వేలు చెపుతున్నాయి.

# విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్


>>రైల్వే జోన్ పరిధిలోకి దాన్ని మార్చేశారు. ఇంతకు ముందు గుంటూరు, గుంతకల్లు, విజయవాడ రైల్వే డివిజన్‌లు సౌత్ ఇంట్రన్ రైల్వే పరిధిలో ఉండేవి.. ఇప్పుడు వీటన్నింటినీ సౌత్ కోస్టల్ రైల్వే పరిధిలోకి తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేసింది కేంద్రం.

ఇక నెం.12522 ఎన్నాకుళంబరౌని రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7వ తేది నుంచి చీరాల స్టేషన్‌లో ఆగనుంది. నెం.16004 నాగర్‌సోల్‌డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ మహబూబ్‌నగర్‌లోను, నెం.22101 లోకమాన్య తిలక్ టెర్మినస్-మదురై ఎక్స్‌ప్రెస్ గుత్తిలో, నెం. 11017 లోకమాన్య తిలక్‌కారైక్కాల్ ఎక్స్‌ప్రెస్ గుత్తి, తాడిపత్రి, నెం.22669 ఎర్నాకుళంపాట్నా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఖమ్మం, నెం.12656 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌అహ్మదాబాద్ నవజీవన్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో ఆగనున్నాయి. నెం.17643 చెంగల్పట్టు కాకినాడ పోర్ట్ సర్కార్ ఎక్స్‌ప్రెస్ మంగళగిరి, న్యూ గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఆగుతాయని దక్షిణ రైల్వే తెలిపింది.

నెం.12655 అహ్మదాబాద్ చెన్నై సెంట్రల్ నవజీవన్ ఎక్స్‌ప్రెస్, నెం.12611 సెంట్రల్‌హజ్రత్ నిజాముద్దీన్ గరీభ్ రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వరంగల్, నెం.12603 చెన్నై సెంట్రల్‌హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ నెం.17643 చెంగల్పట్టుకాకినాడ పోర్ట్ సర్కార్ ఎక్స్‌ప్రెస్ మంగళగిరి, న్యూ గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఆగుతాయని దక్షిణ రైల్వే తెలిపింది. నెం.22624/22623 మదురైతాంబరంమదురై సూపర్ ఫాస్ట్ రైళ్లకు ఈ నెల 6 నుంచి 20వ తేది వరకు అదనంగా రెండు ఏసీ త్రీ టైర్, రెండు జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు అనుసంధానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# రిజిస్ట్రేషన్లలో అవధుల్లేని అక్రమాలు

>> స్ట్రార్‌కు క్రమశిక్షణ చర్యల కింద కొద్ది రోజులు ఇదే శాఖలో మరొక విభాగానికి బదిలీ చేసి మరలా కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్ గానే పోస్టింగ్ ఇచ్చిన ఘనత అప్పటి రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులది. రాష్ట్ర చరిత్రలోనే ఒక చోట వేటు పడినా ఒక సబ్ రిజిస్ట్రార్‌కు అదే చోట కొద్ది రోజులకే పోస్టింగ్ ఇవ్వడం ఒక రికార్డు. అలాంటి అవినీతి సబ్ రిజిస్ట్రార్ ఉన్నత స్థాయి అవినీతి అధికారుల అండదండలుచూసుకొని మరింతపెట్రేగిపోయారు. చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురం సోత్రియం భూముల అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడ్డారు. దీనిపై 'వార్త'దినపత్రికలో వరుస కథనాలు ప్రచురించడంతో స్పందించిన అప్పటి జిల్లా కలెక్టర్ సబ్ రిజిస్ట్రార్ కే.శ్యామలా దేవిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జే.సుందరేషన్‌ను నియమించారు. సుందరేషన్ కూడ శ్యామలా దేవికి తానేమి తీసిపోనని అక్రమాలకు పాల్పడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేశారు. దీంతో సుందరేషన్ అవినీతిపై ఉన్నత స్థాయిలో ఫిర్యాదులు వెల్లాయి. దీంతో సుందరేషన్‌ను కూడ ఎన్‌ఓ.జీ/ఎక్స్/310/4.9.2024న సస్పెండ్ చేస్తూ కర్నూలు డీఐజి ఉత్తర్వులు జారీ చేశారు. కే.శ్యామలా దేవి, జె.సుందరేషన్ సస్పెన్షన్ తర్వాత కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అప్పటి అన్నమయ్య జిల్లా రిజిస్ట్రార్ మునిశంకరయ్య పలు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌లో జరిగిన అక్రమాలపై విచారణ నిర్వహించారు. విచారణలో అక్రమాలు నిగ్గుతేలాయి. ఈ క్రమంలోనే ఇదే కార్యాలయంలో అక్రమంగా ఆస్థులను రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వానికి చలానా కట్టిన తర్వాత పెండింగ్‌లో పెట్టిన(రిజిస్ట్రేషన్ జరగని డాక్యుమెంట్లు) 163 కార్యాలయం నుంచి మాయమయ్యాయి. మాయమైన డాక్యుమెంట్ల జాడ మాత్రం దొరకలేదు. ఇవన్ని వీరిద్దరికి తెలియకుండా జరగలేదు. దీంతో రాష్ట్ర స్థాయిలో కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో విచారణ ఊపందుకుంది. ఫలితంగా ఈ కార్యాలయంలో 2022, 2023, 2024లో పనిచేసిన కే.శ్యామలాదేవి 62డాక్యుమెంట్లు, జె.సుందరేషన్‌లు పలు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌లో అక్రమాలకు పాల్పడ్డారని నిర్ధారణ అయింది. అందుకే వీరిద్దరిని రిజిస్ట్రేషన్ శాఖలోని 22ఏ,1908 చట్టం ప్రకారం చర్యలు తీసుకున్నట్లు గత నెల 17న కడప డిఐజి వివిఎస్ఆర్ ప్రసాద్ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రశ్నించడంతో వెల్లడించారు. ఈ విధంగా ప్రభుత్వ ఆస్థులు రిజిష్టర్ చేశారు. నిషేధిత భూములను రిజిష్టర్ చేశారు. చనిపోయిన వారి ఆస్థులను రిజిష్టర్ చేశారు. కోర్టులో ఉన్నా కోర్టు ధిక్కారానికి పాల్పడి రిజిష్టర్ చేశారు. ఇంత పెద్దఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడిన సబ్ రిజిస్ట్రార్‌లకు జిల్లా స్థాయిలో సహకరించిన జిల్లా రిజిస్ట్రార్ పివిఎన్ బాబు ఆపై అధికారి అయిన డిఐజి బీ.శివరాంలపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా గత ఏడాది నవంబర్ 29న జిఓ ఎంఎస్ నెంబర్ 277 జారీ చేశారు. కేవలం జిఓ వెలువడింది కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అంతేకాకుండా డీఐజి పి.శివరాంకు కాకినాడ డిఐజిగా కొనసాగారు. అయితే కొద్ది రోజుల క్రితం డిఐజి శివరాం గుండెపోటుతో మరణించారు. ఇక మిగిలిన జిల్లా రిజిస్ట్రార్ పివిఎన్ బాబుపై ఒక్క చర్య కూడ తీసుకున్న పాపాన పోలేదు. అసలు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నట్లు జిఓ ఎందుకు జారీ చేశారు. జిఓ జారీ చేసిన తర్వాత చర్యలు ఎందుకు తీసుకోలేదు? అలాంటప్పుడు జిఓ ఎందుకు జారీ చేశారు? ఒక జిఓ బుట్టదాఖలా అయిందంటే అర్థమేంటి? జిఓ వెలువడి రెండు నెలలు దాటినా ఎందుకు అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని అంతా ప్రశ్నిస్తున్నారు.



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

PUBLIC SERVICES- Sri B. Sivaram, Deputy Inspector General (R&S), Kadapa, and Sri P.V.N. Babu, District Registrar, Kadapa – Common Disciplinary Proceedings under Rule 24 of the Andhra Pradesh Civil Services (Classification, Control and Appeal) Rules, 1991 – Issued.

REVENUE (VIGILANCE-II) DEPARTMENT

G.O.MS.No. 277 Dated: 29-11-2024

ORDER:

Whereas, the Government servants specified below are jointly concerned in a disciplinary case.

1. Sri B. Sivaram, Deputy Inspector General (R&S), Kadapa,
2. Sri P.V.N. Babu, District Registrar, Kadapa

2. Now, therefore, in exercise of the powers conferred by sub-rules (1) and (2) of rule 24 of the Andhra Pradesh Civil Services (Classification, Control and Appeal) Rules, 1991, the disciplinary authority hereby directs: -

i. That disciplinary action against all the said Government servants shall be taken in a common proceeding.

కడప డిఐజి, జిల్లారిజిస్ట్రార్‌లపై క్రమశిక్షణా చర్యలకు ప్రభుత్వం జారీచేసిన జీవో

# డేటా చౌర్యం నిరూపిస్తే 10 కోట్ల బహుమతి

>> చిన సహకారంతో రాష్ట్ర రాజధాని అమరావతి పనుల పురోగతి, పోలవరం పనులు సాగుతున్న తీరును రాజ్ నాథ్‌కి తెలిపారు.ఈ భేటీకి కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మ, టిడిపి పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణ దేవరాయలతో పాటు మరి కొందరు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. ఈ భేటీలో మంత్రి లోకేష్, గత ప్రభుత్వాన్ని ఉద్దేశించి పలు అంశాలను కూడా ప్రస్తావించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా మార్చిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులను దశలవారీగా ముందుకు తీసుకువెళ్తుందన్నారు. గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రం రూ. 10 లక్షల కోట్ల అప్పులలో చిక్కుకుపోయిందన్నారు. ఇప్పుడు కేంద్రం రాష్ట్రానికి ఆక్సిజన్ అందిస్తోందని లోకేష్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్రం సహకారాన్ని అందిస్తున్నందుకు మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాని మోడీ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఏపీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు వివరించారు. ఈ భేటీ అనంతరం రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, రాష్ట్ర అభివృద్ధి కోసం అవసరమైన సహాయాన్ని ఇస్తామని లోకేష్‌కు హామీ ఇచ్చారు.దేశంలో సాంకేతికరంగం పురుడుపోసుకుంటున్న సమయంలో ఆనాడు హైదరాబాద్‌లో చంద్రబాబు ఐటీని ప్రోత్సహించారని ఇప్పుడు ఏఐ రూపంలో మరో అవకాశం వచ్చిందని లోకేశ్ అన్నారు.రాజేంద్రనాధ్ సింగ్‌తో భేటీలో ఆయనను మంత్రి నారాలోకేష్ ఘనంగా సత్కరించారు. ఆయన శ్రీవెంకటేశ్వరుని ప్రతిమను జ్ఞాపికగా అందజేసారు. ఇదే విషయం కేంద్రమంత్రికి వివరించినట్లు సమావేశ అనంతరం మీడియాకు తెలిపారు. ఏపీ అన్ని రంగాల్లో ముందుండాలన్నదే చంద్రబాబు ఆశయమన్న లోకేశ్ దీనికి కేంద్ర సహకారం కోరామన్నారు. కేంద్రమంత్రి తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులు ఏపీ తీసుకురావడానికి కల్పించాల్సిన వాతావరణంపైనా కేంద్రమంత్రితో చర్చించినట్లు తెలిపారు. డేటాసిటీల కోసం ప్రపంచవ్యాప్తంగా 300 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతున్నారని అందులో 100 బిలియన్ డాలర్లు భారత్‌కు వచ్చే వీలుందని లోకేశ్ వెల్లడించారు. అందులో మెజార్టీ వాటా ఏపీకి రావాలన్నదే తమ ఆకాంక్షని ఆశాభావం వ్యక్తం చేశారు. ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్‌లు, ఇఎంసీ 1, 2, 3ల్లో పారిశ్రామిక వాతావరణాన్ని అభివృద్ధి చేయడంపైనా చర్చించామన్నారు. తన అమెరికా పర్యటనలో ఎదురైన అనుభవాలను సైతం వారికి వివరించినట్లు చెప్పారు. త్వరలోనే అశ్వనీవైష్ణవ్ ఏపీలో పర్యటించి విశాఖ, తిరుపతిల్లో తెలుగుదేశం హయాంలో చేపట్టిన పనులు పరిశీలించనున్నారని లోకేశ్ మీడియాకు వెల్లడించారు.వాట్సప్ గవర్నెన్స్‌లో దేశం ఏపీలో ముందడుగు వేసిందన్నారు.పౌరసేవలను అందుబాటులోకి తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. సిఎం చంద్రబాబు ప్రోత్సాహం.సహకారంతో ఇది జరిగిందన్నారు. వాట్సప్ గవర్నెన్స్ డేటా చౌర్యం జరిగినట్లు నిరూపిస్తే రూ.10 కోట్లు బహుమతిగా ఇస్తామని. ప్రకటించారు ఇక మంత్రి నారా లోకేష్ గూగుల్ క్లౌడ్ ఎండీ బిక్రమ్ సింగ్, కంట్రీ డైరెక్టర్ ఆశిష్‌తో విశాఖపట్నంలో గూగుల్ క్లౌడ్ ఏర్పాటుపై చర్చించేందుకు ఈరోజు ఉదయం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో గూగుల్ క్లౌడ్ సంస్థ విశాఖపట్నంలో డేటా సిటీ ఏర్పాటుకు సంబంధించిన కీలక అంశాలు చర్చకు వచ్చాయి. మంత్రి లోకేష్ ప్రభుత్వంతరపున గూగుల్ క్లౌడ్‌కు అవసరమైన అనుమతులు, భూ కేటాయింపులు, త్వరితగతిన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనికోసం ఎపి ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు ఇప్పటికే చురుగ్గా పనిచేస్తోందని చెప్పారు. ఈ క్రమంలో విశాఖపట్నంలో గూగుల్ క్లౌడ్ డేటా సిటీ ఏర్పాటుకు సంబంధించి, కంపెనీ తక్షణమే ప్రాజెక్టును వేగవంతంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఈ ప్రాజెక్ట్ పూర్తైతే విశాఖపట్నం ఐటీ రంగంలో కొత్త దిశలో దూసుకెళ్తుందని, తద్వారా రాష్ట్రంలో ఆర్థిక అభివృద్ధికి దోహదపడతుందని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

### గడప,గడప కార్యక్రమం

# నిలిపివేత

**విజయవాడ,ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర ప్రణాళికా విభాగం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రణాళిక విభాగం ముఖ్య కార్యదర్శి పీయూష్ ఉత్తర్వులు ఇచ్చారు.తొలుత పార్టీ తరపు ఈ కార్యక్రమాన్ని వైకాంగ్రెస్ పార్టీ చేపట్టింది. అనంతరం దీన్ని ప్రభుత్వ కార్యక్రమంగా మార్చేసారు. ఎన్నికలకు ముందు జగన్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల అనంతరం ఈ కార్యక్రమాన్ని నిలిపివేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసారు.

# కూల్చేయండి: హైకోర్టు


>> కావాలని పేర్కొంది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. భీముని పట్నం బీచ్ వద్ద అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు.

# కేసు నమోదు

>> వరకు కడప జైల్లో దస్తగిరి రిమాండ్ ఖైదీగా ఉన్నప్పుడు వివేకా కేసులో వైకాపా నేతలకు మద్దతుగా మాట్లాడాలని డీఎస్పీ నాగరాజు బెదిరించాడు అని అలాగే వివేకా కేసులో నవంబర్ 2023లో కడప సబ్ జైలుకు వచ్చి సిబిఐ ఎస్పి రామసింగ్ కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలని దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు చైతన్య రెడ్డి బెదిరించాడని సాక్ష్యం చెప్పినందుకు గాను రూ.20 కోట్లు ఇస్తామని చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరితో పాటు జైలు సూపరింటెండెంట్ పని చేసిన ప్రకాష్ సబ్ జైలులో వున్నన్ని రోజులు ఇబ్బంది పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై గతంలో ఫిర్యాదు చేసిన ఏటువంటి చర్యలు తీసుకోలేదు అని దస్తగిరి మరొక మారు ఫిబ్రవరి 3వ తేదీన ఫిర్యాదు చేయడంతో పోలీసులు జీరో ఎఫ్ ఐ ఆర్ కింద కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

# డాన్స్ చేస్తూ కుప్పకూలి ఇంటర్ విద్యార్థిని మృతి

**కురవి,ఫిబ్రవరి5,ప్రభాతవార్త:** మండలంలోని సీరోలు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలలో మంగళవారం రాత్రి పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో సపావట్ రోజా(16) విద్యార్థిని డాన్స్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలింది. విషయం తెలుసుకున్న అద్యాపక బృందం సదరు విద్యార్థిని రోజాను మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే విద్యార్థిని మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.



బుధవారం అమెరికానుంచి అమృతసర్ చేరుకున్న అక్రమ వలసదారుల విమానం

## అక్రమ వలసదారులతో అమృత్‌సర్ చేరిన

# అమెరికా విమానం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపిన అమెరికా ప్రభుత్వం కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. చట్టవ్యతిరేకంగా అగ్రరాజ్యంలో అడుగుపెట్టిన వారిని ప్రత్యేక విమానంలో స్వదేశానికి పంపింది. 104 మందితో టెక్సాస్ నుంచి బయల్దేరిన అమెరికా సైనిక విమానం సీ- 17 బుధవారం మధ్యాహ్నం 1.55 గంటలకు పంజాబ్‌లోని అమృత్‌సర్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో దిగింది. వీరిలో 30 మంది పంజాబ్, 33 మంది హర్యానా, 33 మంది గుజరాత్ వాసులతో పాటు మహారాష్ట్ర నుంచి ముగ్గురు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు, ఇద్దరు చండీగఢ్ వాసులు ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. వెనక్కి పంపేముందు ప్రతిఒక్కరి రికార్డులను పరిశీలించినట్లు ఢిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరిన్ని విమానాలు అమెరికా నుంచి భారత్‌కు రానున్నాయని వివరించారు. అమెరికా హోంలాండ్ అధికారుల లెక్కల ప్రకారం 20,407 మంది భారతీయుల వద్ద సరైన పత్రాలు లేనట్లు గుర్తించిన అధికారులు 17,940 మందిని వెనక్కి పంపేందుకు తుది ఉత్తర్వులు జారీ చేశారు. 2,467 మంది ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ నిర్బంధంలో ఉన్నారు. తొలివిడతలో భాగంగా 205 మందిని వెనక్కి పంపించారు. అక్రమవలసదారులపై ట్రంప్ మొదటి నుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే ఎల్ పాసో, టెక్సాస్, శాన్ డియాగో, కాలిఫోర్నియాలో ఉన్న 5,000 మంది అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు పెంటగాన్ సిద్ధమైంది. ఇప్పటికే కొంతమందిని సైనిక విమానాల్లో గటేమాలా, పెరు, హోండూరాస్ తదితర దేశాలకు పలువురిని తరలించింది. అక్రమ వలసదారులపై అమెరికా అనుసరిస్తున్న విధానాల పట్ల ఇప్పటికే భారత్ తన స్పందనను తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికాతో సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

# 'మహాకుంభ్'లో ప్రధాని మోడీ

>> వద్ద పుణ్యస్నానం ఆచరించారు. ఆ తర్వాత గంగానదికి హారతి ఇచ్చి పూజలునిర్వహించారు. ప్రయాగరాజ్ విమానాశ్రయంలో దిగినప్రధానిమోడీ అక్కడినుంచి అరైల్‌ఘాట్‌కువెళ్లారు. ఘాట్‌నుంచి బోటులోప్రయాణించి మహాకుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం త్రివేణి సంగంలోప్రధానిపుణ్యస్నానం ఆచరించారు. అంతకుముందు అక్కడి బోటులోప్రయాణించారు. స్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులకు పడవనుంచే అభివాదంచేస్తూ ముందుకు సాగారు. ఆయన వెంట యుపి సీఎం యోగి ఆదిత్యనాథ్‌కూడా ఉన్నారు. 144 ఏళ్లకోసారి వచ్చే ఈ మహాకుంభమేళా జనవరి 13న ప్రారంభం కాగా భారత్‌తోపాటు విదేశాలనుంచి భారీ సంఖ్యలో భక్తులువచ్చి త్రివేణి సంగమంలో స్నానమాచరిస్తున్నారు. ఈనెల 26వ తరకూ ఈ వేడుక జరుగుతుంది. బుధవారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్‌రిజిజు కూడా పుణ్యస్నానమాచరించారు. మొత్తం ఇప్పటివరకూ 38 కోట్లమంది పుణ్యస్నానాలుచేసారని యుపి సమాచార శాఖప్రకటించింది. ఈచరిత్రాత్మక సమయంలో రాజకీయాలు చేయవద్దని చెప్పారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలివస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ మార్గదర్శకాలను పాటించాలన్నారు. మహాకుంభమేళాప్రారంభానికిముందు ప్రధానిమోడీప్రయాగరాజ్‌కువెళ్లారు. రూ.5500 కోట్లతో అభివృద్ధి ప్రాజెక్టులు, ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలుచేసారు.

# ఎపిఎస్ ఆర్టీసీకి బోర్డు ఏర్పాటు

**విజయవాడ,ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్ ఆర్టీసీకి బోర్డును ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 17 మంది సభ్యులతో బోర్డు ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ ఇచ్చింది. ఛైర్మన్ కొనకళ్ల నారాయణ సహా ఆరుగురు నామినేటెడ్ సభ్యులు, 11 మంది అధికారులతో ఆర్టీసీ బోర్డును ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆర్టీసీ ఎండీ, ఆర్థిక, రవాణా, సాధారణ పరిపాలన శాఖ, ఇతర శాఖలు, విభాగాల ఉన్నతాధికారులతో బోర్డును ఏర్పాటు చేసింది. బోర్డులో కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రాతినిధ్యం వహించేలా అధికారులు ఉండనున్నారు. రెండేళ్ల పాటు ఆర్టీసీ వ్యవహారాలను పర్యవేక్షించేలా బోర్డును ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.

# కేంద్రమంత్రి కుమారస్వామితో మంత్రి లోకేశ్ భేటీ

## విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.12వేల కోట్ల నిధులు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు

**విజయవాడ,ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర భారీపరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అక్కడే ఉన్న ఆయన తండ్రి, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడను కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుజ్జీవనానికి సుమారు రూ.12వేల కోట్ల నిధులు విడుదల చేసినందుకు కుమారస్వామికి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఎపి ప్రజల సెంటిమెంట్‌తో పాటు వేలాదిమంది కార్మికుల ఆందోళన, మనోభావాలను అర్థం చేసుకుని పెద్దమనసుతో సహకారం అందించారని కొనియాడారు. స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయడం, ఉత్పాదకత పెంపుదలకు చర్యలు చేపట్టడం, కార్మికుల సమస్యలను నేరుగా తెలుసుకోవడంలో మీ చొరవ శ్లాఘనీయమని అన్నారు.అనకాపల్లి వద్ద ప్రైవేటురంగంలో ఏర్పాటుకానున్న ఆర్సెలర్స్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్స్ ఉక్కు పరిశ్రమ వల్ల ఏపీ యువతకు పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు లభిస్తాయని మంత్రి లోకేశ్ తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రం తరపున అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు.

**క్యాన్సర్ బాధితుడికి మంత్రి నారాలోకేష్ సాయం**

క్యాన్సర్ చికిత్సకు సాయం చేయాలంటూ ఓ బాధితుడి కుటుంబం పెట్టిన ట్వీట్‌కు మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించారు. అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. అప్పటికప్పుడు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.3 లక్షలకు ఎల్వోసీ మంజూరు చేశారు. బాధితుడి కుటుంబంతో తన టీమ్ మాట్లాడి వివరాలు సేకరించిందని చెప్పారు. దీంతో క్యాన్సర్ చికిత్సకు అయ్యే ఖర్చును ప్రభుత్వం తరఫున భరించాలని నిర్ణయించామని తెలిపారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.

గుంటూరు జిల్లా ధర్మకోటకు చెందిన గార్లపాటి బ్రహ్మయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య పరీక్షల్లో ఆయన క్యాన్సర్ బారిన పడినట్లు తేలింది. చికిత్సకు సుమారు రూ.5 లక్షల వరకు అవుతుందని వైద్యులు తెలిపారు. బ్రహ్మయ్య కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో ఆయన కుటుంబ సభ్యులు మంత్రి నారా లోకేశ్ ను సాయం కోరారు. ట్విట్టర్ లో వివరాలు పోస్టు చేస్తూ ఆదుకోవాలంటూ మంత్రి నారా లోకేశ్ కు విజ్ఞప్తి చేశారు. ఈ ట్వీట్ కు స్పందించిన మంత్రి.. తన టీమ్ ఫోన్ చేస్తుందని చెప్పారు. బాధితుడి వివరాలు తెలుసుకున్న తర్వాత సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎల్వోసీ జారీ చేశారు. కాగా, అడిగిన వెంటనే స్పందించిన మంత్రి నారా లోకేశ్ కు బ్రహ్మయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# రెన్యువల్ రద్దుకు ట్రంప్ నిర్ణయం

>> అందువల్ల బైడెన్ నిర్ణయాన్ని రద్దుచేయాలని ఆ ఇద్దరు తీర్మానం ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వ నిబంధనను 2025 జనవరి 13న డిపార్టుమెంట్ ఆఫ్‌హోమ్‌ల్యాండ్‌సెక్యూరిటీ ఖరారుచేసింది. ఇది వలసదారులు,శరణార్థులు, గ్రీన్‌కార్డుదారులు హెచ్‌వన్‌బి ఎల్‌వన్ వీసాదారుల భార్యలపై ప్రభావంచూపించింది. భారీ సంఖ్యలో వర్క్ వీసాలపై పనిచేస్తున్న భారతీయులు లబ్దిపొందారు. సెనేటర్లు జాన్‌కెన్నెడీ, రిక్‌స్కాట్‌లు కాంగ్రెస్ రివ్యూయాక్ట్‌కింద గతనెల 31న బైడెన్ నిర్ణయానికి రద్దుతీర్మానంప్రతిపాదించారు. కెన్నడీ మాట్లాడుతూ గత సర్కారునిర్ణయం ప్రమాదకరమైనదన్నారు. బైడెన్ కార్యవర్గం వర్క్ పర్మిట్స్‌ను ఆటోమేటిక్‌గా 540 రోజులు పొడిగించేలా నిబంధన తీసుకొచ్చింది. ఇది ఇమ్మిగ్రేషన్‌చట్టాల అమలును దెబ్బతీస్తుంది. అమెరికా భద్రతకు సైతం ముప్పు తెస్తుందని కెన్నడీ వ్యాఖ్యలుచేసారు. బైడెన్ నిర్ణయాన్ని స్కాట్ ఖండించారు. అక్రకమ వలసదారులు ఏళ్లతరబడి అమెరికాలో ఉద్యోగాలుచేసేందుకు ఇది సహకరిస్తుందని వ్యాఖ్యానించారు. ఈ నిబంధనలు రద్దుచేయకుండా అక్రమ వలసదారులను గుర్తించడం కష్టమని అభిప్రాయం వ్యక్తంచేసారు.

## వారం - వర్జ్యం

తేది : 06-02-2025, గురువారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
నవమి రా.10.54
కృత్తిక రా.7.28
వర్జ్యం : ఉ.8.06-9.42
దు.ఉ.10.36-11.12
2) మ.3.10-3.56
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగాలలో స్థానమార్పులు.

**వృషభం:**భూ, గృహ లాభం పొందుతారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి.

**మిథునం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. వస్తులాభం ప్రయాణాలలో పరిచయాలు.

**కర్కాటకం:**దూరప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. సోదరుల కలయిక. కాంట్రాక్టు లభిస్తాయి.

**సింహం:**నూతన పరిచయాలు పెరుగుతాయి. పనులలో విజయం సాధిస్తారు. వస్తు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తాయి సంఘంలో ఆదరణ పొందుతారు. బంధువుల నుండి సాయం అందిస్తారు.

**తుల :** ఉద్యోగాలలో మార్పులు వుంటాయి. అనుకోని సమస్యలు ఎదురవుతాయి. వాటిని పరిష్కరించుకుంటారు.

**వృశ్చికం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకొంటారు. ధనవ్యయం పెరుగుతుంది.

**ధనుస్సు:** గృహనిర్మాణ ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఉద్యోగాలలో బదిలీలు వుంటాయి.

**మకరం:**కుటుంబ సమస్యలు ఎదురై చికాకు పరుస్తాయి. ఇంటా బయటా అనుకూలంగా వుంటుంది.

**కుంభం:** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మీనం :** కుటుంబ సభ్యుల నుండి వత్తిడులు ఎదురైన అధిగమిస్తారు. స్వల్పధనలాభం పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

06-02Pg3exHMNWJQEP.qxd:06-02Pg3exHMNWJQEP.qxd 01/01/01 8:23 AM Page 1





విశాఖ రైల్వేస్టేషన్ ఇమేజ్ ఫోటో

## విశాఖ రైల్వే జోన్ ఎఫెక్ట్!

**- మరోసారి గుంతకల్లు రైల్వే డివిజన్ కుదింపు**
**- రైల్వే కొత్త జోన్‌లు, డివిజన్‌ల ఏర్పాటుతో 332.62 కి.మీలు కోల్పోనున్న గుంతకల్లు రైల్వే డివిజన్**

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త** విశాఖ పట్నం ప్రధాన కేంద్రంగా ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు సంబంధించి తాజాగా ప్రాజెక్టు సమగ్ర నివేదిక(డిపిఆర్)ను సమర్పించమని,రైల్వే బోర్డు యాజమాన్యం, సంస్కరణల విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్ ఓఎస్‌డిని ఆదేశించారు. కేంద్ర క్యాబినెట్ 2019ఫిబ్రవరి 28న విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను,కొత్తగా రాయగడ రైల్వే డివిజన్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పట్లో దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని విజయవాడ,గుంటూరు,గుంతకల్లు డివిజన్‌లను కలుపుకొని దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. డివిజన్ కేంద్రాన్ని ఎత్తివేసి విశాఖను జోనల్ ప్రధాన కేంద్రం చేయడం పట్ల ప్రజల నుంచి ఆక్షేపణలు రావడంతో తాజాగా పలస-విశాఖపట్నం- దువ్వాడ, కునేరు-విజయనగరం,నౌపాడు-పర్లాకిమిడి,బొబ్బిలి-సాలూరు,సింహాచలం-దువ్వాడ-విశాఖ స్టీల్‌ప్లాంట్-జగ్గయ్య పాలెం సెక్షన్లలోని 410కి.మీలతో విశాఖ రైల్వే డివిజన్‌ను కొనసా గిస్తూ, అదనంగా దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని విజయవాడ,గుంటూరు,గుంతకల్లు డివిజన్‌లను కలుపుకుని దక్షిణ కోస్తా రైల్వేజోన్‌ను ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ఇందులో భాగంగా గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో రాయచూరు- వాడి108కి.మీ సెక్షన్‌తో పాటు,గుంటూరు డివిజన్‌లోని విష్ణుపురం-పగిడిపల్లి-జన్ పహాడ్-140కి.మీలను సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ చేయాలని నిర్ణయించారు. అలాగే సికింద్రాబాద్ డివిజన్‌లోని కొండపల్లి- మొటుమర్రి 46కి.మీల సెక్షన్‌ను విజయవాడ డివిజన్‌లో బదిలీ చేయాలన్నారు.

# టిటిడిలో అన్యమత ఉద్యోగులపై బదలీవేటు

## చైర్మన్ తొలి హామీపై ఉత్తర్వులు జారీ

## 18 మందిని విధులకు దూరంపెట్టిన పాలకమండలి

**తిరుమల,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూయేతర ఉద్యోగుల బదిలీ,స్వచ్ఛంద పదవీవిరమణ చేయించి ఇంటికి సాగనంపుతామని టిటిడి పాలకమండలి ఛైర్మన్‌గా బిఆర్‌నాయుడు ప్రమాణస్వీకారానికి ముందే చెప్పిన హామీని తాజాగా ఇప్పుడు అమలుచేయించారు. దేవుని కొలువులో ఉంటూ భక్తులు సమర్పించే కానుకలతో గోవిందుని సేవచేయాల్సిన ఉద్యోగులు ఇతర మతాల ఆచారాలు పాటిస్తూ లక్షలాదిరూపాయలు వేతనాలు తీసుకుంటుండటం విశేషం.దీనిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసిన టిటిడి పాలకమండలి రాష్ట్ర దేవాదాయశాఖ చట్టం 1060, 24-10-1989 ప్రకారం హిందుమత సాంప్రదాయాన్ని అనుసరిస్తామని ప్రమాణం చేసి టిటిడిలో ఉద్యోగం పొందిన తరువాత నిబంధనలకు విరుద్దంగా, దేవుని పవిత్రతను దెబ్బతీస్తున్న కొందరు ఉద్యోగులను గుర్తించిన టిటిడి పాలకమండలి దీనికి సంబంధించి 2024 నవంబర్ 18వతేదీ బోర్డులో తీర్మానం చేశారు. ఆ మేరకు ఇప్పుడు టిటిడిలోని పలు కీలక విభాగాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 18మంది అన్యమత ఉద్యోగులను ఎట్టకేలకు బదిలీ చేస్తూ టిటిడి ఇఒ జె.శ్యామలరావు ఉత్తర్వులు జారీచేశారు. అంతేగాక హిందూమతేతర కార్యక్రమాల్లో పాల్గొంటూనే టిటిడి నిర్వహించే దేవుని ఉత్సవాల్లోనూ హాజరవుతున్న 18మంది ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలు వెలువడ్డాయి. వీరిలో డిప్యూటీ ఇఒ స్థాయి అధికారితోబాటు ఇద్దరు కళాశాలల ప్రిన్సిపాళ్ళు కూడా ఉండటం గమనార్హం. ఇప్పుడు బదిలీచేసిన హిందూయేతర ఉద్యోగులను టిటిడి ఆలయాల్లో జరిగే ఉత్సవాలు, ఊరేగింపులు ఇతర హిందూ కార్యక్రమాల విధులకు నియమించకూడదని ఆదేశాల్లో స్పష్టం చేశారు.టిటిడి ఆధ్వర్యంలోని టిటిడి పరిపాలన భవనంలోని వెల్ఫేర్‌విభాగంలో డిప్యూటీ ఇఒ ఎ.ఆనందరాజు, పద్మావతి మహిళ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.అసుంత, ఎస్వీఆయుర్వేదకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుడిక్సిట్ , ఆయుర్వేదకళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కె.వి. విజయభాస్కర్‌రెడ్డి, వేలంవిభాగంలోని జనరల్ మేనేజర్ వద్ద ఎఇఒగా ఉన్న ఎ.రాజశేఖరబాబు, పద్మావతి మహిళ డిగ్రీ, పిజి కళాశాల అధ్యాపకురాలు కె.సుజాత, గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు కె.ప్రతాప్, ఎస్వీఆర్ట్సు కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకుడు కె.మనేక్స వదయాన్, కాంట్రాక్టు హాస్టల్ వర్కర్ ఎన్‌సి భీమన్న, ఉద్యోగుల శిక్షణాకేంద్రం శ్వేతలో ఆఫీసు సబార్డినేట్ విబి కోమలాదేవి, తిరుమలలోని విద్యుత్‌విభాగం డిఇ కార్యాలయంలో ఎలక్ట్రికల్ హెల్పర్ ఎం.శేఖర్, తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న ఎ.సౌభాగ్యం, తిరుపతిలోని సిఇ కార్యాలయంలో ఎఇ ఎంఎస్ కన్నిగ,తిరుపతి అక్కారంపల్లిలోని ఎస్వీపూర్ హోమ్‌లో ఎంఎన్‌ఒ టి.నారాయణస్వామి, సిఇ కార్యాలయంలో ఎలక్ట్రికల్ అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ జి.ఆశీర్వాదం, బర్డ్ ఆస్పత్రిలో హెడ్‌నర్సు టి.కల్యాణి, నర్సు ఎస్.రోసి, కేంద్రీయ వైద్యశాల తిరుపతిలో రేడియోగ్రాఫర్ జి.గోపి హిందూయేతర ఉద్యోగులుగా టిటిడిలో ఉండటంతో వీరిని బదిలీ చేశారు. గతంలోనూ పలువురు అధికారులు టిటిడిలో వివిధ హోదాల్లో పనిచేస్తూ ప్రతి ఆదివారం ఉదయం ఏకంగా టిటిడి వాహనంలోనే ప్రార్దనా మందిరాలకు వెళ్ళిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

# పిచ్చాటూరు ప్రాజెక్టు వద్ద వ్యూటవర్

**శ్రీకాళహస్తిఫిబ్రవరి 5 ప్రభాతవార్త** తిరుపతిజిల్లాలో పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ అన్నారు. బుధవారం శ్రీకాళహస్తికి సుమారు 35 కిలో మీటర్ల దూరంలోని ఆరణియార్ మీడియం సాగునీటి ప్రాజెక్టు వద్ద తుడా నిధులు రూ.2కోట్లతో వ్యూటవర్,బోటింగ్ జెట్టి పనులను కలెక్టర్ వెంకటేశ్వరన్ ప్రజాప్రతినిధులు,ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో పర్యాటకం అభివృద్ధికి ఎన్నో సదుపాయాలున్నాయన్నారు.ఈ నేపథ్యంలో ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు వివరించారు. సత్యవేడు శాసనసభ్యుడు కోనేటి ఆదిమూలం, శ్రీకాళహస్తి ఆర్‌డిఒ భానుప్రకాష్‌రెడ్డి ఇరిగేషన్ ఇఇ మదన గోపాల్‌తో కలసి ఆరణియార్ ప్రాజెక్టు వద్ద అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆరణియార్ ప్రాజెక్టు వద్ద మత్స్యశాఖ రూ.14లక్షలు ప్రధాని మత్స్య సంపదయోజన పథకంలో ఏర్పాటు చేసిన పథకంలో చేపలను ప్రాజెక్టులో వదలి పెట్టారు. అలాగే అక్వేరియం చేపల పెంపకం యూనిట్ ను కలెక్టర్ పరిశీలించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా సత్యవేడు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. నారాయణ వనం మండలం పాలమంగళం గ్రామం నుంచి రెండు ఎలక్కాటూరు,కాశీమిట్ట గ్రామాలకు సుమారు రూ.20లక్షలతో నిర్మించే సిమెంటు రోడ్డుపనులకు భూమి చేసారు. అలాగే శాసనసభ్యుడు కోనేటి ఆదిమూలం పాఠశాలలో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఇక్కడ అమలు జరుగుతున్న మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మమేకమై భోజనం సరఫరా మెను గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పిచ్చాటూరు గ్రామం నుంచి దళిత వాడ వరకు రూ.13.5 లక్షల తో నిర్మించిన నూతన రోడ్డును ఎంఎల్‌ఏ, కలెక్టర్ కలసి ప్రారంభించారు.



టవర్‌వ్యూను పరిశీలిస్తున్న కలెక్టర్,వివరిస్తున్న ఇఇ

# ప్రభుత్వ విజిలెన్స్ నివేదికలపై టిటిడిలో అంతా గప్‌చుప్!

**తిరుపతి,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో నిబంధనలకు విరుద్దంగా ఇంజనీరింగ్ పనులకు భారీ మొత్తంలో నిధుల కేటాయింపుపై అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై గత ఏడాది విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం లోతుగా దర్యాప్తు చేపట్టింది. ఇందులో భాగంగా టిటిడి వార్షిక బడ్జెట్ 5వేల కోట్ల రూపాయలు అంచనా అయితే అందులో గత ఏడాదిలోనే నాలుగునెలల కాలంలోనే 1,500కోట్ల రూపాయలు ఇంజనీరింగ్ విభాగంలో పనులకు గత ప్రభుత్వం నిధులు కేటాయించడం పెద్ద దుమారాన్ని రేపింది. గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి ధర్మకర్తలమండలి ఆదేశాలతో ఇంజనీరింగ్ పనుల్లో అక్రమాలు జరిగాయని, అవినీతిమయమైందని ఆరోపణలపై గతంలోనే 58మంది ఇంజనీరింగ్ అధికారులతో బాటు ఇద్దరు మాజీ ఛైర్మన్‌లు మాజీ ఇఒలు విశ్రాంత సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, మాజీ విశ్రాంత ఇఒ ఏవి ధర్మారెడ్డిలతో బాటు టిటిడి ఎఫ్ఎసిఎఒ బాలాజీలకు ప్రభుత్వ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నోటీసులు కూడా జారీచేసిన విషయం విదితమే. ఈ నోటీసులపై ఇంజనీరింగ్ అధికారులు తలలుపట్టుకుని ధర్మకర్తలమండలి, ఉన్నతాధికారుల ఆదేశాలతోనే తామిలా చేయాల్సివచ్చిందని సమాధానాన్ని విజిలెన్స్ అధికారులకు విన్నవించుకున్నట్లు తెలిసింది. ఇదే అంశంపై గత ఏడాదిలోనే నోటీసులు అందుకున్న మాజీ ఛైర్మన్‌లు ,మాజీ విశ్రాంత ఇఒలు ,ఎఫ్ఎసిఎఒలు విజిలెన్స్ అధికారులకు తగిన సమాధానం లేకపోయిందనేది కొసమెరుపు. గత ఏడాది నవంబర్‌లోనే ఈ వ్యవహారం ఎక్కడకు దారితీస్తుందనేది టిటిడిలో సంచలనంగా మారింది. గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలోని టిటిడి ధర్మకర్తలమండలి ఛైర్మన్‌లుగా సుబ్బారెడ్డి నాలుగుసంవత్సరాలు, ఛైర్మన్‌గా ఆఖరు ఏడాదిలో భూమన కరుణాకర్‌రెడ్డి వ్యవహరించారు. వీరి పాలనలో టిటిడి ఇఒలుగా విశ్రాంత మాజీ సిఎస్ జవహర్‌రెడ్డి, ధర్మారెడ్డిలు బాధ్యతలు నిర్వర్తించారు. వీరిరువురూ టిటిడిలో సర్వంతామై చక్రం తిప్పారని, దర్శన టిక్కెట్ల నుండి చివరకు ఇంజనీరింగ్ పనులకు భారీ మొత్తంలో నిధులు కేటాయించడం, శ్రీవాణి ట్రస్ట్ పేరుతో విరాళాల రూపంలో నిధులు సేకరణ తదితర వాటిపై తిరుపతికి చెందిన బిజెపి నేత,టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బిజెపినేత నవీన్‌కుమార్‌రెడ్డి, జనసేననేత కిరణ్‌రాయల్ ప్రభుత్వానికి ఆధారాలతో ఫిర్యాదు కూడా చేశారు. దీంతో కూటమి ప్రభుత్వం గతంలో టిటిడిలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై ప్రభుత్వ విజిలెన్స్‌ను ఆదేశించడం, దాదాపు 20మందివరకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు గత ఏడాది తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో సోదాలు చేశారు. ఇంజనీరింగ్ విభాగం, ఆర్జితసేవా టిక్కెట్ల కార్యాలయం, సిఇ కార్యాలయం ,రోడ్లనిర్మాణానికి సంబంధించి కార్యాలయాల్లో కంప్యూటర్లు తనిఖీ చేశారు. రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయితే వీటన్నిటిపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికల చర్యలు ఏంటనేది అంతా గప్‌చుప్‌గానే మిగిలిందని టిటిడి ఉద్యోగులు గుసగుసలు.

### కుప్పం నియోజకవర్గం
## సమగ్రాభివృద్ధికి
### అధికారులతో సిఎంవో సమీక్ష

**విజయవాడ.ఫిబ్రవరి5.ప్రభాతవార్తప్రతినిధి:** కుప్పం నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శ నియోజక వర్గరంగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. నియోజకవర్గాన్ని రాష్ట్రానికే తలమానికంగా తీర్చిదిద్దుతానని చంద్రబాబు గతంలో హామీ ఇచ్చారు. అందులో భాగంగా కుప్పం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దేందుకు సీఎంవో సమీక్షలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా ఆ నియోజకవర్గంలో గ్రివెన్స్ లోని ఫిర్యాదులతో పాటు భూ వివాదాలు, భూసమస్యల సత్వర పరిష్కారం కోసం చర్యలపై అధికారులతో చర్చిస్తున్నారు. అంతేకాకుండా కుప్పాన్ని అభివృద్ధి పథంలో ముందుంచాలనే సీఎం ఆదేశాల మేరకు సీఎంవో కార్యాచరణ రూపొందించింది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రైతులకు లాభసాటి వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, సాగు, తాగు నీటి ఎద్దడికి పరిష్కారం వంటి అనేకమైన సమస్యలపై అధికారులకు సీఎంవో దిశానిర్దేశం చేస్తోంది.

# తిరుమల సమాచారం

## 11 నుండి త్రైమాసిక మెట్లోత్సవం

### - మూడు రోజులు సామూహిక భజనలు

**తిరుమల,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 11వతేదీ మంగళవారం నుండి 13వతేదీ గురువారం వరకు మూడురోజులు త్రైమాసిక మెట్లోత్సవం జరుగుతుంది. తిరుపతిలో 11,12తేదీల్లో మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 4గంటల వరకు భజనమండళ్ళు సామూహిక భజన కార్యక్రమాలు , నామసంకీర్తన, ధార్మికసందేశాలు, మహనీయులు మానవాళికి ఉపదేశాలు తెలియజేస్తారు. సాయంత్రం సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 13న ఉదయం 8.30గంటలకు సామూహిక నామసంకీర్తన, 9.30గంటల నుండి స్వామీజీల ధార్మిక సందేశాలు ఇవ్వనున్నారు. 12న ఉదయం 4.30గంటలకు అలిపిరి పాదాలమండపం వద్ద మెట్లపూజ నిర్వహిస్తారు. అనంతరం వేలసంఖ్యలో వచ్చే భజన మండళ్ళ సభ్యులతో సాంప్రదాయ భజనలు చేస్తూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. గతంలో ఎందరో మహనీయులు భక్తిప్రపత్తులతో వేంకటాద్రి పర్వతాన్ని కాలినడకన అధిరోహించి స్వామివారి అనుగ్రహం పొందారు. అలాంటివారి అడుగుజాడల్లో నడిచి ఆ దేవదేవుని కృపకు పాత్రులు కావాలని తలంపుతో దాస సాహిత్య ప్రాజెక్టు మెట్లోత్సవం కార్యక్రమం నిర్వహిస్తోంది.



## శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల,ఫిబ్రవరి 5ప్రభా తవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం ఉదయం ప్రముఖులు దర్శించుకున్నారు. వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఉదయం విఐపి బ్రేక్‌లో భారత మహిళ క్రికెటర్ స్మృతి మంధాన, హిమాచల్‌ప్రదేశ్ మాజీ సిఎం జైరాంఠాగూర్ స్వామివారి ఆశీస్సులందుకున్నారు.



## అందరి సమన్వయం.. సహకారం

### - రథసప్తమిన అశేషభక్తులకు సంతృప్తికర సేవలు
### - వాహనసేవల వీక్షణంతో భక్తులు ఆనందపరవశం

**తిరుమల,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన మాఘమాసంలో సప్తమి తిథిన మంగళవారం రథసప్తమిరోజున ఉదయం నుండి రాత్రి వరకు ఏడుకొండల్లో అంగరంగవైభవంగా ఏడు వాహనసేవలు ఊరేగాయి. ఈ వాహన సవల వీక్షణకు ముందురోజు రాత్రే 2లక్షల మంది భక్తులు ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకున్నా 24గంటలుపాటు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, పోలీసు, విజిలెన్స్, శ్రీవారిసేవకులు, ఇతర డిప్యూటేషన్ సిబ్బంది విజయవంతంగా భక్తులకు సేవలందించడం అభినందనీయం. గత పదిరోజులు నుండి పక్కా ప్రణాళికలు....కార్యాచరణతో టిటిడి ఉద్యోగులు, తిరుపతి జిల్లా పోలీసుయంత్రాంగం, టిటిడి నిఘాభద్రత విభాగం సమన్వయంతో పనిచేయడంతో 2లక్షలమంది పైగా భక్తులకు ఏడువాహనసేవలు వీక్షణం ప్రశాంతంగా చేయించారు. సాధారణంగా ఏడుకొండలపై 70వేలమంది భక్తులు పెరిగితేనే అటు స్వామివారి దర్శనం ఇటు వసతి సదుపాయం గగనంగా మారుతుంది. టిటిడి అధికారులు తలలుపట్టుకునే పరిస్థితి ఎదురవుతుంది. అలాంటిది ఒక్కసారిగా 2.50లక్షలమంది భక్తులు కిటకిటలాడినా చిన్నపాటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించడం టిటిడి పనితీరు అభినందనీయం. ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీల్లో గంటలుగంటలు నిరీక్షించి వేచివున్న ,ప్రతి భక్తునికి శ్రీవారిసేవకులు, పోలీసులు, టిటిడి నిఘాభద్రత సిబ్బంది, ఉద్యోగులు చక్కటి సేవలందించి అన్నప్రసాదాలు, తాగునీరు, టీ అందించి భక్తుల మన్ననలు అందుకున్నారు. అశేషభక్తులకు నిరంతరాయంగా సకల సదుపాయాలు కల్పించడం వెనుక టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, టిటిడి సివిఎస్‌ఒ మణికంఠ చందోలు ,విఎస్ ఒలు ఎన్టీవి రామ్‌కుమార్, సురేంద్ర తదిత రులు తమతమ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ స్వయం గా పరిశీ లించారు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
**ప్రింటింగ్, స్టేషనరీ మరియు స్టోర్స్ శాఖ**
**ఇ-టెండరు ప్రకటన**

నెం: 20/అడ్మిన్/ఎ3/2024-25, తేది: 04.02.2025

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్‌కు సంబంధించిన ఎ3 సైజులో సుమారుగా లక్ష ముప్పది కాపీలు ముద్రించుటకు ప్రైవేటు ప్రింటర్స్ నుండి కొటేషన్ ఇ-టెండర్ ద్వారా కోరబడుచున్నవి. కేవలం ప్రింటింగ్ చార్జీలు మాత్రమే ఇవ్వబడును. (పేపర్ కమిషనర్ ప్రింటింగ్ వారు సరఫరా చేయబడును). ఇ-టెండర్లు జారీ చేయు తేది: 05.02.2025 నుండి 12.02.2025 వరకు. ఇతర వివరాలను కమిషనర్ ఆఫ్ ప్రింటింగ్, విజయవాడ వారి కార్యాలయము నందు పొందగలరు.

DIPR.NO. 15312/CL/ADVT/1/1/2022-23 తేది: 05.02.2025 సం/-.డిజిపి మరియు కమిషనర్.

# ఎఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఎపిలో ఏర్పాటు చేయండి

### - కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు మంత్రి లోకేష్ వినతి
### - విశాఖలో త్వరలోనే కొత్త పరిశ్రమల కార్యకలాపాలు

**విజయవాడ,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త ప్రతినిధి:**కేంద్ర బడ్జెట్‌ల ప్రకటించిన ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎడ్యుకేషన్ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పాలని రాష్ట్ర విద్య,ఐటీ శాఖల మంది నారా లోకేష్ కేంద్ర రైల్వే ఐటీ,ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. కేంద్ర మంత్రిని కలవడానికి ప్రత్యేకంగా ఢిల్లీ వచ్చిన ఆయన మంగళవారం రాత్రి ఇక్కడ రైల్‌భవన్‌లో సుమారు రెండు గంటల పాటు సమావేశమయ్యారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో రాబోతున్న అవకాశాలను అందిపుచ్చుకోడానికి ఏపీ సిద్దంగా ఉందని, ఇందుకు కేంద్రం సహకరించాలని కోరారు. విశాఖలో తాము ఏర్పాటు చేయాలనుకున్న డేటాసిటీకి సహకరించాలన్నారు. భేటీ అనంతరం లోకేష్ విలేకర్లతో మాట్లాడారు. ఏపీలో ఐటీ,ఎలక్ట్రానిక్స్ రంగాల్లో మేం చేపట్టబోయే కార్యక్రమాలేంటి?కేంద్రం నుండి ఏం ఆశిస్తున్నామో వివరించారు. వై2కే వల్ల ఆనాడు హైదరాబాద్‌లో ఐటీని ప్రోత్సహించాం. ఇప్పుడు ఏఐ రూపంలో అలాంటి అవకాశం దేశానికి, ముఖ్యంగా విశాఖకు వచ్చిందని కేంద్ర మంత్రికి చెప్పాను. ప్రత్యేక ఆర్థిక మండళ్ళు ,డేటా సిటీల ఏర్పాటుపై కేంద్ర ఆర్థికమంత్రితో మాట్లాడాలని కోరాను.ఏపీ అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా ఉండాలని, అందుకు మీరు అన్ని సహకారం అందిస్తామని కేంద్ర మంత్రి హామీనిచ్చారు. ఆయన సూచనలను సిఎం దృష్టికి తీసుకెళ్తామని లోకేష్ వివరించారు. అదే మా స్వార్థం' ఐటీ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులను ఏపీకి తీసుకురావడానికి కల్పించాల్సిన వాతావరణంపై కేంద్ర మంత్రితో చర్చించాం. డేటా సిటీల కోసం ఏటా ప్రపంచవ్యాప్తంగా 300 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతున్నారు.

## సిఎం కాన్వాయ్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తోన్న ఎండీ అమీన్ బాబు గుండెపోటుతో మృతి

**- అమీన్ బాబు మృతిపట్ల విచారం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు**

**విజయవాడ,ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:**సీఎం చంద్రబాబు కాన్వాయ్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తోన్న ఎండీ అమీన్ బాబు గుండెపోటుతో మరణించారు. అమీన్ బాబు మృతిపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతాపం వ్యక్తం చేశారు. సీఎం కాన్వాయ్‌లోని వాహనశ్రేణిలో డ్రైవర్‌గా సుదీర్ఘకాలంగా అమీన్ బాబు విధులు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తెల్లవారుజామున అమీన్ మృతి చెందారు.

## వైరల్ జ్వరంతో ఇబ్బందిపడుతున్న డి సిఎం పవన్ కల్యాణ్



**విజయవాడ,ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొణిదెల వైరల్ జ్వరంతో ఇబ్బందిపడుతున్నారు.ఆ మేరకు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అధికారికంగా ప్రకటన విడుదల చేసారు.పవన్ జ్వరంతోపాటు స్పాండిలైటిస్ ఇబ్బంది పడుతున్నారు. వైద్యుల సూచన మేరకు ప్రస్తుతం విశ్రాంతి తీసుకొంటున్నారు. వీటి మూలంగా గురువారం నాటి రాష్ట్ర క్యాబినెట్ సమావేశానికి పవన్ కల్యాణ్ గారు హాజరు కాలేకపోవచ్చునని డి సీఎం కార్యాలయం తెలిపింది.

## జగన్ 2.0 తథ్యం - ఈసారి కార్యకర్తలకే ప్రాధాన్యం : మాజీ సిఎం

**విజయవాడ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మరోసారి జగన్ 2.0ని చూడబోతున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు , మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కార్యకర్తల కోసం జగన్ ఎలా పని చేస్తాడో చూపిస్తానన్నారు.తొలివిడతలో ప్రజల కోసం తాపత్రయం పడ్డాను. వారికి మంచి చేసే విషయంలో కార్యకర్తలను ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వలేకపోయానన్నారు.బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో విజయవాడ నగరపాలక సంస్థ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పుడు చంద్రబాబు మిమ్మల్ని పెడుతున్న కష్టాలు, బాధలను చూశాను. ఎక్కడ ఉన్నా తీసుకువచ్చి చట్టం ముందు నిలబెడతానన్నారు.అక్రమ కేసులు పెట్టిన వారిపై ప్రైవేటు కేసులు చేస్తామని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బెదిరిస్తారు, దొంగకేసులు పెడతారు. జైల్లో పెట్టినా భయపడాల్సిన పనిలేదు. కార్యకర్తలకు నేను అండగా నిలుస్తా. మళ్లీ అధికారంలోకి వస్తామన్నారు.ఈ సారి గురితప్పదు.మనం . 30 ఏళ్ల పరిపాలన చేస్తామన్నారు .చంద్రబాబు ఆయన అవినీతిని కప్పిపెట్టుకోవడానికి మనల్ని చాలా మాటలంటు న్నారు.అన్ని వింటున్నాను. ,చూస్తున్నాను.అన్నింటికి బదులిద్దామ్నారు.ఎవ్వరు వెంట లేనప్పుడే వైకాంగ్రెస్ పార్టీ జనంలోకి వెళ్ళింది.బయటకు వెళ్ళేవారిని ఆపలేమన్నారు.ఏవో కారణాలు చెబుతారు.వాటిని పట్టించుకోనవసం లేదు.మొన్న ఎన్నికల్లో మనకి అధికారం,సీట్లు రాకపోవచ్చును.మేజార్టీ ఓటర్లు మన వెంట ఉన్నారన్నారు. సంపద సృష్టించి పేదలకు పంచుతానని చంద్రబాబు చెప్పారు. కానీ ఈ 9 నెలల్లో సూపర్ సిక్స్ పథకాలను కూడా అమలు చేయలేదు. చంద్రబాబు హామీలను అమలు చేయలేరని నేను ముందే చెప్పాను. చంద్రబాబును నమ్మటం అంటే చంద్రముఖిని నిద్రలేపటమే. రాష్ట్ర బడ్జెట్, చంద్రబాబు హామీల ఖర్చుల గురించి ప్రజలకు వివరంగా చెప్పాను. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత ఉండాలి. త్వరలోనే జమిలీ ఎన్నికలు అంటున్నారు.




**SMFG IndiaCredit**
**SMFG INDIA CREDIT COMPANY LIMITED**
**(Formerly Fullerton India Credit Company Limited)**

**కార్పొరేట్ కార్యాలయం:** 10వ అంతస్తు, కార్యాలయం నం.101, 102 & 103, 2 నార్త్ ఎవెన్యూ, మేకర్ మేక్సిటీ, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (E), ముంబై-400051.

**స్థిరాస్తుల విక్రయం కొరకు విక్రయ ప్రకటన**

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 8 మరియు 9 నిబంధన ఏర్పాటుతో చదువబడే చట్టం క్రింద స్థిరాస్తి(లు) యొక్క విక్రయం కొరకు 15 రోజుల యొక్క ఇ-వేలం విక్రయ ప్రకటన. సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలముగా నోటీస్ ద్వారా ప్రకటించునది ఏమనగా ఈ క్రింద వివరింపబడిన తనఖాపెట్టబడిన స్థిరాస్తులు/సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఛార్జ్‌డ్ అయినవి, **SMFG ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ (పూర్వపు ఫుల్లర్‌టన్ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్)/సెక్యూర్డ్ క్రెడిటార్** యొక్క అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకోబడిన వాటిని **ఏది ఎక్కడ ఎలా ఉన్నదీ, ఏది ఎలా ఉన్నవీ, మరియు అక్కడ అలా ఉన్నదంతా** పద్ధతిపై క్రింద పేర్కొనబడిన తేదీన మరియు సమయం ప్రకారం క్రింద పేర్కొనబడిన రుణ బకాయి రికవరీ కొరకు మరియు రియలైజేషన్ తేదీ వరకు తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతోసహా SMFG ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ (పూర్వపు ఫుల్లర్‌టన్ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్)/సెక్యూర్డ్ క్రెడిటార్, క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు మరియు హామీదారు(లు) నుండి రికవరీ నిమిత్తం ఈ దిగువ పేర్కొన్న తనఖా ఆస్తి విక్రయిస్తున్నారని ప్రకటించడమైనది. రిజర్వ్ ధర, బయానా (EMD) మరియు బయానా డిపాజిట్ యొక్క చివరి తేదీ కూడా ఈ క్రింద పేర్కొనబడినవి.

| రుణగ్రహీత(లు)/హామీదారు(లు)/ రుణ అకౌంట్ | డిమాండ్ నోటీసు తేది & మొత్తం | రిజర్వు ధర, బయానా మరియు బయానా యొక్క దాఖలు చివరి తేది | ఇ-వేలం యొక్క తేది మరియు సమయం |
|---|---|---|---|
| 1. శ్రీ దుర్గా కేబుల్ మరియు స్టార్ నెట్‌వర్క్ 2. సీరామ్ దుర్గా భవాని 3. సీరామ్ లక్ష్మణ్ 4. శ్రీ దుర్గా కేబుల్ మరియు స్టార్ నెట్‌వర్క్ రుణ అకౌంట్ నం. 212121310997151 | 24.08.2023 రూ.75,06,543/- (రూపాయలు డెబ్బై ఐదు లక్షల ఆరు వేల ఐదు వందల నలభై మూడు మాత్రమే) 24.08.2023 నాటికి | రిజర్వ్ ధర: రూ.77,83,000/- (రూపాయలు డెబ్బై ఏడు లక్షల ఎనభై మూడు వేలు మాత్రమే) బయానా: రూ.7,78,300/- (రూపాయలు ఏడు లక్షల డెబ్బై ఎనిమిది వేల మూడు వందలు మాత్రమే) బయానా డిపాజిట్ యొక్క చివరి తేది: 24.02.2025 | తేది: 25.02.2025 సమయం: ఉ.11.00 గం. నుండి మ.02.00 గం. (ఒక్కొక్క 5 నిమిషం యొక్క పరిమితి లేని పొడిగింపుతో) |

**స్థిరాస్తి యొక్క వివరాలు :** కృష్ణా జిల్లా , పిన్-521456 యొక్క ఇబ్రహీంపట్నం S.R.O యొక్క పరిధిలో మరియు ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లి గ్రామం మరియు గ్రామ పంచాయతీలో ఉన్న Asst. నం.7115 KPL, పన్ను రసీదు ప్రకారం ఇ.నం.12-4/1, 140.0 చ.గజాలు లేదా 121.3 చ.మీటర్లు R.S. నం.389/4లోని విస్తీర్ణంలో నిర్మించబడిన ఒక R.C.C పైకప్పు భవనం యొక్క మొత్తం అదంతా. సరిహద్దులు: తూర్పు: గుండుమీను సత్యనారాయణ & పబ్బటి వెంకటేశ్వరరావు యొక్క ఆస్తి, దక్షిణం: ఆతులూరి జనార్ధనరావు & పాలడుగు వెంకయ్య యొక్క ఆస్తి, పడమర: విజయవాడ, తిరువూరు రోడ్, ఉత్తరం: ఊటుకూరి పవన్ కుమార్ & గిరి కుమార్ యొక్క ఆస్తి.

| రుణగ్రహీత(లు)/హామీదారు(లు)/ రుణ అకౌంట్ | డిమాండ్ నోటీసు తేది & మొత్తం | రిజర్వు ధర, బయానా మరియు బయానా యొక్క దాఖలు చివరి తేది | ఇ-వేలం యొక్క తేది మరియు సమయం |
|---|---|---|---|
| 1. M/S. శ్రీ లక్ష్మి బోటిక్ 2. చల్ల గొల్లా శ్రీ లక్ష్మి 3. చల్ల గొల్లా రవి తేజ 4. చల్ల గొల్లా మానస రుణ అకౌంట్ నం. 192420910668048 & 192420910721739 | 02.12.2021 రూ.33,58,660.26/- (రూపాయలు ముప్పై మూడు లక్షల యాభై ఎనిమిది వేల ఆరు వందల అరవై మరియు పైసలు ఇరవై ఆరు మాత్రమే) 01.12.2021 నాటికి | రిజర్వ్ ధర: రూ.20,20,000/- (రూపాయలు ఇరవై లక్షల ఇరవై వేలు మాత్రమే) బయానా: రూ.2,02,000/- (రూపాయలు రెండు లక్షల రెండు వేలు మాత్రమే) బయానా డిపాజిట్ యొక్క చివరి తేది: 24.02.2025 | తేది: 25.02.2025 సమయం: ఉ.11.00 గం. నుండి మ.02.00 గం. (ఒక్కొక్క 5 నిమిషం యొక్క పరిమితి లేని పొడిగింపుతో) |

**స్థిరాస్తి యొక్క వివరాలు :** ఆంధ్రప్రదేశ్, పిన్-521225, కృష్ణా జిల్లా యొక్క విజయవాడ (తూర్పు) గుణదల S.R.O యొక్క పరిధిలో మరియు విజయవాడ గ్రామీణ మండలం, గొల్లపూడి గ్రామం మరియు గ్రామ పంచాయతీలో ఉన్న ASST. నం.8122 జై సాయి దుర్గా, ఇ.నం.23-8/1 T3 ఫ్లాట్ నం.18 కలిగి LP నం.65/81, R.S. నం.189లోని అన్ని ఇతర కామన్ సౌకర్యాలు మరియు అన్ని ఇతర జాయింట్ సదుపాయాలు నీరు, డ్రైనేజ్ మెట్లు, మోటార్ వగైరా వంటి వాటితోసహా, టూ వీలర్ పార్కింగ్ కొరకు 20.0 చ.అ. మరియు కామన్ ఏరియా కొరకు 100.0 చ.అ, 800.0 చ.అ' యొక్క ఫ్లింత్ ఏరియాతో 3వ అంతస్తులో T-3లో ఉన్న జయ సాయి దుర్గా (J.S) యొక్క పేరు క్రింద నిర్మించబడిన అపార్ట్‌మెంట్స్‌లో 316.25 చ.గజాలు లేదా 264.62 చ.మీటర్లు మొత్తం విస్తీర్ణంలో నిర్మించబడిన 22.0 చ.గజాలు లేదా 18.39 చ.మీటర్లు యొక్క అవిభాజ్య వాటా, సరిహద్దులచే ఈ విధంగా:- షెడ్యూల్ సరిహద్దులు: **A-షెడ్యూల్-భూమి సరిహద్దులు:** తూర్పు: ఇమ్మానేని వెంకటేశ్వరరావు యొక్క ఆస్తి 45.0" అ', **దక్షిణం:** రంగుల లక్ష్మీకుమారి యొక్క ఆస్తి-62.6" అ', **పడమర:** రోడ్-45.0" అ', **ఉత్తరం:** మామిడిబత్తుల సత్యవతి యొక్క ఆస్తి-64.0" అ". **B-షెడ్యూల్-(ఫ్లాట్ సరిహద్దులు) తూర్పు:** బహిరంగం, **పడమర:** ఫ్లాట్ నం.T-2, **దక్షిణం:** బహిరంగం, **ఉత్తరం:** కామన్ కారిడార్.

విక్రయానికి సంబంధించిన సవివర నియమ నిబంధనలకు దయచేసి సంప్రదించండి: 1) శ్రీ G. దుర్గా ప్రసాద్: 8886851222 +91-9886273806, 2) శ్రీ వినాయక్ K: +91-9900817064, 3) శ్రీ M.A. శివ నాగేంద్ర: +91-8374702629, 4) శ్రీ A. కిరణ్ బాబు +91-9966277779 లేదా SMFG ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్/సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క వెబ్‌సైట్ www.smfgindiacredit.com లో ఏర్పాటు చేసిన లింక్‌కు రిఫర్ చేయండి.

తేది : 06.02.2025
ప్రదేశం : విజయవాడ

సం/- అధీకృత అధికారి
SMFG ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ (పూర్వపు ఫుల్లర్‌టన్ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్)

వార్త

మనిషి ఆకలితో ఉన్నప్పుడు, అభిమానం, కులం, విద్య, జ్ఞానం, హోదా, అనురాగం అన్నీ మర్చిపోతాడు.

-అవ్వైయార్

# మృత్యు 'దారి' మారాలి..

మానవుడి సుఖానికి, సంతోషానికి అభివృద్ధి దోహదం కావాలి. సుఖం కోసమే అభివృద్ధి మార్గాలను అన్వేషిస్తాం. రోడ్లు అభివృద్ధికి సోపానాలు అనేది అందరికి తెలిసిందే. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రహదారుల నిర్మాణానికి ముఖ్యంగా గత రెండు,మూడు దశాబ్దాలుగా అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. లక్షలాది కోట్ల రూపాయలు వ్యయం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ లెక్కల ప్రకారమే దేశంలో రహదారులు అరవైనాలుగు లక్షల కిలోమీటర్లకుపైగా ఉన్నాయి. మరికొన్ని ఇంకా నిర్మాణ దశలో కొనసాగుతున్నాయి. పూర్తయిన రోడ్లలో ఒక లక్షానలభైఆరువేల నూట నలభై ఐదు కిలోమీటర్లు జాతీయ రహదారులు, ఒక లక్షాఎనభై ఆరువేల ఐదువందలకుపైగా రాష్ట్ర రహదారులుంటే 60 లక్షల కిలోమీటర్లకుపైగా ఇతర రోడ్లు ఉన్నాయి. ఇంకా రహదారులు, వంతెనల నిర్మాణం శరవేగంగాచేస్తున్నారు. ఇవన్నీ అభివృద్ధికి ఎంతో బాటవేస్తున్నాయనే మాట వాస్తవం. కానీ మరోవైపు అభివృద్ధికి సోపానాలే మృత్యుమార్గాలు అయితే ఎవరికి చెప్పుకోవాలి? ఏమని చెప్పుకోవాలి? దేశంలో రహదారులు రక్తసిక్తం కాని రోజంటూలేదు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనిషి క్షేమంగా ఇంటికి వచ్చేది గ్యారంటీలేదు. అభద్రతాభావం రోజురోజుకు పెరిగిపోతున్నది. ఏ నిమిషానికి ఏమి జరుగునో అన్నట్లు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొచ్చి ప్రాణాలుపోతాయనో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. భారత్‌లో గత పదేళ్లలో దాదాపు పదిహేడున్నర లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో అసువులు బాశారు. ఇక క్షతగాత్రులైన వారి సంఖ్య లెక్కలకే అందకపోవచ్చు. నమోదైన గణాంకాలను పరిశీలిస్తే దేశంలో రోజూ పదమూడువందల అరవైకిపైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దాదాపు నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంటుండగా ప్రతి నాలుగు నిమిషాలకు ఒక మరణం సంభవిస్తున్నది. 2022లో లక్షాఅరవై ఎనిమిదివేల నాలుగువందల తొంభైకిపైగారోడ్డు ప్రమాదాలు సంభవించగా వాటిలో అరవైఒక్కవేలకుపైగా జాతీయ రహదారులమీదనే చోటు చేసుకున్నాయి. ఇక రాష్ట్ర రహదారులపై నలభైఒక్కవేలకుపైగా ప్రమాదాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్తే 2023లో పద్దెనిమిదివేల ఆరువందల ప్రమాదాలు జరగగా, ఎనిమిదివేల నూటముప్పైమందికిపైగా దుర్మరణం పాలయ్యారు. తెలంగాణలో 2023లో దాదాపు ఇరవైఒక్క వేల ప్రమాదాలు చోటుచేసుకోగా ఏడువేల మందికిపైగా మృతిచెందారు. ప్రమాదాల్లో గాయపడినవారు కొందరు అంగవైకల్యం పొంది కుటుంబానికే భారమై జీవనం సాగిస్తున్నారు. అభివృద్ధికి సోపానాలైన రోడ్లే మృత్యుమార్గాలై మానవాళిని కబళిస్తుంటే ఈప్రమాదాలను నివారించలేమా?ఇందుకు ఎవరు బాధ్యులు? లోపం ఎక్కడుందనే ప్రశ్నలకు జవాబులు అందరికి తెలిసినా ఆ కోణంలో చర్యలు తీసుకోలేకపోతున్నారు. అలాని ఏమీ చేయడంలేదనిచెప్పడంలేదు. చట్టాల మీద చట్టాలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన చోదకులకు జరిమానాలు వేస్తున్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన కట్టుదిట్టమైన చర్యల గూర్చి ఆదేశాలు జారీ చేస్తున్నారు. రోడ్డు, భద్రతా వారోత్సవాలను క్రమంతప్పకుండా ఘనంగా నిర్వహించుకుంటున్నారు. ఒకపక్క ఈ కార్యక్రమాలు జరుగుతుంటూనే మరొకపక్కప్రమాదాలు యధేచ్ఛగా జరుగుతున్నాయి. గతంలో ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ రోడ్డుప్రమాదాల కట్టడికి పటిష్టమైనచర్యలు తీసుకోవాలని ఆదేశించి స్వయంగా రంగంలోకి దిగినా ఏమీ చేయలేకపోయారు. స్వయాన ఆయన కార్యదర్శి విజయవాడలో ఒక రోడ్డుప్రమాదంలో మరణించినప్పుడు మొత్తం రాష్ట్ర ప్రభుత్వయంత్రాంగమే అక్కడికి కదలివెళ్లింది. ఎన్టీఆర్‌లో ఆవేశం కట్టలుతెంచుకున్నది. అప్పటికప్పుడు సీనియర్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో కొంతలోకొంతైనా మార్పువస్తుందని అందరూ ఆశించారు. మార్పు రాకపోగా ప్రమాదాలు మరింత పెరిగిపోతున్నాయి. ఆతర్వాత వచ్చిన పాలకులు కూడా అటు దేశవ్యాప్తంగా కానీ, ఇటు రాష్ట్రాల్లో కానీ ప్రమాదాలనివారణకు ఉపన్యాసాలుఇస్తూనే ఉన్నారు. చట్టాలుచేస్తూనే ఉన్నారు. అయినా ఇవి తగ్గడం లేదు. అధిక శాతం ప్రమాదాలు చోదకుల నిర్లక్ష్యం, తప్పిదం వల్లనే జరుగుతున్నాయని నిపుణుల అధ్యయనంలో అనేకసార్లు వెలుగుచూసింది. మరికొందరు డ్రైవర్లుమద్యం సేవించి వాహనాలు నడుపుతుండడంవల్ల కూడా ప్రమాదాల సంఖ్య పెరిగిపోతున్నాయి. మద్యాదాయమే మహాప్రసాదంగా అన్నట్లు పాలకులు జాతీయ రహదారులపై కూడా మద్యం విక్రయకేంద్రాలను అనుమతి ఇవ్వడం, ప్రమాదాలకు మరింత ఊతం ఇస్తున్నది. మద్యం వల్ల ఆదాయం వస్తుండవచ్చు. కానీ అందువల్ల జరుగుతున్న అనర్థాలను ప్రజా సంక్షేమం అని చెప్పుకునే పాలకులు పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ఒక్కమాటలో చెప్పాలంటే ఆదాయం పెంచుకోవడంలో ఉన్న శ్రద్ధ, ఆసక్తి ప్రమాదాలను నివారించడంలో చూపించలేకపోతున్నారు. ఫలితంగా నిత్యం రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. చేతికి అందివస్తున్న పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల గర్భశోకం,తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన పిల్లలు ఇలా లక్షలాది కుటుంబాల పరిస్థితి వర్ణనాతీతం. ఇదంతా పాలకులకు తెలియందికాదు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రపాలకులు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యల చేపట్టాలి. ఆదాయమే లక్ష్యంకాకుండా మానవతా దృక్పథంతో నడుం కట్టాలి. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా వాహనాలు మృత్యుదేవతల్లా రోడ్లపై వీరవిహారం చేయక మానవు.

తాను చేసిన తప్పుల పట్ల వివేకంతో కూడిన అవగాహన కలిగి ఉండటమే వివేకపు శక్తివంతమైన లక్షణం.



లారోష్ ఫోకాల్ట్

ఘర్షణల వల్ల శక్తి వృథా అవుతుంది. హెచ్చుతగ్గులు వస్తాయి. ఆందోళనలు చెలరేగుతాయి. అశాంతి కలుగుతుంది.



ఐ.జాన్సన్

# ఆసియా దేశాలు డబ్ల్యుహెచ్ఓను నిలపాలి!

**ఖర్చులు తగ్గించుకొనే ప్రయత్నంలో భాగంగా హెడ్ క్వార్టర్స్ లో ఉన్న అనవసరపు ఉద్యోగస్థులను ఇతర దేశాలలో పనిలే కుండా ఉన్న వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ బ్రాంచిలను తీసివేసే కార్యక్రమం కూడా చేయకతప్పదు. నాలుగు సంవత్సరాల తర్వాత ట్రంప్ శకం అంతరిస్తుంది. మళ్లీ ఎప్పటి మాదిరే రాబోయే అధ్యక్షుడి సానుకూల నిర్ణయంతో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ స్థితిగతుల దశ తిరిగి పూర్వస్థాయికి వచ్చే అవకాశాన్ని కూడా కాదనలేం. ప్రపంచ ఆరోగ్య స్థితిగతులు, సహకారం ఏ ఒక్క దేశం మీదనో ఆధారపడకూడదు. ఆసియా, ఆఫ్రికా దేశాలు ముందుచూపుతో పరిస్థితులను చక్కదిద్దే ఈ వ్యవస్థను నిలుపుకోక తప్పదు.**



రావులపాటి సీతారాంరావు

'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్న తెలుగు సామెతను అమెరికా లాంటి భాగ్య దేశాలు అపహాస్యం చేస్తున్నాయా ఆరోగ్యాన్ని అన్న సందేహం యు.ఎస్.ఏ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుహెచ్ఓ) వ్యవస్థనుంచి తప్పుకోటాన్ని చూస్తే అనిపిస్తుంది. ట్రంప్ అధ్యక్షుడు అయిన తర్వాత ఎన్నో దురుసు నిర్ణయాలు తీసుకున్నారు.అందులో డబ్ల్యుహెచ్ఓ నుంచి అమెరికా తప్పుకుంటున్నదని ప్రకటించడం ప్రముఖమైన నిర్ణయంగా చెప్పుకోవచ్చు! అంతకు పూర్వం కూడా ఆయన మొదటి టర్మ్‌లో కోవిడ్ సమయంలో అలాంటి నిర్ణయమే తీసుకోవటం చాలామంది మర్చిపోలేదు. కారణాలు ఏమి చెప్పినా ధనం దేశానికి అయినా వ్యక్తికయినా అహం వీసమెత్తయినా కలిగేట్లు చేస్తుంది. ఇప్పుడున్న పరిస్థితులలో అమెరికా దేశంలోని భాగ్యం తరిగిపోతున్నదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అందుకోసమే ట్రంప్ రాగానే ఆ పరిస్థితినుంచి దేశాన్ని రక్షించుకోటానికి ఎగ్జిక్యూటివ్ నిర్ణయాల పేరిటసమూలంగా కొన్ని వ్యవస్థలను కదిలించే ప్రయత్నం చేశారు. వరల్డ్‌హెల్త్ ఆర్గనైజేషన్‌లోకి అమెరికా ట్రంప్‌పదవినుంచి దిగిపోయి బైడెన్‌రాగానే మళ్లీచేరటం అప్పట్లో ప్రపంచ ఆరోగ్యసంస్థలకు శుభసూచకంగా భావించారు. కానీ ట్రంప్ పదవిలోకి రాగానే తన ప్రతాపం ప్రపంచానికి మరొక్కసారి చూపించారు. అసలు కారణం అమెరికా ఆర్థిక పరిస్థితి అని కొందరు ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మూలాల్లోకి వెళ్తే ఈ సంస్థ ఆర్థిక స్థితిగతులు గురించి చెప్పుకోక తప్పదు. రెండు విధాలుగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నడపటానికి డబ్బు సమకూర్చటం జరుగుతున్నది. మొదటిది నిర్ణీత విరాళాలు దీనినే ఎసెస్‌డ్ కంట్రిబ్యూషన్ అని కూడా అంటారు. ప్రతి సభ్య దేశం యేడాదికొకసారి మెంబర్‌షిప్ ఫీజ్ ఈ ఆర్గనైజేషన్‌కు చెల్లించాలి. ఈ మధ్యకాలంలో అమెరికాను ఇబ్బందిపెట్టున్నా సమస్య ఇదే. ఇతర దేశాలతో పోల్చుకుంటే అమెరికా ఇచ్చే డబ్బు (ఫీజ్ రూపంలో) చాలా ఎక్కువ అని ఆ దేశం భావిస్తున్నది. ప్రస్తుతం ఉన్న ఆర్థిక సమస్యలను అధిగమించడానికి ఇంత పెద్ద మొత్తంలోవరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌కు ఎసెస్‌డ్ కంట్రిబ్యూషన్ ఇవ్వడం కుదరదు అన్నట్లుగా ట్రంప్ భావిస్తున్నారు. దీనినే ముఖ్యకారణంగా ట్రంప్ విత్ డ్రాయల్ సమయంలో ప్రకటించారు కూడా. అయితే దేశాలు యేడాదికొకసారి కచ్చితంగా ఫీజ్ రూపంలో వచ్చే డబ్బు వల్ల ఉద్యోగస్థుల జీతాలు సంస్థను నడపడానికి అవసరమైన ఖర్చులను భరించే వీలు కుదురు



తుంది. మరొక విధానం వల్ల కూడా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌కు డబ్బు సమకూరుతుంది. అది వలంటరీ కంట్రిబ్యూషన్ వల్ల! మొదటి విధానాన్ని ఎ.సి అని (ఎసెస్‌డ్ కంట్రిబ్యూషన్) రెండవ దానికి వి.సి అని (వాలంటరీ కంట్రిబ్యూషన్) షార్ట్‌ఫాంలో, డబ్బు పొందే విధానాన్ని వర్ణించటం జరుగుతుంది. ఆర్థికంగా పెద్దస్థాయిలో ఉన్న డోనర్స్, మెంబర్స్‌గా ఉన్న దేశాలు కూడా ఇష్టపూర్వకంగా, పనితీరును మరింత మెరుగుపర్చడానికి సమకూర్చే ఫండ్స్‌ను వి.సిగా పిలుస్తారు. అయితే ఈ డబ్బు నిర్ణీత కార్యక్రమాలకోసం టైంతో నిమిత్తం లేకుండా అప్పుడప్పుడూ మనకూరే డబ్బు అవటంవల్ల విధాయకంగా వస్తుందని అనుకోవటంకుదరదు. ఉదాహరణకు పోలియో నివారణ నిమిత్తం, వ్యాధిగ్రస్తుల రక్షణకోసం, ప్రాథమిక ఆరోగ్యభద్రత కోసం విరాళాలరూపంలో దేశాలు, డోనర్లు సమకూర్చే డబ్బుకావడం వల్ల విధాయకంగా జరిగే హెల్త్ కార్యక్రమాలను డబ్ల్యుహెచ్ఓ దీని మీద ఆధారపడి ఆర్థిక వనరుల వెసులు బాటును పరిగణనలోకి తీసుకోదు. అయితే అమెరికా ఈ వ్యవస్థ నుంచి తొలగిపోయే నిర్ణయం తీసుకోవటంతో వి.సి విధానం కూడా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. చాలా మంది అమెరికాకు సంబంధించిన డోనర్ల సహాయం తరిగిపోవచ్చు. అసలు రాకుండానుపోవచ్చు. ఉదాహరణకు ఎప్పుడూ ఉండే యుయస్ ఎయిడ్ కూడా డోలాయమాన పరిస్థితిలో సహాయం సమకూర్చలేకపోవచ్చు. యు.యస్.ఏ విత్ డ్రాయల్ వల్ల ఆర్థికంగా వరల్డ్‌హెల్త్ ఆర్గనైజేషన్‌కు సంకట పరిస్థితులు ఏర్పడే ప్రమాదం హెచ్చుగాఉంది. ఇలాంటి పరిస్థితులలో ఆసియా దేశాలు యూరప్‌దేశాలు ముఖ్యంగాఇండియా, బ్రెజిల్, దక్షిణ ఆఫ్రికా, థాయ్‌లాండ్,ఈజిప్ట్ లాంటి దేశాలు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌కు అక్కరకు రావాలి. పూర్తి సహకారం అందివ్వాలి. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ కూడా ముందుకు వచ్చి దేశాలకు మార్గదర్శకంగా ఆర్థిక వనరులు సమకూర్చే విధంగా ఉండకతప్పదు. ఆసియా, ఆఫ్రికా దేశాలలో ఆరోగ్యసమస్యలు హెచ్చుస్థాయిలో ఉన్నాయి. ఇప్పటి వరకూ డబ్ల్యుహెచ్ఓ ఇలాంటి సమస్యలను తొలగించే విధానంతో పనిచేయడం వల్ల ఈ దేశాలు డబ్బుతక్కువగా సమకూరుస్తున్నప్పటికీ కావల్సిన సహాయ సహకారాలు లభించడం జరుగుతున్నది. తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆరోగ్య పరంగా ఎదుర్కోవాల్సిన ఇబ్బందులతోపాటు అందుతున్న సహాయం కుంటుపడే ప్రమాదం కూడా ఉంది. ఖర్చులు తగ్గించుకొనే ప్రయత్నంలో భాగంగా హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న అనవసరపు ఉద్యోగస్థులను ఇతర దేశాలలో పనిలేకుండా ఉన్న వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ బ్రాంచిలను తీసివేసే కార్యక్రమం కూడా చేయకతప్పదు. నాలుగు సంవత్సరాల తర్వాత ట్రంప్ శకం అంతరిస్తుంది. మళ్లీ ఎప్పటి మాదిరే రాబోయే అధ్యక్షుడి సానుకూల నిర్ణయంతో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ స్థితిగతుల దశ తిరిగి పూర్వస్థాయికి వచ్చే అవకాశాన్ని కూడా కాదనలేం. ప్రపంచ ఆరోగ్య స్థితిగతులు, సహకారం ఏ ఒక్క దేశం మీదనో ఆధారపడకూడదు. ఆసియా, ఆఫ్రికా దేశాలు ముందు చూపుతో పరిస్థితులను చక్కదిద్ది ఈ వ్యవస్థను నిలుపుకోక తప్పదు. ●

# మరణశిక్ష ఎంతవరకు సబబు!

కిరణ్ ఫిషర్

ప్రాచీన కాలం నుండి రాచరిక వ్యవస్థ వరకు, మధ్య యుగం నుండి నేటి ఆధునిక కాలం వరకు రాజ్యంలో న్యాయ వ్యవస్థలో వివిధ రకాలుగా ఆ రోజుల్లో నేరస్తులను ఆయా కాలాలకు అనుగుణంగా తీర్పులు ఇచ్చి శిక్షలు విధించే న్యాయపాలన నడుస్తోంది. నేటి ఆధునిక కాలంలోకూడా మరణ శిక్ష భారత దేశంలో అవసరమేనా అనే విషయంపై చర్చ కొనసాగుతున్నదే. దేశ న్యాయ వ్యవస్థలో తప్పు చేస్తే దండించడానికి ప్రభుత్వమే చట్టాలకు రూపకల్పన చేసింది. భారత దేశంలో బ్రిటిష్ వాళ్లు పాలిస్తున్న రోజుల్లో వారు కొన్ని క్రిమినల్ చట్టాలు చేశారు. అందులో ఇండియన్ పీనల్ కోడ్ 1860 ( భారతీయ న్యాయ సంహిత 2023) ప్రకారం ఎవరైనా తప్పు చేస్తే కేసులు నమోదు చేసి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం 1973 (భారతీయ నాగరిక్ సురక్ష్ సంహిత 2023) ఆయా తప్పులకు శిక్షలు విధిస్తుంటారు. అయితే ఇందులో కూడా కొన్ని కేసులకు మాత్రమే మరణ శిక్ష విధించే అవకాశం ఉంటుంది. అందులో చూస్తే సెక్షన్స్, 120బి,121, 132, 194, 302, 303, 305, 354ఎ, 376ఎ, అలాగే 31ఏ నార్కోటిక్స్ డ్రగ్స్ వంటి చట్టాల్లో కూడా శిక్షలు విధించే అవకాశం ఉంది. వాస్తవానికి మరణ శిక్ష అనేది కేవలం కొన్ని నేరాలకు మాత్రమే ఉంది. మరణ శిక్ష విధింపు వల్ల నిందితునిల్లో పరివర్తన కలిగి కొన్ని నేరాలు తగ్గుతాయనే న్యాయ వ్యవస్థ, ప్రజలు నమ్ముతారు. అయితే గతంలో మనం చూశాం ఢిల్లీలో జరిగిన నిర్భయ కేసులో వాళ్లకు శిక్ష ఖరారు చేసిన వెంటనే మరో పక్క తెలంగాణలో దిశ అనే రేప్ కేసు నమోదై అతి కిరాతకంగా చంపారు. వాళ్లను పోలీసులు ఎన్కౌంటర్‌లో చంపే విషయం మనకు తెలిసిందే. అయితే ఇటీవల కాలంలో కూడా బెంగాల్‌లో మెడికల్ విద్యార్థి పైన కూడా రేప్ చేసి మరీ చంపిన ఘటన మనం చూసాం, ఇలా చెప్పుకుంటూపోతే దేశవ్యాప్తంగా చాలానే ఉన్నాయి. అయితే మరణ శిక్ష విధించిన మాత్రాన నేరస్తుల్లో ఎంతవరకు పరివర్తన కలుగుతుందో చెప్పలేం. అలాంటి తీవ్రమైన కేసులో మరణ శిక్ష కంటే యావజ్జీవ కారాగార శిక్ష విధించే విధానం చేయాలి. దేశంలో ఎంతోమంది న్యాయ నిపుణులు, మేధావులుసైతం మరణ శిక్షను విభేదించారు.గతంలోచూస్తే 262వ లా కమిషను రిపోర్ట్ 2015లో కూడా స్పష్టంగా చెప్పింది. మరణ శిక్ష కేవలం టెర్రరిజం వంటి కేసులలో మాత్రమే విధించాలని సూచించింది. అదేవిధంగా ప్రభుత్వాలు కూడా కొన్ని సంస్కరణలు చేయాలి అని తెలిపింది. అందులో పోలీస్ సంస్కరణలు, సాక్షులను రక్షించే చర్యలు, బాధితులకు నష్టపరిహారం వంటివి తేవాలని సూచించింది. అయితే సుప్రీం కోర్టు కూడా అతికొద్ది కేసులకు మాత్రమే శిక్షను ఖరారు చేయాలని చెప్పింది. అయితే కమిషను సైతం మరణశిక్ష రద్దుపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి అని గతంలో తెలిపింది. ఇది జీవించే హక్కుకు విరుద్ధం అని తెలిపింది. ప్రపంచ దేశాలలో చూస్తే 1960 దశకంలో"ఇంటర్నేషనల్ కోవెనేంట్ సివిల్ పొలిటికల్ రైట్స్" వంటి సంస్థ మరణ శిక్ష రద్దు గురించి గ్లోబల్ లెవల్‌లో ప్రయత్నాలు చేస్తూనే ఉంది. యునైటెడ్ జనరల్ అసెంబ్లీ ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల రక్షణ కొరకు 2007 నుండి 2018 వరకు రిజల్యూషన్ తీసుకుంటూనే ఉంది. అయితే 2007లో యూఎన్‌లోకూడా భారత్ మిగతా కొన్ని దేశాలు ఇంకా రద్దు చేయలేదు. ఇందులో అమెరికా కూడా ఉంది. అంటే దాదాపు ప్రపంచవ్యాప్తంగా చూస్తే 70 శాతం మేర మరణ శిక్షను రద్దుచేసింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ 2020 ప్రకారం 108దేశాలు మరణ శిక్షను రద్దు చేసినట్లు వెల్లడించింది. గత పదేళ్లుగా 28 దేశాలు వాస్తవానికి రద్దు చేశాయి.కానీ ఇంకా అవిఅమలుకు నోచుకోలేదు.ఇంకా 55 దేశాలు తేలికపాటి కేసులకు సైతం మరణ శిక్ష విధిస్తోంది. అయితే మరణ శిక్ష విధిస్తున్న దేశాలలో ఇండియా, చైనా, బంగ్లాదేశ్, ఈజిప్ట్, ఇండోనేషియా,సౌదీఅరేబియా, సౌత్ కొరియా, ఇరాన్,జపాన్, శ్రీలంక,తైవాన్,అమెరికా, ఇథియోపియా, నైజీరియా, వంటి దేశాలున్నాయి. నిజానికి మరణ శిక్ష అంతిమ శిక్షకాదు, అయితే నేరంచేసిన వ్యక్తులకు జీవితాంతం కఠిన కారాగారశిక్ష విధించి ఎలాంటి "పెరోల్" అవకాశం లేకుండాచేయాలి.అతడు సహజ మరణంపొందే వరకు అక్కడే ఉంచాలి. అయితే అదేవిధంగా నేరస్థులను మార్చే ప్రయత్నంచేయాలి. నేరస్తులను వారివారి వృత్తులరీత్యా వాడుకొని వాళ్లు సత్ప్రవర్తకులుగా మారే అవకాశాలు కల్పించాలి. శిక్షను పొడిగిస్తూ ఉండాలి. కొన్నిఏళ్ల నుండి వస్తున్న మరణశిక్షకు బదులు యావజ్జీవ శిక్షను చేర్చాలి. టెర్రరిజం వంటి కేసుల్లో మరణశిక్షను విధించే విధంగా చేయాలి.కొన్ని కేసుల్లో మాత్రమే మరణ శిక్షను విధించాలి.మిగతా వాటికి వేరే ప్రత్యామ్నాయం వెతకాలి.దీనిపై ప్రభుత్వం,మేధావులు, న్యాయనిపుణులు, ప్రజలందరూ చర్చించాలి. మరణ శిక్షకు బదులు యావజ్జీవ కారాగారశిక్షను విధించడమే మేలు. ●

# ఆదివాసీ సంపద దోపిడి ఆగేదెప్పుడు?


పి.అప్పలనర్స

జమ్మూకాశ్మీర్ 370 ఆర్టికల్‌ను ఎలా తొలగించారో అలానే 18 రాష్ట్రాల్లో వున్న 5,6వ షెడ్యూల్డ్‌లను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం వ్యూహాన్ని ఖరారు చేసింది. అభివృద్ధి పేరిట షెడ్యూల్డ్ ప్రాంతాల్లో వున్న ప్రత్యేక రాజ్యాంగ హక్కులను, చట్టాలను బలహీనపర్చే చర్యలకు ఉపక్రమించింది. ఆధునిక సమర్థవంతమైన మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడం, విదేశీ మూలధనం కోసం కొత్త రంగాలను ప్రారంభిచడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని వరల్డ్ బ్యాంక్ నిర్వహించిన డూయింగ్‌లో పేర్కొన్నది. 2022 నాటికి తయారీ రంగంలో 25 శాతానికి జీడిపి చేరుకుంటుందని అంచనా వేసినప్పటికీ 2023-2024లో 15.9 మించి పెరగకపోవడంతో ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను వేగవంతంగా అమలు చేస్తూ దేశ సహజ సంపదను కార్పొరేట్లకు అప్పణంగా అప్పగించింది. పరిశ్రమలు ప్రైవేట్‌పరం చేయడం, ఎన్ఐ పేరుతో భూములు అప్పగించడం, ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ఔషధ పరిశ్రమలకు సముద్రపరివాహక ప్రాంతాలను అప్పగించారు. ఇక మిగిలింది అటవీ ప్రాంతాలే. భారతదేశంలో 15 శాతం భూభాగంలో 5 శాతం మంది అదివాసీ ప్రజలు 8, 6వ షెడ్యూల్డ్ ఏరియాలల్లో 705 తెగల వారు నివసిస్తున్నారు. గణనీయమైన ఎస్టీ జనాభా కలిగిన ఒరిస్సా, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలల్లో 70 శాతం బొగ్గు, 50 శాతం ఇనుము, 60 శాతం బాక్సైట్, 100శాతం గ్రానైట్ మొదలగు ఇతర ఖనిజాలున్నాయి. సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ కేంద్రం లెక్కల ప్రకారం ఖనిజాలను ఎక్కువ ఉత్పత్తి చేసే జిల్లాలలో సగం గిరిజన జిల్లాలే. ఈజ్ ఆఫ్ డూయిండ్ బిజినెస్‌కు ఆదివాసీల హక్కులు, చట్టాలు అడ్డంగా వున్నందున వాటిని బలహీనపర్చాలనే ఆలోచనతో కేంద్ర సర్కార్ సిద్ధమైంది. వీటికోసం కొన్ని రాష్ట్రాలను ప్రత్యేకంగా కేంద్రీకరించి జమ్మూకాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు, మణిపూర్లో కుకీలు, మైతీలు మధ్య చిచ్చు, తెలుగు రాష్ట్రాల్లో జి.ఓ నెం.3ని (నూరుశాతం ఉద్యోగ రిజర్వేషన్)ను సుప్రీంకోర్టు ద్వారా రద్దు చేయించడం, ఆదివాస్ తెగల మధ్య మతచిచ్చు, తెగల అస్తిత్వాన్ని, సంస్కృతిని దెబ్బతీసే సనాతన ధర్మం ప్రచారం, బలహీనవర్గాల ఆత్మాభిమానాన్ని, మనోభావాలను దెబ్బతీయడానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను తీవ్రంగా అవమానించడం మొదలగు ప్రయత్నాలన్నీ కార్పొరేట్లకు అడవిని సులభంగా అప్పజెప్పేందుకే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం అడుగుల్లో మడుగులొత్తుతూ ఈజ్ ఆఫ్ డూయిండ్ బిజినెస్‌ను వేగవంతంగా అమలుచేసి స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబులు 2047 విజన్‌ను ప్రకటించారు. దీనికోసం ప్రపంచవ్యాప్తంగా వున్న తెలుగు వాళ్లు పి 4 (పబ్లిక్ (ప్రైవేట్ ప్రజలు పార్టిస్పెషన్) విధానంలో భాగస్వాములను కావాలని చంద్రబాబుగారు పిలుపు ఇవ్వడంతో జనవరి27న విశాఖపట్నంలో ప్రపంచ ప్రాంతీయ పెట్టుబడుల సదస్సును రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించి ఏజెన్సీప్రాంతంలోటూరిజం అభివృద్ధి, పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించుటకు 1/70 చట్టాన్ని సవరించాలని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న



పాత్రుడు వ్యాఖ్యానించడం శోచనీయమైనది. రాజ్యాంగ విరుద్ధమైనది. స్పీకర్‌వ్యాఖ్యలపై నేటికి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో ఆదివాసీలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చిత్తశుద్ధి వుంటే ఐటిడిఏ ద్వారా చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుచేసిఉపాధి, నూరుశాతం రిజర్వే షన్ను పునరుద్ధరించి ఉద్యోగవకాశాలు కల్పించాలి. 200 సంవత్సరాలకు పైబడి ఆదివాసీల భూరక్షణ, ఆదివాసీ స్వయంపాలిత కోసం రక్తంచిందించిన పోరాటాల ఫలితంగా భారత రాజ్యాంగంలోని 10వ భాగంలో పేర్కొన్న షెడ్యూల్డ్ ఆదివాసీప్రాంతాలను ఆర్టికల్ 244, 244 (ఎ) ప్రకారం 5,6వ షెడ్యూల్డ్ 1950 రాజ్యాంగంలో నిర్మాణమైంది. 5వ షెడ్యూల్డ్ పేరా 1లో చాలా స్పష్టంగా షెడ్యూల్డ్ ఏరియాలో ఉద్యోగాలు, అభివృద్ధి, రాజ్యాధికారం మొదలగు అంశాలపై ఆదివాసీలకు స్వతంత్రాలు దాఖలైంది. అమలు కాని తెలుగు రాష్ట్రాల్లో శ్రీకాకుళం ఆదివాసీ రైతాంగపోరాట ఫలితంగా ఆంధ్రప్రదేశ్ భూబదలాయింపు నిషేధిత, నియంత్రణ 1970 చట్టం అమలులోకి వచ్చింది, క్లాజ్ 3 ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనేతరులకు స్థిర నివాసం, స్థిరా స్తులు కలిగివుండటం రాజ్యాంగ విరుద్ధం. అయినప్పటికీ వారికే ఉద్యోగాలు కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం రాజ్యాంగ ధిక్కరణ కాదా? 5వ షెడ్యూల్డ్ ప్రాంతం ఆర్టికల్ 244 క్లాజ్ 1, క్లాజ్ 2 ప్రకారం స్వయం పాలన అమలులో వున్న ప్రాంతాల్లో బయట వాళ్లకు పాలించే అధికారంవుందని న్యాయ స్థానాలు, పాలకులు ఎలా అంటారు.? 1996 సమత వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తీర్పు ద్వారా షెడ్యూల్డ్ ఏరియాలో రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ తవ్వకాలకు అను మతి లేదని సుప్రీంకోర్టు పేర్కొన్నది. "ఆదివాసీలదే ఈ దేశం' అనే ప్రస్తావనతో కైలాస్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో జస్టీస్ మార్కండేయ ఖట్జూ, జ్ఞానసుధా మిశ్రాల తీర్పు కానీ, సర్వాధికారాలు పెసా గ్రామ సభలదే అన్నా ఒరిస్సా తీర్పు వంటివి అనేకం వునప్పటికీ వాటిని పరిగణించకుండా టూరిజం అభివృద్ధి పేరుతో ప్రైవేట్ కంపెనీలకు భూమి అప్పగించడమే అవుతుంది తప్ప ఇది ఆదివాసీ అభివృద్ధి ఎలా అవుతుంది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో వలసలు వచ్చిన గిరిజనేతరుల సమాజాన్ని పావుగావాడి ఆదివాసీ ప్రాంతాల ధ్వంస రచనకు వ్యూహంగా కనిపిస్తుంది. ఏజెన్సీ ప్రాంతంలో లాడ్జిలు,రిసార్టు, భవనాలు, హోటల్స్, భూములన్నింటిలోనూ అమాయక ఆదివాసీలను, రాజకీయ నిరుద్యోగులను బినామీలుగా మార్చి ఏజెన్సీప్రాంతంలో పెట్టుబడిదారీ విధానాన్ని ప్రభుత్వం అమలుచేస్తుంది. ఎస్‌డిసి వ్యవస్థను నిర్వీర్యం చేయడం,టూరిజం, పోలవరం, ఆయుధ కర్మాగారం, జాతీయ పారజాతీయ రహదారురులు, హైడ్రోపవర్‌ప్రాజెక్టు పేరుతో 1/70 చట్టాన్ని ప్రభుత్వం ఉల్లంఘిస్తుంది. నాగిరెడ్డి వన్మెన్ కమీషన్ ఉత్తర్వులు ప్రకారం ఏజెన్సీ పంచాయితీల ఇవ్వవలసిన25శాతం నిధులు కూడా టూరిజంశాఖ చెల్లించ డంలేదు,చట్టాలను అమలు చేయవలసిన అధికారులే రిసార్ట్లు, లాడ్జిలు నిర్మిస్తున్నారు. గిరిజన హక్కులు, చట్టాలు రక్షణకై గిరి జన సంఘం అగ్రభాగన వుంది. సరళీకరణ ఆర్థిక విధానా లు అమలైనప్పటి నుంచి అటవీ సంపదపై కార్పొరేట్ల కన్నుపడింది. బాక్సైట్ తవ్వకాల కోసం 1/70 చట్టాన్ని సవరించాలని గిరిజన సలహా మండలి (టిఏసీ)లో 2002 సంవత్సరంలో తీర్మానం పెట్టగా నాటి సిపిఎం పార్టీ భద్రాచలం ఎమ్మెల్యే మాత్రమే తీవ్రంగా వ్యతిరేకించారు. పెద్దఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించగా ప్రభుత్వం వెనుకడుగేసింది. 1/70 చట్టం న్యాయ సమీక్షకు అతీతంగా భారత రాజ్యాంగం 9వ షెడ్యూల్లో పొందుపర్చబడింది. అయినప్పటికీ చట్టాన్ని సవరించాలని నేటిఅసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించడం వెనకాల అనకాపల్లి జిల్లా కాల్సైట్ మైనింగ్ వుంది. ఇదివరకుపాలకవర్గాలు బినామీ పేర్లతో దోచుకుంటున్నారు.నేడు టూరిజం అభివృద్ధి పేరుతో 1/70చట్టాన్ని సవరించాలనే కుట్రవెనుకాల ఆదివాసీ సంపదను కొల్లగొట్టడమే. కుట్రలను చేదించడానికి హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు,దళిత వర్గాల ప్రజానీకం ఆదివాసీ పక్షాననిలవాలి. ఆదివాసీ మేధావులు ఐక్యఉద్యమాన్ని ప్రోత్సహించాలి.పోరాటమే ఆదివాసీలకు రక్షణ కవచం. ●

# ప్రజావాక్కు



## పేట్రేగిపోతున్న అవినీతి

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో అవినీతి పెట్రేగిపోతుంది.ఏ కార్యాలయం వెళ్లిన లంచం ఇవ్వందే పని కావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.ఒక్క జనవరి నెల లోనే ఇరవై మంది ఏ.సి.బి కి చిక్కడం సంచలనం సృష్టించింది.ప్రజలతో నేరుగాసంబంధం ఉండే రెవెన్యూ, మున్సిపల్, విద్యా,ఆరోగ్య, పశుసంవర్థక, పోలీస్, పంచాయతీరాజ్‌శాఖల్లో అవినీతి ఎక్కువగాజరుగుతున్నట్లు తెలుస్తుంది. కొంత మంది లంచావతారులు చేతికి మట్టి అంటకుండా ప్రైవేట్ వారిని నియమించుకుని లంచాలకు మరిగినారు. ప్రజల్లో అవినీతి మీద అవగాహన పెరిగిన మార్పు రావడం లేదు.సోషల్ మీడియాలో కూడా ఏ.సి.బి కి పలు ఫిర్యాదులు అందుతున్న లంచాలు తగ్గడం లేదు.అవినీతి అధికారులు ఇకనైనా మారండి.ప్రజలకు అవినీతి రహిత సేవలు అందించాలని పౌర సమాజం కోరుతుంది.

-కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా

## దివ్యాంగులకు ప్రత్యేక స్థానం

జాతీయఅవార్డులలో దివ్యాంగులకు ప్రత్యేకస్థానం కల్పించాలి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి జాతీయ స్థాయి అవార్డులలో దివ్యాంగులకు ప్రత్యేకమైన స్థానంకల్పించాలి. వివిధరంగాలలో నైపుణ్యం కలిగిన వారిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా దివ్యాంగులను చైతన్య పరిచిన వాళ్లం అవుతాం. అవార్డులు ప్రకటించడంద్వారా వారిలో కూడా ఆత్మస్థైర్యం పెరిగి పోటీతత్వం ఏర్పడి అన్ని రంగాలలో వారు రాణించగలరు. గతంలోఉన్న అవార్డులను కూడా కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని వారి వాదన. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని దివ్యాంగులకు జాతీయ అవార్డులలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకమైన స్థానం కల్పించాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## వేతన జీవికి ఊరట

ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ వేతన జీవులకు ఊరట కలిగించింది.ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.7లక్షలనుండి రూ.12లక్షల వరకు పెంచారు, దీంతో మధ్యతరగతి వర్గాలకు ఆర్థిక ఉపశమనం లభించనుంది. రూ. 12 లక్షలకు మించిన పెట్టుబడులకు అవకాశం ఉంది. ఉపాధి అవకాశాలు కూడా పెరగవచ్చు.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## హత్యల్లో వినూత్న పద్ధతులు

ఈ మధ్య హత్యలు వినూత్న పద్ధతులను సంతరించుకుంటున్నాయి.ఇటీవల భార్యను చిత్రహింసలుపెట్టి చంపి ముక్కలు ముక్కలు చేసి కుక్కర్లో ఉడక పెట్టేసి, ఆ తరువాత ఆ ముక్కల్ని ఎండ పెట్టి రోట్లో పోసి దంచేసి ఆ పొడిని ఓ బకెట్లో నింపి ఓ చెరువులో కలిపేసాడట. అయ్య బాబోయ్ అంత ఓపిక అంత కసిని ఎలా పెంచు కున్నాడో. పోలీసులే ఇంతవరకు ఇలాంటి కేసును చూడలేదని అభిప్రాయ పడుతుండడం, మరియు ఈ హత్యలు దృశ్యం సినిమాను మించిపోయాయి. సెల్ ఫోన్లలో రకరకాల హత్యా పద్ధతులను చూసి ఇటువంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారు.నీతి నియమాలు కడగంటి పోతున్నాయి.మానవత్వం రానురాను మృగ్యమైపోతోంది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## పనుల వేగం పెరగాలి!

రాష్ట్ర రాజధాని అమరావతికి 57 కిలో మీటర్ల రైలు మార్గం నిర్మాణం పూర్తి కావడానికినాలుగు సంవత్సరాలు పడుతుందని రైల్వేశాఖ ప్రకటించింది. 57కిలోమీటర్ల మార్గానికి అంతసుదీర్ఘ కాలం పట్టడం ఆశ్చర్యంగా ఉంది! వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ముఖ్యమంత్రి బుల్లెట్ ట్రైన్ అంటూ ప్రకటనలు చేయడం విడ్డూరంగాఉంది! నిజానికి ఈ ప్రతిపాదిత మార్గం ఒక రైలు మార్గం నుంచి మరో మార్గానికి అనుసంధానించడమే, అదీ పూర్తిగా మైదాన ప్రాంతం! ఒక్క కృష్ణానదిపై రైల్వే బ్రిడ్జి తప్పితే మిగిలిన పనులు ఒకటి, రెండు సంవత్సరాల్లో పూర్తి చేయవచ్చు! రైల్వేబ్రిడ్జి కూడా ఇప్పుడు మొదలుపెడితే రెండు సంవత్సరాల్లో పూర్తిచేయవచ్చు?భూసేకరణ ఇప్పటికే ప్రారంభం అయింది. నిర్మాణ పనులను విభజించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయడానికి కాలయాపన చేయడం తగ్గించి పనుల్లోవేగం పెంచితే రెండుసంవత్సరాల్లో పూర్తిచేయవచ్చు. ప్రజాప్రతినిధులు, రాష్ట్రప్రభుత్వం రైల్వేశాఖపై పనులవేగానికి ఒత్తిడి పెంచాలి !

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు,ఏలూరు జిల్లా

## వాట్సాప్ పాలన తేవాలి

ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దేశంలో మొదటిసారి వాట్సాప్ పాలన తీసుకొచ్చారు. అందుకు అవసరమైన అన్ని రంగాలతో కూటమి ప్రభుత్వం కలగలిసి ఆ సేవలను అందిస్తోంది. ఇదిముమ్మాటికీ హర్షణీయం. ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది. ఈరకమైన సేవలద్వారా ప్రజలవిలువైన సమయం,ధనం ఆదా అవుతుంది. కావునా తెలంగాణాలో వాట్సాప్ పాలన తేవాలి.

-శ్రిష్టి శేషగిరి, సికిందరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విజయవాడ వార్త

## నూతన లైన్ పనులను శరవేగంగా పూర్తి చేయండి : కమిషనరు

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** రెడ్ సర్కిల్ వద్ద ఒక కోటి 99 లక్షల వ్యయంతో జరుగుతున్న యుజిడి కొత్త లైన్ పనులను శరవేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర సిబ్బందిని ఆదేశించారు. బుధవారం



ఆయన రెడ్ సర్కిల్,మధురానగర్,గుణదల సెంటర్,గుణదల రైల్వే స్టేషన్,న్యూ రాజరాజేశ్వరి పేట, కొత్త వంతెన ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెడ్ సర్కిల్ వద్ద పర్యటించి జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కొత్త లైన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. యుజిడి పనులు చేసేటపు ఊపడు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా నీరు పొంగి బయటకు రాకుండా చర్యలు తీసుకుంటూ పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం కొత్త వంతెన వద్ద పాడైపోయిన మాన్‌హోల్ మరమ్మత్తులపనుల ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులను వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో మాన్ హోల్ ఎక్కడున్నా రోడ్ లెవెల్‌కి సమానంగా ఉంటేటట్లు చర్యలు తీసుకోవాలన్నా రు. అనంతరం రైల్వే వివిధ శాఖల సమన్వయం తో రానున్న నాలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రాంతాలైన మధురానగర్,గుణదల సెంటర్, గుణదల రైల్వే స్టేషన్,కొత్త రాజరాజేశ్వరి పేట ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి వివిసి తరఫున తీసుకోవాల్సిన చర్యలలో అధికారులు ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,చీఫ్ సిటీ ప్లానర్ జివిజిఎస్‌వి ప్రసాద్,ఇంఛార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్‌లు పి.సత్యన్నారా యణ,పి.సత్య కుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## ఏపిలో ఆరోగ్య సంరక్షణకు షావోమి ఎంఒయు

**విజయవాడ, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజల ఆరోగ్య సంరక్షణకు షావోమి ఇండియా ఒప్పందాన్ని సోనూసూద్ ఛారిటీ ఫౌండేషన్‌తో కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిన ఈ ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలో వెనుకబడ్డ జిల్లాల్లో అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాల పెంపు, ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం కోసం నాలుగు అంబులెన్సులను విరాళంగా షావోమి ఇండియా ఛీఫ్ పీపుల్ ఆఫీసర్ వరుణ్ మదన్ విరాళంగా అందించారు.



## చలానాలు పెండింగ్‌లో ఉంటే వాహనాల సీజ్ : సిపి రాజశేఖరబాబు

**విజయవాడ క్రైం,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త :** నగరంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంపై రాష్ట్ర హైకోర్టు కొన్ని సూచనలు సేసిందని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా వాహనం నడిపేటప్పుడు తప్పనిసరితగా హెల్మెట్ ధరించాలని ఉల్లంఘనకు పాల్పడే వారికి అధికంగా జరిమానా విధించాలని, 90 రోజుల లోపుల జరిమానా కట్టకపోతే వారి వాహనాలను సీజ్ చేస్తామని సిపి రాజశేఖరబాబు వెల్లడించారు. అంతేకాక తరచూ మోహనవాహన చట్టం ఉల్లంఘించిన వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు. హైకోర్టు ఉత్తర్వులననుసరించి నగర ట్రాఫిక్ విభాగం,శాంతి భద్రతల విభాగం వారు నగరంలో,జిల్లాలో సదరు సూచనలపై అవగాహన కల్పిస్తూ 2024 డిసెంబరు 19 నుండి ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించి జరిమానాలు విధిస్తూ,వారిలో అవగాహన కల్పిస్తున్నారన్నారు. చాలా మంది చలానాలు కట్టకపోవడంతో ఈ చలాన్లు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నెల 3,4 తేదీలలో 90 రోజుల పైన జరిమానాను



కట్టని వాహనాలను తనిఖీ చేసి 141 వాహనాలను ఇప్పటి వరకు సీజ్ చేసామన్నారు. వారి వాహనాలపై ఉన్న జరిమానాలను కట్టిన అనంతరం వారి వాహనాలను విడుదల చేస్తున్నామన్నారు. ఎన్టీఆర్ జిల్లా,విజయవాడ నగరం లోని వాహనదారులు వారి వాహనాలపై ఉన్న 90 రోజులు దాటి ఉన్న ఈ-చలాన్‌లను వెంటనే ఈ పరివాహన యాప్ ద్వారా కాని, మీ సేవలో గాని వెంటనే జరిమానా కట్టి పెండింగ్‌లో లేకుండా చేసుకోవాలన్నారు.మార్చి 1 నుండి రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం నూతన మోటారు వాహన చట్ట నిబంధనలననుసరించి పెంచిన జరిమానాలను విధిస్తామని ఆయన పేర్కొన్నారు. హెల్మెట్ ఉల్లంఘనపై ఇప్పటి వరకు రూ.135లుగా ఉన్న జరిమానా రూ.1000లు విధించబడతాయని,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కొత్త చట్ట ప్రకారం రూ.10వేల వరకు జరిమానాను విధిస్తామన్నారు. ఇతర ఉల్లంఘనలకు కూడ కొత్త మోటారు వాహన చట్టంలో జరిమానాలు పెంచబడ్డాయని తెలియచేశారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించి నిబంధనలు పాటించాల్సిందిగా ఆయన కోరారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం వచ్చే నెల 1 నుండి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## రూటు మార్చిన దొంగలు

**తాడేపల్లి,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త :** ఉల్లిచేసిన మేలు తల్లిచేయదు అంటారు పెద్దలు..అలాంటి రైతు పండించిన పంట దొంగల పాలు.. రైతులు కన్నీటి పాలు.తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో కృష్ణారెడ్డి అనే రైతు పండించిన పంటను దొంగలు దోచుకెళ్ళారు.రాజధాని పంటపొలాల్లో ఉల్లిపాయ బస్తాలు దొంగిలించిన దొంగలు.ఆరుగాలం పాటు కష్టపడి పంట పండించిన రైతు పంటను రాత్రి బస్తాల్లో నింపి ఉదయాన్నే మార్కెట్‌కు తరలించే సమయానికి ..50కిలోల ఉల్లిపాయ బస్తాలు 19టిక్కిలు గుట్టు చప్పుడు కాకుండా రాత్రి ఆటోలో తరలించుకు పోయారు.బాధిత రైతు కృష్ణారెడ్డి ఫిర్యాదుమేరకు తాడేపల్లి పోలీస్టేషన్‌లో కేసు నమోదు చేశారు.రాజధాని ప్రాంత పంట పొలాల్లో రాత్రిళ్ళు గంజాయి బా ్యచ్ తిరగటం పొలాల్లో మందు తాగటం పంటను దోచుకుపోతున్నారు.గంజాయి మధ్యం బ్యాచ్ దెబ్బకు రైతులు రాత్రుళ్ళు పొలాల్లో కాపాలా ఉండేందుకు భయపడుతున్నారు.

## మాజీ మంత్రి దేవినేనినీ మర్యాదపూర్వకంగా కలిసిన నందిగామ మునిసిపల్ చైర్మన్



నందిగామ ఫిబ్రవరి 05 ప్రభాతవార్త: నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి శ్రీనివాసరావులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావుని గొల్లపూడి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మండవ కృష్ణకుమారి మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నికైనందుకు మాజీ మంత్రి దేవినేని ఉమ మహేశ్వరం దుస్సాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పగిలిన పైపులైనుకు వెంటనే మరమ్మత్తులు చేసిన మునిసిపల్ సిబ్బంది

**నందిగామ ఫిబ్రవరి 05 ప్రభాతవార్త:** రైతు పేట లక్ష్మీ ప్రసన్న థియేటర్ వద్ద కీసర నుంచి వచ్చే మంచినీటి ప్రధాన లైన్ ఒక్కసారిగా పగిలి రెండు అడుగులు ఎత్తు మేరపొంగి ప్రవహిస్తున్న మంచినీరు. ఒక్కసారిగా పైపు పగిలి పొంగి ప్రవహించడంతో జాతీయ రహదారిపై ఎన్ని అడుగుల నీరు ప్రవహించుటతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కరంగా మారిందని చెప్పవచ్చు అయితే సమాచారం అందుకున్న మున్సిపల్ వాటర్ లైన్ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని



త్వరితగతిన ప్రధాన కీసర లైన్ నుండి వచ్చే మంచినీటి సరఫరాను నిలుపుదల చేసి మరమ్మత్తుల పనులు వేగవంతంగా చేపట్టడం జరిగినది. అసలే పట్టణానికి మంచినీటి కొరత అధికం ఉన్న తరుణంలో ఇలాంటి మంచినీటి పైపుల లీకులు వల్ల పైప్ లైన్లు పగిలిపోయి వృదాగా నీరు పోతే తాగునీరు సమస్య రానున్న కాలంలో ఎక్కువ అవుతుందని ఆ ప్రాంత ప్రజలు తెలియజేయడం జరిగినది. అయితే రానున్న వేసవికాలం కాబట్టి ఇలాంటి పైపులైనులు లీకులు లేకుండా ముందుగా మున్సిపల్ సిబ్బంది గుర్తించి వెంటనే మరమ్మత్తులు చేయాలని ఆ ప్రాంత ప్రజలు మున్సిపల్ అధికారులను సిబ్బందిని ముక్తకంఠంతో కోరుతున్నారు.

## చేతివృత్తులు ద్వారా మహిళలకు ఆర్థికంగా చేయూత

**నందిగామ ఫిబ్రవరి 05 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థిక ఎదుగుదలకు చేతివృత్తులు ఎంతగానో ఉపయోగపడతాయని గరికపాడు కె.వి.కె డాక్టర్ ఆర్ ప్రభావతి తెలియజేశారు. గరికపాడు, కె.వి.కె ఆద్వర్యంలో డాక్టర్ ఆర్.ప్రభావతి శాస్త్రవేత్త , గృహ విజ్ఞాన శాస్త్ర విభాగం , 2 రోజులపాటు సర్ఫ్ మరియు ఫెనాయిల్ తయారీ పై కార్యక్రమం ఎస్.సి, విస్తరణ సిబ్బందికి ఐ.సి.డి.ఎస్. ఆఫీస్, నందిగామ నందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.ప్రభావతి మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం గృహిణులకు మరియు యువతకు అదనపు ఆదాయం సమకూర్చుటలో దోహద పడుతుంది అని వివరించడం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న మహిళలు ఉత్సాహంతో సర్ఫ్ మరియు ఫినాయిల్ తయారీలో పాల్గొని ఆనందించడం జరిగింది. ఈ ఉత్పత్తులను తమ ఇంటిలోకి తయారు చేసుకొని ఇంటి ఖర్చులు తగ్గించుకోవడమే కాకుండా కొంత ఉత్పత్తి అమ్ముట ద్వారా మరింత ఆదాయాన్ని అర్జించవచ్చు అని వ్యక్త పరచడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐ.సి.డి.ఎస్, సి.డి.పి.ఓ, ఎ.సి.డి.పి.ఒ, సూపర్వైజర్ , డాక్టర్ ఐ.వెంకట రెడ్డి విస్తరణ విభాగం, డాక్టర్ ఎన్.రాజశేఖర్ సస్యరక్షణ, శాస్త్రవేత్త, డాక్టర్, టీ.జస్వంత్ రెడ్డి, పశు వైద్య , శాస్త్రవేత్త పాల్గొని సర్టిఫికెట్స్ మరియు బ్రోచర్స్ పాల్గొన్న వారికి ఇవ్వడం జరగింది.



## వైకాపా పూర్వవైభవానికి కృషి చేయాలి

### -మాజీ సిఎం జగన్ ఆదేశం -వీరారెడ్డి ఆదేశం వెల్లడి

**ఎ కొండూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** వైసిపి అధ్యక్షుడు ఎపి స్టేట్ మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దంపతులు లండన్ విదేశీ పర్యటన ముగించుకుని స్వరాష్ట్రంలోని గుంటూరు జిల్లా తాడేపల్లి క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న సందర్భంగా వైసిపి రాష్ట్ర నాయకుడు నరెడ్ల వీరారెడ్డి మర్యాదపూర్వకంగా జగన్‌ను భారతరత్న కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మీడియాతో బుధవారం మాట్లాడుతూ వైసిపి బలోపేతానికి కృషిచేసి పార్టీకి పూర్వవైభవం తేవాలని జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారని నరెడ్ల వీరారెడ్డి తెలిపారు.



## ఐకానిక్ సిటిగా వినుకొండను అభివృద్ధి చేస్తాం

### -ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

**వినుకొండ, ఫిబ్రవరి5, ప్రభాతవార్త:** వినుకొండను ఐకానిక్ సిటిగా అభివృద్ధి చేయడం జరుగుతుందని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు తెలిపారు. పట్టణంలో



చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులు, ప్రజా ప్రతి నిధులు, అధికారులతో కలిసి రౌండ్‌టేబుల్ కార్యాల యంలో బుధవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన, మున్సిపల్ ఛైర్మన్ దస్తగిరి, మున్సిపల్ కమీషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ గత వైకాపా పాలనలో వినుకొండలో అభివృద్ధి ఏమీ జరగలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబునాయుడు కృషి వల్ల వినుకొండ పట్టణం అభివృద్ధికి నిధులు విడుదల అవుతున్నాయని చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎన్నెస్పీ స్థలం నందు తితిదే కళ్యాణ మండపం, షాదీఖానా, పార్కు, ఇండోర్‌స్టేడియం, స్విమి మ్మింగ్‌ఫూల్, జిమ్, మైనార్టీ కాలేజి, అలాగే డిగ్రీ కాలేజి నందు అవుట్‌డోర్ స్టేడియం, క్రికెట్ మైదానం, గ్యాలరీ వంటి అభివృద్ధి పనులు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ బిసిదళ ఆత్మీయ సమావేశం

**ఎ కొండూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ బిసిదళం ఏర్పడి ఈ నెల 5కి ఏడాదికాలం గడచిన సందర్భంగా నియోజకవర్గ బిసి దళ సభ్యుల ఆత్మీయ సమావేశాన్ని బుధవారం నియోజకవర్గ బిసిదళం అధ్యక్షుడు చల్లారి గణేష్ (గణపతి) నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి దళం ఏర్పాటు సమయంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ముందుకు తీసుకెళ్లటానికి దళ సభ్యులు చేసిన కృషిని గణపతి అభినందించారు. ఈ బిసి దళం నియోజకవర్గ స్థాయిలో ప్రతి గ్రామంలో తిరిగి పార్టీ ప్రచార కార్యక్రమాలు దైవ సామనులైన విజయవాడ డైనమిక్ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తిరువూరు ఎమ్మెల్యే యంగ్‌స్టార్ కొలికిపూడి శ్రీనివాసరావుల సహకారాన్ని ప్రోద్భల్యాన్ని వారు దళానికి ఇచ్చిన స్ఫూర్తి ఎంతో గొప్పదని వీరు ప్రశంసించారు. త్వరలో సిఎం చంద్రబాబు ఆఖరి విడత నామినేటెడ్ పదవుల భర్తీలో న్యాయం చేస్తామని ఎంపి హామీ ఇచ్చారని త్వరలో బిసి ఐక్యత కోసం ప్రతి మండల కేంద్రంలో ప్రతి గ్రామంలో తిరిగి నియోజకవర్గ స్థాయిలో త్వరలో ఆత్మీయ సభ ఏర్పాటు చేసి అందరి ఆలోచన పరిగణలోకి తీసుకుని గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గెలుపుకు విశేష కృషి చేశారని అదే స్ఫూర్తితో ఎంపి ఎమ్మెల్యే సహకారంతో కార్యాచరణ రూపొందించుకుని మరింత బలోపేతంగా కృషిచేస్తామని గణపతి తెలిపారు. జైబిసి జయహో బిసి బిసిల ఐక్యత వర్ధిల్లాలి జై చంద్రబాబు జై కేశినేని చిన్ని జై కొలికపూడి శ్రీనివాస్ అంటూ పెద్దపెట్టున దళం నినదించారు.



## హెల్మెట్, డ్రగ్స్ ,సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

**ఎ కొండూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు సిఐ పరిధిలోని ఎ కొండూరు మండల పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ చల్లా కృష్ణ హెల్మెట్ ధరించడంపై డ్రగ్స్‌పై సైబర్ నేరాలపై ఫిజికల్ ఫిట్‌నెస్ యొక్క ఆవశ్యకతపై ప్రజలకు యువతకు వివిధ రకాల ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. మండలంలోని కంభంపాడు గ్రామంలో గ్రామయూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను చీఫ్‌గెస్ట్‌గా పాల్గొని ప్రారంభించిన అనంతరం అక్కడకు వచి ్చన యువతకు పలువురు వాహనదారులకు ప్రజలకు సైబర్ నేరాలపై హెల్మెట్ డ్రగ్స్ ఫిజికల్ ఫిట్‌నెస్‌లపై వారికి అవగాహన కల్పించి చైతన్యవంతం చేశారు. ఇంకా కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర ధృడత్వానికి దోహదం

### - వైకాపా యువనేత రాడ్ ,ఎస్సై కృష్ణ రేజా వెల్లడి

**ఎ కొండూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం కంభంపాడు గ్రామంలో



జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను బుధవారం వైసిపి మండల యూత్ అధ్యక్షుడు కాలసాని చెన్నారావు (రాడ్) ఎస్సై చల్లా కృష్ణ రేజా చీఫ్ గెస్ట్‌లుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాడ్, ఎస్సై చల్లా కృష్ణ మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి శరీర ధృడత్వానికి దోహదపడతాయని ముఖ్యంగా గ్రామాల్లో యువత జూదక్రీడల వైపు దృష్టి మరలకుండా సాంప్రదాయ క్రీడల వైపు దృష్టి మరల్చడం ద్వారా గ్రామాల్లో శాంతియుత వాతావరణం సమాజ శ్రేయస్సు అభివృద్ధికి ఇటువంటి క్రీడలు ఎంతో మంచి సాంప్రదాయం ఆరోగ్యదాయకమని నిర్వాహకు లు రాడ్, ఎస్సై చల్లా కృష్ణ, రేజా అబినందించారు. ఈ క్రీడల్లో గెలుపొందిన విజేతలైన క్రీడాకారులకు కాలసాని చెన్నారావు (రాడ్) రూ.30వేలు మొదటి బహుమతి ప్రకటించ ్గా, ద్వితీయ బహుమతి రూ.20వేలు గోపాలపురం గ్రామానికి చెందిన బొచ్చా సురేష్‌బాబు, తృతీయ బహుమతి రూ.10వేలు మాధవరం సర్పంచ్ కుక్కల వైకుంఠరావు, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌కు రూ.2వేలు నగదు ప్రోత్సాహక బహుమతి కంభంపాడుకు చెందిన ఎస్ తిరుపతిరావు ప్రకటించారు.

## మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు

**మంగళగిరి,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త :** నగర పరిధిలోని డాన్ బోసో ్ర స్కూల్ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఎర్రబాలెనికి చెందిన వ్యక్తిగా గుర్తించి అదుపులోనికి తీసుక్కొచ్చి విచారించి అరెస్టు చేసినట్లు ఎస్సై చిరుమామిళ్ళ వెంకట్ తెలిపారు.బుధవారం రూరల్ పోలీసే ్టషనో ్ల జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.బాలికపట్ట అసభ్యంగా ప్రవర్తించిన కేసులో సిసి కెమెరాలు ఆదారంగా నిందితుని గుర్తించినట్లు తెలిపారు.నిందితుడు ఎయిమ్స్ హాస్పటల్ ఆపరేషన్ థియేటర్‌లో అసిస్టెంట్ గా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నట్లు తెలిసిందన్నారు.అరెసు ్ట అనంతరం న్యాయమూర్తి ముందు హాజరుపరచగా నిందితునికి 14రోజులు రిమాండ్ విధించి జిల్లా జైలుకు తరలించడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామ పరిధిలో ఫిభ్రవరి 1వ తేది సాయంత్రం 4.30గంటలకు డాన్ బోసో ్ర స్కూల్ నందు చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని,తన సొంత చెల్లి ఇరువురు మైనర్ బాలికలు స్కూల్ నుండి ఇంటికి వెళుతున్న క్రమంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వారిని వెంబడించి వారి ఇరువురిలో పెద్దపాప అయిన 14సంవత్సరాల మైనర్ బాలికను అడ ్డగించి తనని బెదిరించి తనపై తనపట్ల అనుచితంగా ప్రవరి ్తంచిన వ్యక్తిపై తల్లిదండ్రులు,సదరు బాలిక ఫిర్యాదు పై మంగళగిరి రూరల్ పోలీసులు దర్యాప్తు చేశారు.



## పారిశుధ్య నిర్వహణ లోపం లేకుండా చూసుకోవాలి : కమిషనరు

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త :** ఈట్ స్ట్రీట్‌ల పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చేసుకోవాలని, ప్రజలు ఆహారం సేవించే ప్రదేశమైనందున ఎల్లప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రజలకందించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. బుధవారం ఆయన వేముల శ్యామల రోడ్,ఈట్ స్ట్రీట్,సింగ్‌నగర్ ప్రాంతాలను పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈట్ స్ట్రీట్ వద్ద వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ, డిస్ ఇన్సెక్టంట్స్ వేసేటట్లు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం సింగ్‌నగర్‌లో ఉన్న క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. అక్కడకు వచ్చిన ప్రజలతో మాట్లాడి ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ పరిశుభ్రతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. త్రాగునీరు,వాడుక నీరు నిరంతరాయంగా రావాలన్నారు. నోడల్ ఆఫీసర్లందరూ తమతమ అన్న క్యాంటీన్లను ప్రతి రోజు వీక్షించి ఎటువంటి లోపాలు ఉన్నా వెంటనే సరిచేయాలని,ఎటువంటి రిపేర్లు ఉన్నా వెంటనే మరమ్మత్తులు చేయించేటట్లు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,చీఫ్ సిటీ ప్లానర్ జివిజిఎస్‌వి ప్రసాద్,ఇంఛార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు,సూపరిండెంటింగ్ ఇంజనీర్లు పి.సత్యన్నారాయణ, పి.సత్యకుమారి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరెఉడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆర్డీవోకు శుభాకాంక్షలు తెలిపిన కాపు సంక్షేమ సంఘం నాయకులు

**తిరువూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** జనవరి 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా



జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా అవార్డు తీసుకున్న తిరువూరు ఆర్డీవో కె మాధురిని వారి కార్యాలయంలో తిరువూరు మండల కాపు సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు సింగంశెట్టి రాంబాబు మర్యాదపూర్వకంగా కలిసి ఆర్డీవోకు శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు కార్యక్రమంలో మాజీ గౌరవాధ్యక్షులు ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శి పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో ఎంతోమంది విద్యార్థినులను జాతీయ స్థాయిలో ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయ సంఘం మాజీ గౌరవాధ్యక్షుడు ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శి పట్టణ బాలికోన్నత పాఠశాల విశ్రాంత వ్యాయమ ఉపాధ్యాయుడు నేటి జనసేన పార్టీ నాయకులు జొన్నాడ రంగారావు దేశంశెట్టి నవీన్ పాల్గొన్నారు.

## తెదేపా సోషల్‌మీడియా కార్యకర్త మారేపల్లి శాంతబాబుకు ఎమ్మెల్యే రాజగోపాల్ అభినందన

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ కంటెంట్, కార్యక్రమాలను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్ళిన టిడిపి సోషల్‌మీడియా కార్యకర్త మారేపల్లి శాంత బాబును స్థానిక ఎంఎల్‌ఏ శ్రీరాం రాజగోపాల్ అభినందించారు. టిడిపి యాప్‌ద్వారా పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని నియోజకవర ్గస్థాయిలో టాప్ ఫెర్ఫార్మర్‌గా నిలిచిన శాంతబాబును ప్రశంసిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు జారీచేసిన అభినందన పత్రాన్ని రాజగోపాల్ బుధవారం అందజేశారు. ఈకార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ నకిరికంటి వెంకట్, మాజీ యార్డు డైరెక్టర్ మల్లెల కొండయ్య, పార్టీ ఎస్‌సి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మారేపల్లి బాష, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావ్యతిరేక ప్రభుత్వ విధానాలపై ప్రజల్ని మరింతగా చైతన్య వంతులను చేయాలి

### -వైకాపా సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** వైఎస్‌ఆర్‌సిపి అధినేత, మాజీ సిఎం జగన్మోహనరెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకునే వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో శ్రమించాలని, ప్రజావ్యతిరేక ప్రభుత్వ విధానాలపై ప్రజల్ని మరింతగా చైతన్యపర్చాలని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్‌ఆర్‌సిపి సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పలు గ్రామాల నుండి విచ్చేసిన పార్టీ నేతలతో ఆయన సమావేశమయ్యారు. గ్రామీణస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త ఇప్పటి నుండే కర్తవ్యోన్ముఖులు కావాలన్నారు. అనంతరం ఎస్‌సి వర్గీకరణ అమలుకే లక్ష డప్పులు వేల గొంతుకల పోస్టర్‌ను నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు, ఉద్యమ పోరాట యోధుడు మంద కృష్ణమాదిగ చేపట్టిన కార్యక్రమాలకు పార్టీ ద్వారా తమ వంతు సహాయ, సహకారాలను అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో తలపెడుతున్న లక్ష డప్పులు వేల గొంతుకల కార్యక్రమం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నేతలు మార్కుపూడి గాంధీ, బూడిద నరసింహారావు, గంగిపోగు రమేష్, అనె ్నపాక రమేష్, దుర్గారావు, శ్యామ్ లాక్, మాతంగి దావీదు, బొడ్డు వెంకటేశ్వర్లు, వంశీ, రంజిత్, జి బాబు, రవీందర్, బ్తుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్‌యు పరీక్షల్లో నూతన సంస్కరణలు : ఆచార్య ఎం సుబ్బారావు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త :** వర్సిటీ పరిధిల జరుగుతున్న పరీక్షల్లో నూతన సంస్కరణలు తీసుకొచ్చినట్లు పిజీ అండ్ ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు తెలిపారు.బిఈడి మూడోసెమిస్టర్ రెగ్యులర్,సప్లిమెంటరీ పరీక్షల పశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలకు పంపిణీ చేయడంలోపాత విధానానికి స్వస్థి పలికి నూతనంగా సాంకేతికతను జోడించి సీడీల రూపంలో ప్రశ్నాపత్రాలు పంపిణీ విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.పరీక్షలు జరిగే అన్ని రోజులకు సంబందించిన ప్రశ్నా పత్రాలను సిడీల రూపంలో పరీక్షా కేంద్రాలకు అందజేశామని ప్రతిరోజు పరీక్ష ప్రారంభమయ్యే 45నిమిషాల ముందు పాస్ వర్డ్‌ను పరీక్షా కేంద్రాలకు పంపిస్తున్నామని వివరించారు.ఆధునిక సాంకేతికతను జోడించి సిడీలు రూపంలో ప్రశ్నాపత్రాలనుపరీక్షా కేంద్రాలకు అందజేయడం వలన పరీక్షా కేంద్రాల నిర్వాహకులు దూరంగా ఉండేనోడల్ కేంద్రాలు వెళ్ళి ప్రశ్నా పత్రాలు తీసుకెళ్ళే ఇబ్బందులు తగ ్గటంతో పాటు ప్రశ్నా పత్రాల లీకేజిని అరికట్టి సమర్థవంతంగా పరీక్షలను నిర్వమించుటానికి ప్రశ్నాపత్రాల సీడిల విధానం ఎంతో దోహదపడుతుంది.ఇప్పటికే చాల పరీక్షలను సిడి రూపంలో జరుగుతున్నాయని సుబ్బారావు స్పష్టంచేశారు.

# పల్నాడు జిల్లాలో 48 ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలు

**నరసరావుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాలో 48 కేంద్రాలలో ఇంటర్మీడియట్ వ్రాత పరీక్షలను నిర్వహిస్తున్నా మని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. బుధవారం విద్యాశాఖ అధికారులతో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. మార్చి 1వతేదీ నుండి 20వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. 17905 మంది ఫస్ట్‌ఇయర్ విద్యార్థులు, 14529 మంది సెకండ్‌ఇయర్ విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. మొత్తం 32,434 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నట్లు వారు తెలియజేశారు. వీరితో పాటు మరో 2117 మంది విద్యార్థులు మార్చి 3 నుండి 15 వరకు ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నారన్నారు. తొమ్మిది కేంద్రాలలో ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక హెల్త్ అసిస్టెంట్‌ను అందుబాటులో ఉంచాలని, మెడికల్ వ్యానులను సిద్ధం ఉంచాలని డిఎం అండ్ హెచ్ఓను ఆదేశిం చారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశాలను కలెక్టర్ అరుణ్‌బాబు జారీ చేశారు. కార్యక్రమంలో డిఆర్ఓ మురళీ, జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి నీలావతిదేవి, డిఈవో చంద్రకళ, డిఎంఅండ్‌హెచ్ఓ రవి, మున్సిపల్ కమిషనర్ జశ్వంత్‌రావు పాల్గొన్నారు.

# మిర్చి రైతులను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**చిలకలూరిపేట, ఫిబ్రవరి5, ప్రభాతవార్త:** ధరల పతనంతో దిక్కు తోచని పరిస్థితులలో ఉన్న మిర్చి రైతులను తక్షణమే ఆదుకోవాలని మాజీమంత్రి నియోజక వర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం ప్రత్తిపాటి నివాసంలో జరిగిన విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో విరివిగా సాగయ్యే ప్రధాన వాణిజ్యపంట సాగుదారులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పెరిగిన సాగువ్యయం ధరల పతనంతో మిర్చి రైతులు నష్టాల భారినపడి దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నారని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం సాగువిస్తీర్ణం తగ్గినప్పటికి, దిగుబడి వచ్చిన పంటకు సరైన దిగుబడి లేకపోవటం వలన నష్టాలు వస్తున్నాయని తెలిపారు. పెట్టుబడి వ్యయం పెరగడం కూడా మరింత ఇబ్బందిగా తయారయ్యిందన్నారు. పొగాకు స్పైసెస్‌బోర్డు మాదిరే మిర్చి బోర్డు కూడా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రత్తిపాటి కోరారు. మిర్చి రైతులకు నూతన సాగు విధానలపై అవగాహన కల్పించి తక్కువ పెట్టుబడితో నాణ్యతతో కూడిన దిగుబడి సాధించే విధంగా కృషి చేయాలని కోరారు. గతంలో మిర్చి ధరలు తగ్గినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్వింటాల్‌కు రూ1500ప్రోత్సాహకాలు ప్రకటించారని అన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు జరిపించి దళారుల మోసాలను అరికట్టారని చెప్పారు. మన రాష్ట్రంలో మిర్చి సాగు తగ్గిన మిగతా రాష్ట్రాలలో మిర్చి సాగు పెరిగి దిగుబడి కూడా అధికంగా ఉండటంతో ఆ ప్రభావం మన రాష్ట్రంపై పడిందన్నారు. ఈ నేపథ్యంలో మిర్చిధరల తగ్గుదల రైతుల సమస్యలను నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్ళడం జరిగింది అని అన్నారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో మిర్చి రైతుల కష్టాలు, ధరల క్షీణత తదితర సమస్యలను కేంద్ర వ్యవసాయ శాఖామంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు తెలియజేశారని ప్రత్తిపాటి తెలిపారు.

# ఉపాధి హామీ పనుల రికార్డులను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ పి అరుణబాబు


**చిలకలూరిపేట,ఫిబ్రవరి5, ప్రభాతవార్త:** మండలంలోని లింగంగుంట్ల, కావూరు గ్రామాలలో పలు కార్యక్రమాలను బుధవారం పల్నాడు జిల్లా కలెక్టర్ పి. అరుణబాబు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంత చెత్తను సేకరించి సంపదను సృష్టిస్తున్నారు, ఎంత నగదును వసూలు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాతీయ ఉపాధి హామీ



పథకం క్రింద పంట కాలువలో పూడిక తీత పనులను పరిశీలించి ఎన్ని పనిదినాలు కల్పిస్తున్నారు,ఎంత వేతనం చెల్లిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ పథకం రికార్డులను తనిఖీ చేశారు. రీ సర్వే ప్రక్రియ సకాలంలో పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్.డి.వో మాదవీలత వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రహదారి పనులు పరిశీలించిన ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

**వినుకొండ,ఫిబ్రవరి5,ప్రభాతవార్త:** వినుకొండ మండలంలో జరుగుతున్న తారరోడ్లు, రహదారుల పనులను ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు బుధవారం పరిశీలించారు. కుమ్మరిపాలెం, తిమ్మాయిపాలెం, శ్రీరామ్‌నగర్,పానకాలపాలెం, దొండపాడు తదితర గ్రామాల్లో రూ. 6.15 కోట్ల




నిధులతో పనులు జరుగుతున్నాయి. పనులు పరిశీలించిన జీ.వీ అధికారులతో మాట్లాడారు. పనులు నాణ్యత ఖచ్చితత్వం పాటించాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత వైకాపా పాలనలో ప్రజలు రోడ్లపై నడవలేని దుస్థితి చూశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రోడ్లు ఏర్పాటు, మరమ్మత్తులకు నిధులు కేటాయించి ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందని చెప్పారు. వినుకొండ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మానాలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.

# జాతీయ భద్రతా వారోత్సవాలలో భాగంగా డ్రైవర్లకు ఉచిత నేత్ర పరీక్షలు



**చిలకలూరిపేట,ఫిబ్రవరి5, ప్రభాతవార్త:** జాతీయ భద్రతా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని చౌదరయ్య హెల్త్ క్లబ్ నందు పాఠశాలల బస్సు డ్రైవర్లకు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నరసరావుపేట రామలింగారెడ్డి మాక్స్ విజన్ కంటి వైద్యశాల సహకారంతో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె,యల్ రావు మాట్లాడుతూ 36వ జాతీయ భద్రతావారోత్సవాలలో భాగంగా ఈ వైద్య శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అవగాహన..తో క్యాన్సర్‌ను నివారించవచ్చు

## -కెఎల్‌యులో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

**తాడేపల్లి, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త :** చిన్నవయస్సు నుండే తగిన అవగాహనతో జీవనశైలిని ఏర్పరచుకుంటే క్యాన్సర్ వ్యాధిని నివారించుకోవచ్చని విఓజిఐఎస్ అధ్యక్షురాలు డాక్టర్ వెల్లంకి శ్రీదేవి అన్నారు.ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులకు,మహిళా అధ్యాపకులకు గర్భాశయ క్యాన్సర్,రొమ్ము క్యాన్సర్‌పైన అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ



పర్యావరణ కాలుష్యాలకు తోడు,ఆధునిక జీవనశైలి కూడా నేటితరంలో క్యాన్సర్ వ్యాధి విజృంభించడానికి కారణమవుతున్నాయని వివరించారు .కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్లు ప్రొఫెసర్ ఎవిఎస్‌ప్రసాద్,డాక్టర్ కె.రాజశేఖరరావు,రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు,విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జ్ డీన్ డాక్టర్ కెఆర్‌ఎస్‌ప్రసాద్,అసోసియేట్ డీన్,కెఎల్ మహిళా డెవలప్‌మెంట్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య,కో-కనీ ్వనర్ శ్రీలక్ష్మీ,సిఎస్‌ఐటి అసిస్టెంట్ ఆచార్య డాక్టర్ ప్రవీణా భాగంగా అవగాహన సదస్సుతోపాటు 200కు పైగా విద్యార్థినులు,జేసీస్ విజయవాడ ఇంపాక్ట్ శాఖ అధ్యక్షులు రాజేంద్రరెడ్డి కందుల,ప్రాజెక్టు డైరెక్టర్ సుమ అట్లూరి తదితరులు పాల్గొన్నారు..

# విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలి

## - ప్రైవేటు పాఠశాలల యాజమాన్యానికి విద్యాశాఖ సూచనలు

**కారంపూడి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలని ఎంఈఓ రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక



మండల విద్యావనరుల కేంద్రంలో ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం జరిగింది. ఇటీవల మాచర్ల పట్టణంలోని యాపిల్ స్కూల్‌లో విద్యార్థి మృతి, కారంపూడిలో రెయిన్‌బో స్కూల్ విద్యార్థి తన నివాసంలో ఆత్మహత్య సంఘటనలతో విద్యార్థులను ఒత్తిళ్లకు గురి చేయవద్దని విద్యాశాఖ సూచనలు జారీ చేసింది. పాఠశాలల్లో వార్షికోత్సవం, కార్యక్రమాలు పాఠశాలల సమయాల్లో మాత్రమే నిర్వహించుకోవాలని ఆదేశించారు. పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు రాత్రి 2 గంటల వరకు నిర్వహించారని జిల్లా విద్యాశాఖకు ఫిర్యాదులు రావడంతో అలాంటి కార్యక్రమాలు నిర్వహించ వద్దని ఎంఈఓ రవికుమార్ సూచించారు. పిల్లల మనోభావాలు దెబ్బతీయ వద్దని, ఫీజులు కడితేనే హాల్ టికెట్లు ఇస్తామని చెప్పిన పాఠశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి పాఠశాలలో విద్యాశాఖ నియమ నిబంధనలు పాటిస్తూ, ఫైర్ సర్టిఫికెట్, టాయిలెట్, మంచినీరు, తదతర సూచనలు పాటించాలని ఎంఈఓ కోరారు.

# ప్రతి వ్యవసాయ కూలీకి పనికి తగిన వేతనం

## - డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్: సిద్ధలింగమూర్తి



**కారంపూడి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** ఉపాధిహామీ పథకంలో ప్రతి వ్యవసాయ కూలీకి పనికి తగిన వేతనం అందించనున్నట్లు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధలింగమూర్తి అన్నారు. మంగళవారం ఉపాధిహామీ పనులు పరిశీలించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి రూ.300 వేతనం కల్పించే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. మార్చి నాటికి 100 రోజులు పనులు పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లాలో రోజుకు 25 వేల మందితో ఉపాధిహామీ పనులు జరుగుతున్నాయ న్నారు. కారంపూడి మండలంలో మినీ గోకులాలు 20 పూర్తయ్యాయన్నారు. ఒక్కో గోకులానికి రూ.2.30 లక్షలు కేటాయించామన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి 10 నుంచి 15 లక్షలతో 10 రోడ్లు పూర్తయ్యాయన్నారు. పంట కాల్వలు, హార్టికల్చర్, హౌసింగ్ పనులు జరుగుతున్నాయని తెలిఎపారు. ప్లాంటేషన్ క్రింద 23 ఎకరాల్లో మామిడి, నిమ్మ, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్స్ తోటలు సాగులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ కోటిరెడ్డి, టీప వీర్ల వెంకయ్య తదితరులు ఉన్నారు.

# తహశీల్దారును కలిసి సత్కరించిన తెదేపా నేతలు

**రెంటచింతల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** మండల తహశీల్దారు కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన అర్జున్‌నాయక్‌ను మండల



తెలుగుదేశం పార్టీ నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకంక్షలు తెలిపి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం పలు గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, ప్రజా సమస్యలను తహశీల్దారు దృష్టికి వారు తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కార్యాలయంలో ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెదేపా నేతలు తహశీల్దారును కోరారు. కార్యాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి త్వరితగతిన ప్రజలకు సేవలు అందేలా రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడతామని తహశీల్దారు వారికి తెలిఎపారు. తహశీల్దారును కలిసిన వారిలో తెదేపా మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ, ప్రభురాజు, పుల్లారెడ్డి, రాయపరెడ్డి, జోసెఫ్‌రెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

# పికిల్‌బాల్ టోర్నమెంట్

**గుంటూరు విద్య,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త :** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని హెచ్‌సిజి క్యూరీ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో క్యాన్సర్ ఛాంపియన్‌లు, క్లినిషియన్‌లు,సంరక్షకుల కోసం ఆహ్లాదకరమైన సమ్మిళిత పికిల్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించింది. యునైటెడ్ బైయూనిక్ అనే అంతర్జాతీయ నేపథ్యంతో సమలేఖనం చేయబడిన కార్యక్రమం,క్రీడల ద్వారా ఐక్యతా భావాన్ని పెంపొందిస్తూ క్యాన్సర్ ఛాంపియన్‌ల వ్యక్తిగత విజయాల బలం,స్థిరత్వం,ప్రత్యేకమైన ప్రయాణాలను వెల్లడి చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.దాదాపు 30మందికి పైగా పాల్గొన్న ఈ కార్యక్రమం క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాటంలో ఐక్యంగా ఉన్న శక్తివంతమైన కమ్యూనిటిని ఒకచోట చేర్చిందని హెస్‌సిబి క్యూరీ సిటి క్యాన్సర్ సెంటర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తెర్లీ యువకిషోర్ పేర్కొన్నారు.

# నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవ్

## -మూడు రోజుల పాటు అలరించనున్న జాతీయస్థాయివేడుకలు

పొన్నూరు, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ 18వ ఎడిషన్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు.



ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగభూషణ్ మాట్లాడుతూ 18వ ఎడిషన్ విజ్ఞాన్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నేటి నుంచి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ప్రతి ఏటా విజ్ఞాన్ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రారంభోత్సవం నాడు ముఖ్య అతిథులుగా ఇండియన్ సింగర్, మ్యూజిక్ కంపోజర్ డాక్టర్ సాలూరి కోటేశ్వరరావు(కోటి), ఇండియన్ మ్యూజిక్ కంపోజర్ అండ్ ప్లేబాక్ సింగర్ ఎస్ఎస్ థమన్, గౌరవ అతిథిగా మాజీ ఇండియన్ వాలీబాల్ ప్లేయర్ మన్యం తులసిరెడ్డి హాజరవుతారని వెల్లడించారు. రెండో రోజు కార్యక్రమంలో ఇండియన్ యాక్టర్ డైరెక్టర్, స్క్రీన్ రైటర్, హీరో విశ్వక్ సేన్, హీరోయిన్ ఆకాంక్ష శర్మ, యాక్టర్ అభిమన్యు సింగ్ రానున్నట్లు చెప్పారు. చివరి రోజు జరిగే ముగింపు కార్యక్రమానికి ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్, స్క్రీన్ రైటర్ కెఎస్ రవీంద్ర(బాబి), 2024పారాలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్, ఇండియన్ పారా పిస్టల్ షూటర్, అర్జున అవార్డు రుబినా ఫ్రాన్సిస్ రానున్నట్లు చెప్పారు. విజ్ఞాన్ మహోత్సవ్‌లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల నుంచి 50వేల మంది విద్యార్థులు తరలి రానున్నారని తెలిపారు. విజ్ఞాన్ మహోత్సవ్ పోటీల విజేతలకు రూ.15లక్షలకు పైగా బహుమతులను అందజేస్తామన్నారు.

**80 ఈవెంట్ల నిర్వహణ:** విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహోత్సవ్‌లో మొత్తం 80ఈవెంట్లను నిర్వహిస్తున్నామన్నారు. తొలుత నిర్వహించే స్పోర్ట్స్ ఫీట్‌లో వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్, ఫుట్‌బాల్, హాకీ, తైక్వాండో, ఖోఖో, ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్, యోగాసన వంటి తదితర క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. వీటితోపాటు మ్యూజిక్, లిటెరరీ, స్పాట్‌లైట్, డాన్స్, డ్రమాటిక్స్ అండ్ ఫిల్మ్ మేకింగ్, ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్స్,కల్చరల్స్, థియేటర్ ఆర్ట్స్ వంటి తదితర రంగాలను కలుపుకొని సాంకేతిక, సాంస్కృతి కాంశాల్లో జాతీయస్థాయిలో పోటీలు ఉంటాయ న్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులంతా ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

# ఘనంగా రథసప్తమి వేడుకలు

## -సప్త వాహనాలపై నృసింహుని దర్శనం

**మంగళగిరి,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త :** రథ సప్తమిని పురస్కరించుకొని మంగళగిరి పట్టణంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవస్థానంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా వాహన సేవలు నిర్వహించారు.ఉదయం సూర్యప్రభ వాహనంపై లక్ష్మీ నరసింహాస్వామి వారు దర్శనమిచ్చారు.లక్ష్మీ నరసింహ స్వామి సూర్యప్రభ వాహన కైంకర్యపరులుగా గంజి రవీంద్రనాథ్,గంజి చిరంజీవి వ్యవహరించారు. అనంతరం శేష గరుడ,రాజాధిరాజ వాహనాలపై స్వామివారు ప్రదర్శనమిచ్చారు.కల్పవృక్ష, హనుమంత చంద్రప్రభ వాహనాలపై స్వామివారు దర్శనమిచ్చారు.చంద్రప్రభ వాహన సేవతో రథసప్తమి వేడుకలు



ముగిసాయి.ఈ సందర్భంగా పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర ్వహించారు.భక్తులు పెద ్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.ఈ సందర్భంగా గంజి చిరంజీవి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని,స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలన్నారు.ఆలయ ఈఓ అన్నపరెడ్డి రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# హెల్మెట్ లేకుంటే వాహనదారులకు ప్రవేశం లేదు : ఎస్సై రవిబాబు

**మాచర్ల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** హెల్మెట్ లేకుంటే ప్రవేశం లేదని ఎస్సై పి.రవిబాబు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మాచర్ల రూరల్ పరిధిలోని రాయవరం జంక్షన్ వద్ద ఎస్సై ఆధ్వర్యంలో వాహనదారులకు నో హెల్మెట్ నో ఎంట్రీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్సై మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు




తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. వాహనదారుల సంక్షేమార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు కిట్‌లు అందజేత

**మాచర్ల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** పట్టణంలోని సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లకు పీపీఈ కిట్లను మున్సిపల్ కమిషనర్ వేణుబాబు అందజేశారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్ (నమస్తే) పథకం కింద పురపాలక సంఘంలో సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లుగా పనిచేస్తున్న ఆరుగురికి ఈ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కుడి కాలువలో పడి వ్యక్తి గల్లంతు

**మాచర్ల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణ సమీపంలోని నాగార్జునసాగర్ కుడి కాలువలో ఓ యువకుడు గల్లంతైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పట్టణంలోని నాగార్జునసాగర్ రహదారిలో టీస్టాల్ నిర్వహిస్తున్న విజయసాగర్ కుడి కాలువలో స్నానం కోసం దిగి కాలు జారి నీటిలో పడి గల్లంతయ్యాడు. వినుకొండ మండలం కొండ్రముట్లకు చెందిన విజయసాగర్ కొంతకాలంగా మాచర్లలో ఉంటూ టీస్టాల్ నడుపుతున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# మాజీ ఎమ్మెల్యే పీఆర్కేను కలిసిన కారంపూడి వైకాపా నాయకులు

**కారంపూడి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కారంపూడి వైకాపా నాయకులు బుధవారం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ము చంద్రశేఖర్, వైకాపా బీసీ విభాగం నాయకులు గుండెబోయిన శివ, బొంకూరి నాగేశ్వరరావు, కిల్లా కాశీ, ఎస్టీ సెల్ నాయకులు జాన్‌పాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలను చేర్పించాలి

**వినుకొండ,ఫిబ్రవరి5,ప్రభాతవార్త:** పురపాలక సంఘం బి సెక్టార్ పరిధిలో గల శ్రీనివాసనగర్ అంగన్‌వాడీ సెంటర్ నందు ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ ఎడ్యుకేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సూపర్‌వైజర్ శ్రీలత అధ్యక్షత వహించి మాట్లాడారు. 5ఏళ్ళలోపు పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ సెంటర్లకు పంపించాలని చెప్పారు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.



# బీజేపీ పట్టణాధ్యక్షులుగా కోట వెంకట సుధాకర్ నియామకం

**వినుకొండ, ఫిబ్రవరి5, ప్రభాతవార్త:** బీజేపీ వినుకొండ పట్టణ అధ్యక్షులుగా కోట వెంకట సుధాకర్ నియమితులయ్యారు. నర్సరావుపేట నందు జరిగిన బీజేపీ సమావేశం నందు ఈ మేరకు జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్ ప్రకటించారు. సమావేశంలో వినుకొండ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి యార్లగడ్డ లెనిన్‌తోపాటు పట్టణ నాయకులు పాల్గొని అభినందనలు తెలిపారు. బీజేపీ బలోపేతానికి అన్ని విధాలుగా కృషి చేస్తామని కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# మద్యం దుకాణంకు దరఖాస్తు ఆహ్వానం



**ఈపూరు,ఫిబ్రవరి5,ప్రభాతవార్త:** ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో గౌడ క్రింద 1 మద్యం దుకాణంకు అర్హులైన వారు ఈ నెల 10తేదిలోగా ఆన్‌లైన్ నందు దరఖాస్తు చేసుకోవాలని ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ ఇంచార్జి ఇన్స్‌పెక్టర్ కె. శ్రీనివాసులు తెలిపారు. పూర్తి వివరాలను స్టేషన్‌లో సంప్రదించిగానీ అన్‌లైన్ ద్వారాగానీ తెలుసుకోవచ్చు అని పేర్కొన్నారు.

# 36వ రోడ్డు జాతీయ వారోత్సవాలపై అవగాహన సదస్సు

**అమరావతి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో 36వ రోడ్డు జాతీయ వారోత్సవాలపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఆర్టీవో రాంబాబు పాల్గొని మాట్లాడుతూ యువతకు వాహనాలు నడిపే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అతివేగం ప్రమాదకరమని,



లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదని సూచించారు. అలాగే వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ఈ కార ్యక్రమంలో సి.ఐ. అచ్చయ్య, పోలీస్ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

# సుబ్బారావు మృతి పార్టీకి తీరనిలోటు

## -వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదల

**పొన్నూరు, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** మండల పరిధిలోని మునిపల్లె గ్రామానికి



చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త తమనం సుబ్బారావు మృతి చెందారు. విషయం తెలుసుకొన్న టిడిపి నాయకులు గ్రామానికి వెళ్ళి తమనం సుబ్బారావు మృత దేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి మంచి కార్యకర్తను కోల్పోయిందన్నారు. పార్టీ అభివృద్ధికి తమనం చేసిన సేవలు మరువలేనివన్నారు. మాదల వెంట జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు బండ్లమూడి బాబూరావు, తదితరులున్నారు.

# రైతు సేవ కేంద్రం ఎంతో ప్రయోజనకరం

**పొన్నూరు, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెల్లలూరు, బ్రాహ్మణకోడూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని



నిర్వహించారు. వెల్లలూరులోని రైతు సేవా కేంద్రంలో తమిళనాడు నుంచి వచ్చిన వ్యవసాయాధికారులు వాటిన పనితీరును పరిశీలించారు. రైతు సేవ కేంద్రంలో జరుగుతున్న వివిధ రకాల సేవలను వారికి వివరించారు. మట్టి నమూనాల సేకరణ, రాయితీపై విత్తనాల పంపిణీ, పచ్చిరొట్టవిత్తనాలు, ఎరువులు, విత్తనాల పంపిణీ, పంట నమోదు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటి వాటిని తమిళనాడు వచ్చిన అధికారుల బృందానికి రాష్ట్ర కమిషనరేట్ కార్యాలయం వచ్చిన అధికారులు, స్థానిక అధికారులు వివరించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం యొక్క ఉపయోగం, క్షేత్రస్థాయిలో రైతులకు అధికారులు వివరిస్తున్న విషయాలు, రైతులు అధికారుల నుంచి ఎలాంటి సమాచారాన్ని సేకరిస్తున్నారు. తద్వారా వారు పొందుతున్న లబ్ది తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రాష్ట్రంలో వ్యవసాయశాఖ రైతులకోసం నిర్వహిస్తున్న వివిధ రకాల యాప్‌లు తదితరాలను కూడా అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ కమిషనరేట్ డిడిఎ డి.వెంకటేశ్వర్లు,ఎడిఎ బిఎస్ శ్రీనివాసాచార్యులు, స్థానిక ఎడిఎ వి.రామకోటేశ్వరి, వ్యవసాయాధికారి దేగల వెంకట్రామయ్య, డిడిఎ డిఎస్ బాలసుందరి, ఎడిఎ ఆర్ రామని, గోకుల కన్నన్ తదితరులున్నారు.

# నిరుద్యోగులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

## -డాక్టర్ కత్తి పద్మారావు



పొన్నూరు, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: నిరుద్యోగులు ప్రభుత్వ కొలువుల కోసమే ఎదురు చూడకుండా ఉపాధి అవకాశాలను కూడా సద్వినియోగం చేసుకోవాలని మహాకవి, అభినవ అంబేద్కర్ డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. స్థానిక శాంతినగర్‌లో మాధవ్ అనే వ్యక్తి ఏర్పాటు చేసుకొన్న మెడికల్ షాపును ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కత్తి పద్మారావు మాట్లాడుతూ నాణ్యమైన మందులను విక్రయించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. మందుల వ్యాపారం చేస్తున్నప్పటికీ కొంత సేవా భావాన్ని కూడా అలవరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాధవ్ కత్తి పద్మారావుకు కృతజ ్ఞతలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పొందుగల జయరాజు, అక్కిదాసు జాషువా తదితరులున్నారు.

## ఘనంగా పల్నాటి గాంధీ నాళం మట్టపల్లి వర్ధంతి వేడుకలు

**రెంటచింతల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** పల్నాటి గాంధీగా పేరొందిన నాళం మట్టపల్లి 64వ వర్ధంతి వేడుకలను మండల కేంద్రమైన రెంటచింతలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయం సెంటర్లోని మట్టపల్లి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ గాంధీజీ ప్రబోధాలకు అనుగుణంగా సంఘ సంస్కరణ కార్యక్రమాలు చేపట్టి స్వాతంత్ర్య కాలంలో పల్నాట జరిగిన పలు ఉద్యమాల్లో పాల్గొన్న సమరయోధుడు మట్టపల్లి అని అన్నారు. కందుకూరి వీరేశలింగం స్ఫూర్తితో సంఘాన్ని సంస్కరించే బాటలో తన



కుమార్తె వితంతు వివాహాన్ని జరిపించి ఆచరించిన సంఘ సంస్కర్తగా మట్టపల్లి ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈ సందర్భంగా సీనియర్ తెదేపా నేతలు గొంటు ఆదిరెడ్డిచే ఆరుగురు పేద విద్యార్థులకు రూ.4 వేలు చొప్పున, పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ఏచూరి వెంకట సైదయ్య, ఎస్.మోహన్, రమావత్ బిక్షాలు, కట్టమూరి నాగేశ్వరరావు, గుండా రామ్మూర్తి, ఆకుల నరసింహారావు, నారాయణపురం శ్రీనివాసరావు, గాదె మర్రెడ్డి, బ్రహ్మం నిర్వాహకులు నాళం నరసింహారావు, పెదబాబు, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

## కొండవీడు మేజర్‌లో ప్రారంభమైన పనులు


**యడ్లపాడు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** కొండవీడు మేజర్ కాల్వ చివరి అయకట్టు భూములవరకు



నీటిని అందించటానికి మేజర్ మరమత్తులు నిర్వహించుతున్నామని మేజర్ జెఈ నందిని తెలిపారు. అమె వివరిస్తూ గత కొంత కాలంగా మరమత్తులు లేకపోవటంతో కాల్వ కట్టలపై, లోపలి భాగంలో నాచు, కంపచెట్లు దట్టంగా పెరిగాయని, దీంతో అయకట్టు చివరిలో ఉన్న యడ్లపాడు, వంకాయలపాడు, ఉప్పరపాలెం, లింగారావుపాలెం గ్రామాల పంటచేలను సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. రైతులు పంటలను కాపాడుకోవటానికి వ్యవప్రయాసలు కోర్చి వాగులు, చెరువులలోని నీటిని అయిల్ ఇంజన్ల ద్వారా పంటచేలకు పెట్టుకున్నారు. కాల్వ మొదలైన ఫిరంగిపురం మండలం వేములూరిపాడు నుంచి యడ్లపాడు వరకు 11కిలో మీటర్ల మేర పనులు నిర్వహించటానికి అమోదం లభించిందని, ఇందులో భాగంగా పూడిక తీత, ఇరువైపులా కట్టలపై ఉన్న కంపచెట్లను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు చెంఘీస్కాన్‌పేట వరకు పనులు పూర్తిచేయటం జరిగిందని, వీటికి సంబంధించిన నిధులు డిజస్టర్ మేనేజ్‌మెంట్ ద్వారా పది లక్షల రూపాయలు ప్రభుత్వం విడుదలకు అమోదించిందని తెలిపారు.

## శ్రీనివాస కళ్యాణం కార్యక్రమానికి ప్రత్తిపాటిని ఆహ్వానించిన ఆర్యవైశ్య సంఘనాయకులు

**చిలకలూరిపేట, ఫిబ్రవరి5, ప్రభాతవార్త:** పట్టణంలోని అర్యవైశ్య కళ్యాణ మండపంలో వేంచేసి ఉన్న పద్మావతి గోదా సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 8వ తేదిన జరగనున్న దేవాలయ వార్షికోత్సవం, శ్రీనివాస కళ్యాణంలో పాల్గొనమని మాజీమంత్రి, నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును కమిటి సభ్యులు ఆహ్వానించారు. బుధవారం ప్రత్తిపాటి నివాసంలో కలిసి



ఆహ్వానపత్రికను ప్రత్తిపాటికి అందించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణమండపం అధ్యక్షులు అర్వపల్లి సురేష్‌కుమార్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్యక్షుడిగా ఎన్నికైన కొత్తమాసు శ్రీనివాసరావు, ఆలపాటి కాలేషా, చిలకలరామ లింగేశ్వరరావు, కొత్త కోటేశ్వరరావు, అమరా మణకుమార్ తదితరులు పాల్గొన్నారు.


## చిగురుపాటి రామయ్య చౌదరి చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట రూరల్, ఫిబ్రవరి5, ప్రభాతవార్త:** మండలంలోని మురికిపూడి గ్రామానికి చెందిన చిగురుపాటి రామయ్య చౌదరి ఇటీవల మరణించారు. బుధవారం ఆయన పెద్దకర్మ కార్యక్రమానికి హజరైన మాజీ మంత్రి నియెజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు రామయ్యచౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జవ్వాజి మదన్‌మోహన్, కందిమళ్ళ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు నివేశన స్థలాలపై ప్రకటన కాదు, కార్యాచరణ ప్రకటించాలి : సిపిఐ డిమాండ్

**చిలకలూరిపేట, ఫిబ్రవరి5, ప్రభాతవార్త:** పేదలకు నివేశన స్థలాలపై ప్రభుత్వం ప్రకటన కాకుండా కార్యచరణ ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి




ఎ మారుతి వరప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు బుధవారం ఆర్హులైన పేదలందరికి నివేశన స్థలాలు అందచేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో వందలాదిమంది ప్రజలతో ఆర్జిలను అందచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలకు ఇచ్చిన హామీమేరకు పట్టణంలో 2సెంట్లు, గ్రామాలలో 3 సెంట్లు స్థలాలు ఇవ్వాలని అందుకు సంబందించి కార్యాచరణ వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే అంశంపై ఈనెల 10తేదిన నరసరావుపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కూడా ఆ అర్జిలు అందచేత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఏరియా ఇన్‌చార్జి తాళ్లూరి బాబూరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, ఏఐటియుసి ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, సిపిఐ నాయకులు చౌటుపల్లి నాగేశ్వరరావు, కందిమళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రూటు మార్చిన దొంగలు

**తాడేపల్లి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** ఉల్లిచేసిన మేలు తల్లిచేయదు అంటారు పెద్దలు..అలాంటి రైతు పండించిన పంట దొంగల పాలు.. రైతులు కన్నీటి పాలు.తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో కృష్ణారెడ్డి అనే రైతు పండించిన పంటను దొంగలు దోచుకెళ్ళారు.రాజధాని పంటపొలాల్లో ఉల్లిపాయ బస్తాలు దొంగిలించిన దొంగలు.ఆరుగాలం పాటు కష్టపడి పంట పండించిన రైతు పంటను రాత్రి బస్తాల్లో నింపి ఉదయాన్నే మార్కెట్‌కు తరలించే సమయానికి ..50కిలోల ఉల్లిపాయ బస్తాలు 19టిక్కిలు గుట్టు చప్పుడు కాకుండా రాత్రి ఆటోలో తరలించుకు పోయారు.బాధిత రైతు కృష్ణారెడ్డి ఫిర్యాదుమేరకు తాడేపల్లి పోలీస్టేషన్‌లో కేసు నమోదు చేశారు.రాజధాని ప్రాంత పంట పొలాల్లో రాత్రిళ్ళు గంజాయి బ్యాచ్ తిరగటం పొలాల్లో మందు తాగటం పంటను దోచుకుపోతున్నారు.గంజాయి మధ్యం బ్యాచ్ దెబ్బకు రైతులు రాత్రుళ్ళు పొలాల్లో కాపాలా ఉండేందుకు భయపడుతున్నారు..గతంలో పొలాల్లో మోటార్లు దోచుకొని పోయారు.అప్పుడప్పుడు ఒకటి అర బస్తాలు పంటుతీసుకుపోయేవారని ఇప్పుడు ఏకంగా ఆటోల్లో తరలించుకు పోతున్నారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

## ప్రాంగణ ఎంపికల్లో 23మంది ఆర్‌విఆర్‌జేసి కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

**గుంటూరు విద్య, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** రినెక్స్ టెక్నాలజీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాల్లోని 23మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ద్వారా రూ.25వేల స్టైఫండ్‌తో పాటు,ప్రతిభ ఆధారంగా రూ.10లక్షల వరుకు ప్యాకేజీతో కూడిన ఉద్యోగాలు అందుకోవడం ఆనందదాయకమని ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్,డాక్టర్ జగదీష్ కె.మద్దినేని తమ హర్షం వ్యక్తంచేశారు.కళాశాల్లోని వివిధ విభాగాల



నుండి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను బుధవారం కళాశాల సిబ్బంది అభినందించారు.ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్,కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర,కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టన్ ఎన్.వి.శ్రీనివాసరావు,వివిధ శాఖల విభాగాధిపతులు,కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ సిహెచ్ శ్రీనివాసరావు,డాక్టర్ కె.సురేష్ బాబు,తదితరులు అభినందించారు.

## క్యాన్సర్ ఉద్ధృతిని పెంచుతున్న అస్తవ్యస్త జీవనశైలి

**గుంటూరు కల్చరల్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** క్యాన్సర్‌కు అత్యాధునికమైన కొత్త చికిత్సలు అందుబాటులోకి వస్తున్న వాటిని తలదన్నే రూపాల్లో క్యాన్సర్ విజృంభిస్తూ ఉండటం ఆందోళనకరమని ఈ వ్యాధి వల్ల తగిన అవగాహనతో అప్రమత్తంగా మెలగాలని సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ అన్నారు.సభలో సీనియర్ వైద్యులు మానసిక వైద్యనిపుణులు డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ఎన్నడో ఎవరో కాన్సర్ బారిన పడ్డారని వినే రోజులు ఉండేవని ఇప్పుడు ఈ వ్యాధి అందరికి సుపరిచితమై పోయిందని,మనచుట్టూ ప్రక్కలా చాలామంది క్యాన్సర్ వ్యాధి కి గురవడం చూస్తున్నామన్నారు.కార్యక్రమంలో ఏవి రామారావు, సాయిరామ్,రాజన్న మాస్టారు తదితరులు ప్రసంగించారు.

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు

**నరసరావుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలను బుధవారం ఏపి డైరెక్టరాఫ్ సెకండరీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సిరి నిర్వహించారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, వార్డులను



పరిశీలించారు. వైద్యులు, నర్సులు, సిబ్బంది తమ డ్యూటీలకు సమయానికి వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఆసుపత్రిలోని బాత్‌రూములను పరిశీలించారు. మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నర్సులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండటం లేదని రోగులు ఫిర్యాదు చేశారు. పిడియాట్రిక్ రోగులకు సరైన వసతులు లేకపోవడంపై డాక్టర్ సిరి స్పందించి పాత ఆసుపత్రి నుండి జిల్లా ఆసుపత్రికి వారిని తరలించాలని సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావుకు ఆదేశాలిచ్చారు. ఓపిల కౌంటర్స్ తగినంత లేకపోవడంతో ఎక్కువ సమయం వారు నిరీక్షించాల్సి వస్తుందని, కౌంటర్ల సంఖ్యను పెంచాలన్నారు. కే షీట్ రాసేటప్పుడు అలసత్వం వహిస్తున్నారని రోగులు ఫిర్యాదు చేశారు. గర్భిణీ స్త్రీలకు డాక్టర్లు అందుబాటులో లేకుండా వీడియో కాల్ ద్వారా స్టాఫ్ నర్సులే వైద్యం చేస్తున్నారని డాక్టర్ సిరి దృష్టికి రోగులు తీసుకెళ్లారు. సదరన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌పై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. రీ వెరిఫికేషన్‌లో లోపాలు జరిగితే కఠినచర్యలు తీసుకుంటామని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సిరి హెచ్చరించారు.

## ప్రతి గ్రామంపై నిఘా ఉంచాం : ఎస్పై సమందర్‌వలి

### - 750 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

**వెల్దుర్తి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లంఊటను పోలీసులు గుర్తించి ధ్వంసం చేసిన ఘటన వెల్దుర్తి మండల పరిధిలో జరిగింది. ఎస్పై





సమందర్‌వలి కథనం ప్రకారం వెల్దుర్తి మండలం గుండ్లపాడులో నాటుసారా తయారీ చేస్తున్నారనే సమాచారం రావడంతో తన సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. నాటుసారా బట్టీని గుర్తించి అక్కడ నిల్వ ఉంచిన 750 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్పై సమందర్‌వలి మాట్లాడుతూ... వెల్దుర్తి మండల పరిధిలోని పలు గ్రామాల్లో నాటుసారా తయారు చేస్తున్నారని పలు ఫిర్యాదు వస్తున్నాయన్నారు. ప్రతి గ్రామంపై నిఘా ఉంచినట్లు ఆయన చెప్పారు. నాటుసారా తాగడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తి, గతంలో చాలామంది చనిపోయారన్నారు. కుటుంబాలు చిన్నాభిన్న మవుతున్నాయన్నారు. గ్రామాల్లో నాటుసారా తయారు చేస్తున్నవారి సమాచారం తెలియజేస్తే దాడులు చేస్తామన్నారు. సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇక్కడ తయారు చేసిన నాటుసారా మాచర్లతోపాటు పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారని తెలిసిందన్నారు. తయారీదారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాటుసారా అమ్మినా, తయారు చేసినా, తరలించడం నేరమన్నారు. దాడుల్లో పట్టుబడితే జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న నాయకుడుని పరామర్శించిన ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** అనారోగ్యంతో ఉన్న కూటమి నాయకులు సంగంశెట్టి శ్రీనివాసరావును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ 24వ వార్డు బాలయ్యనగర్‌లో శ్రీనివాసరావు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని గుర్తు చేశారు. జనసేన, తెలుగుదేశం నాయకుల సహకారంతో వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు



ముందుంటామని ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు తెలియజేశారు. శ్రీనివాసరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు గుప్తా శ్రీకాంత్, అద్దేపల్లి ఆనంద్, మిరియాల వెంకట సుబ్బమ్మ, కిషోర్, కృష్ణంశెట్టి గోవిందరావు, శ్రావణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## కాలువలో గల్లంతైన డ్రైవర్ కోసం గాలింపు

నకరికల్లు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : మండలంలోని సాగర్ కాలువలో గల్లంతైన డ్రైవర్ కోసం అగ్నిమాపక, పోలీస్‌శాఖ సిబ్బంది బుధవారం గాలింపు చర్యలు చేపట్టారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన 40 సంవత్సరాల వయస్సు ఉన్న బసప్ప లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో మద్రాస్ నుండి బీదర్ వెళ్త మార్గమధ్యంలోని నకరికల్లు మండలం శ్రీరాంపురం వద్ద ఉన్న బెల్లంకొండ కెనాల్ వద్ద ఆగారు. అక్కడి కాలువలో బట్టులు ఉతుక్కునే



క్రమంలో కాలుజారి నీటిలో పడి కొట్టుకుపోయారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో అగ్నిమాపకశాఖ అధికారులతో కలిసి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## పెదరెడ్డిపాలెం, జొన్నలగడ్డ గ్రామాలలో పంటల పరిశీలన

నరసరావుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : మండలంలోని పెదరెడ్డిపాలెం, జొన్నలగడ్డ గ్రామాలలో పంటలను వ్యవసాయశాఖ డిడి ఎం.శివకుమారి, ఏడిఏ పి.మస్తానమ్మలు బుధవారం పరిశీలించారు. రైతులతో వారు మాట్లాడుతూ వరిపంటలో జింకు లోపం గమనించామన్నారు. దీని నివారణకు చలామిన్ జింక్‌ను పంటపై పిచికారి చేసుకోవాలన్నారు. మొక్కజొన్నలో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను సూచించారు. నత్రజని తగినంత మాత్రమే వాడాలన్నారు. శనగపంటను పరిశీలించి రైతులకు రక్షణ చర్యలను సూచించారు. పిఎం కిసాన్ పథకంలో ప్రతి ఒక్కరూ రిజిస్టర్ కావాలని అధికారులు సూచించారు.

## బిజేపి జిల్లా పదాధికారుల సమావేశం

గుంటూరు విద్య, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లాలో నూతనంగా ఎన్నిక కాబడిన మండలఅధ్యక్షులనితో జిల్లా పదాధి కారల సమావేశం జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు సభా అధ్యక్షతన జరిగిన సమావేశానికి బిజేపి రాష్ట్ర సంఘటన మంత్రి నూకల మధుకర్ జీ మాట్లాడుతూ



నూతన మండలాధ్యక్షులను ఉద్దేశించి ప్రతి ఒక్కరూ అంతో హృదయ సిద్ధాంతం మరియు సమర్పణ భావంతో పనిచేయాలని అలాగే పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలంటే బూత్ కమిటీలతో పాటు మండల కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.భారతీయ జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ స్థాపిస్తే,దీన్ దయాళ్ ఉపాధ్యాయ పార్టీ సిద్ధాంతాన్ని రచించడం జరిగిందన్నారు.డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఏ కలలు అయితే కన్నారో ఆ కలలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆర్టికల్ 370ని ఎత్తివేసి నిరూపించారని అలాగే దీన్ దయాల్ ఉపాధ్యాయ అంత్యోదయ,ఏకాతామ మానసవాదాన్ని రూపొం దించి అట్టడుగు ఉన్న పేద వర్గాలకు కూడా ప్రభుత్వ పథకాలు లబ్ధి చేకూరేలా పార్టీ సిద్ధాంతాన్ని రాశారని అది ప్రజలకు లబ్ధి చేకూరేలాగా ప్రధానమంత్రి నిరంతరం పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడు తున్నారన్నారు.నూతన మండల అధ్యక్షులుగా బాధ్యత తీసుకున్న ప్రతిఒక్కరూ భారతీయ జనతా పార్టీ గొప్పతనాన్ని ప్రధానమంత్రి గా నరేంద్రమోడీ 10ఏళ్ళ కాలంలో ఈ దేశానికి తీసుకొచ్చిన గొప్ప గొప్ప పనులను చేశారని అవి ప్రజలందరికి తెలిపేలాగా మనమందరం ఇంటింటికి వెళ్ళి భారతదేశాన్ని ప్రధాని నరేంద్రమోడీ ముందు తర్వాత ఈ దేశం ఏ విధంగా అభివృద్ధి చెస్తున్నారనే విషయం తెలియజేయాలన్నారు.కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ తమనంపూడి రామకృష్ణారెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ,రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ,రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జ్ మకుటం శివ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూపూడి రంగరాజు,ఈదర శ్రీనివాస్‌రెడ్డి, యడ్లపాట స్వరూపరాణి,జిల్లా సంయోజక్ భీమినేని చంద్రశేఖర్,రాష్ట్ర పదాధికారులు గాజుల వెంకయ్యనాయుడు,కొక్కెర శ్రీనివాస్ యాదవ్, టూబాకో ఛైర్మన్ సిహెచ్ యశ్వంత్,జిల్లా ప్రధాన కార్యదర్శులు చరకకుమార్ గౌడ్, వై.వి.సుబ్బారావు, ఉమా మహేశ్వరరావు,రాష్ట్ర సెల్ కన్వీనర్స్ కో-కన్వీనర్స్,మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు,అసెంబ్లీ కన్వీనర్స్,జిల్లా పదాధి కారులు,మండల అధ్యక్షులు,పాల్గొన్నారు.

## 91వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవం

గుంటూరు కల చ్రరల్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : స్థానిక బ్రాడీపేటలోని ఓంకార క్షేత్రంలో కుర్తాళం శ్రీసిద్ధేశ్వర పీఠ పాలిత ఓంకారక్షేత్రంలో కార్యదర్శి నంబూరు వెంకట శ్రీమన్నారాయణమూర్తి,సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 91వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవం 95వ సంఘ వారి కోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం నగర సంకీర్తన,నిత్యపూజలు నిర్వహించారు.



స్వామివార్ల కళ్యాణాల్లో భాగంగా శ్రీరుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి వారి కళా ్యణం ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు.కళ్యాణం,విశేషహారతి,మంత్రపుష్పం అనంతరం,అధికసంఖ్యలో పాల్గొన భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.భక్తి సంగీతం లో భాగంగా మాధవపెద్ది మాధవీకృష్ణ,కామరాజు మృణాళిని గాత్ర యుగళం జరిగింది.మంచికంటి వెంకట సత్యవతి నిర్వహిస్తున్న శ్రీమద్రామయణ ప్రవచనంలో అనేక ఘట్టాలను వివరించారు.ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ గురువారం శ్రీసీతారాముల కళ్యాణం ఉదయం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి : బాపట్ల కలెక్టరు

**బావట్ల, ఫిబ్రవరి05, ప్రభాతవార్త:** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించ డానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణం లోని సమావేశం హాల్ లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యల గురించి నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా బాపట్లలో ఎమ్మెల్సీ ఎన్నికలు 12 మండలాల్లో జరుగుతాయని ఆయన చెప్పారు. ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. బాపట్ల జిల్లాకు సంబంధించి 12 మండలాల్లో ఫిబ్రవరి 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయని అని చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బాపట్ల పరిధిలోని 12 మండలాల్లో మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు లోఉంటుందని ఆయన తెలియజేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పగడ్బందీగా అమలు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కేటాయించిన నోడల్ ఆఫీసర్లు వారికి అప్పజెప్పిన బాధ్యతలను పారదర్శకంగా అమలు చేయాలని ఆయన చెప్పారు. బాపట్ల జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే 12 మండలా లలో 28 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు 24వేల 440 మంది గ్రాడ్యుయేట్స్ ఓటు




హక్కును వినియో గించుకోనున్నారని ఆయన చెప్పారు. వీరిలో పురుషులు 15వేల 292 మంది, మహిళలు 9వేల150 మంది థర్డ్ జెండర్ ఐదుగురు ఉన్నారని ఆయన తెలియజేశారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా మౌలిక సౌకర్యాలు కల్పించాలని రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి.జి గంగాధర్ గౌడ్, జిల్లా అదనపు ఎస్.పి విటలేశ్వర్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మజ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వై. వెంకటేశ్వరరావు, బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, రేపల్లె రెవిన్యూ డివిజన్ అధికారి రామలక్ష్మి పాల్గొన్నారు.

## విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రెండు రోజుల ఉచిత వక్త శిక్షణా తరగతులు

**నాదెండ్ల, ఫిబ్రవరి5, ప్రభాతవార్త:** విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్(స్టెప్) మరియు యంఎయం కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులు ఉచిత వక్త శిక్షణా తరగతులను నరసరావుపేట రహదారిలో ఉన్న




కేసానుపల్లి వద్ద నున్న యంఎయం కళాశాలలో ఈనెల 8,9 తేదిలలో నిర్వహిస్తున్నట్లు స్టెప్ సభ్యులు ఈదర వెంకట గిరీష్‌బాబు, డాక్టర్ మానం శ్రీనివాసరావు, గల్లా సాంబశివరావు, అడపారవిలు బుధవారం తెలిపారు. వీటికి సంబందించిన గోడ పత్రికను వారు ఆవిష్కరించారు. ఈశిక్షణా తరగతులలో ముఖ్య అతిధిగా ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, మహిళా సైకాలజిస్ట్‌ల బృందంచే జీవన నైపుణ్యాలు మరియు ఉపన్యాస కళలో నిష్టాతులయ్యే విధంగా శిక్షణ నివ్వడం జరుగుతుందన్నారు. ఈ తరగతులలో హజరయ్యే డిగ్రి, ఫార్మసి, ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఇతర విద్యార్థినిలు, మహిళా ఉపాధ్యాయునీలకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని వారు వివరించారు. ఆసక్తి కలిగిన వారు డాక్టర్ మానం శ్రీనివాసరావు ప్రిన్సిపల్ సిఆర్ కళాశాల, సెల్ నెంబర్ 9030616331, యంఎయం ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ రామారావు సెల్ నెంబర్ 9704266214లను సంప్రదించవలసినదిగా వారు కోరారు.

## రాజుపాలెం మండల పరిషత్ సాధారణ సమావేశం

**రాజుపాలెం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** రాజుపాలెం మండల సాధారణ ప్రజా పరిషత్ సాధారణ సమావేశాన్ని ఈ నెల 6వతేదీ మధ్యాహ్నం కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ జి.వి.సత్యనారాయణ బుధవారం తెలియజేశారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కోఆప్షన్‌మెంబర్స్, మండలస్థాయిలోని వివిధశాఖల అధికారులు హాజరు కావాలన్నారు. సకాలంలో సమావేశానికి పూర్తి నివేదికలతో అధికారులు కావాల్సిన అవసరం ఉందని ఎంపిడిఓ జి.వి.సత్యనారాయణ సూచించారు.

## కూటమి అభ్యర్థిని గెలిపించండి : ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలని శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. ముప్పాళ్ళ మండలం, సత్తెనపల్లి పట్టణానికి చెందిన గ్రాడ్యుయేట్స్‌తో ఆత్మీయ సమావేశాన్ని బుధవారం పట్టణంలోని రఘురాంనగర్‌లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నిర్వహించారు.



వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, జయప్రకాష్‌నారాయణ, వేములకొండ శ్రీనివాస్ సమావేశానికి హాజరైనట్లు తెలిపారు. గ్రాడ్యుయేట్స్ ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎనిమిది నెలల్లోనే అభివృద్ధి అంటే ఏమిటో చూపించామన్నారు. విద్యా వ్యవస్థలను గత ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. రాష్ట్రాన్ని గంజాయి వనంగా మార్చారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలు దహనం

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను మండలంలోని రెంటపాళ్ళ గ్రామంలో బుధవారం కౌలు రైతు సంఘం నాయకులు దగ్ధం చేశారు. నాయకులు పెండ్యాల మహేష్ మాట్లాడుతూ పేదలకు, రైతులకు, కార్మికులకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ బడ్జెట్‌ను




అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలన్నారు. బడా కార్పోరేట్‌లకు రాయితీలను తగ్గించాలన్నారు. బడ్జెట్‌ను కేంద్రం వ్యాపారులకు అనుకూలంగా మార్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.నరసింహారావు, భగత్, దుగ్గి మీరమ్మ, బి.రామారావు, అమూల్య, నాగేశ్వరరావు, అనూష, మల్లేశ్వరి, అనీల్, రవి, పెద్దబ్బాయి పాల్గొన్నారు.

## రిజర్వు మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** గౌడ కులానికి రిజర్వు చేసిన మద్యం షాపుల కేటాయింపులకు సంబంధించిన దరఖాస్తులు సమర్పించే గడువును పెంచినట్లు ఎక్సైజ్ సి.ఐ. పి.విజయ్‌కుమార్ బుధవారం తెలియజేశారు. దరఖాస్తు చేసుకోవడానికి 8వతేదీ సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉందన్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో 10వతేదీన లాటరీ తీయడం జరుగుతుందని ఎక్సైజ్ సి.ఐ. విజయ్‌కుమార్ తెలియజేశారు.

# నా కెరీర్‌లో బిగ్గెస్ట్ మూవీ 'తండేల్'

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషన్స్ కంటెంట్ హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేసింది. ఈ సందర్భంగా హీరో అక్కినేని నాగచైతన్య విలేకరుల సమావేశంలో 'తండేల్' విశేషాలు పంచుకున్నారు.




**'తండేల్' సినిమాపై ఆడియన్స్ లో చాలా అంచనాలు వున్నాయి. మీలో ఎలాంటి ఎక్సయిట్మెంట్ వుంది?** నా కెరీర్‌లో బిగ్గెస్ట్ ప్రొడక్షన్, హై బడ్జెట్ మూవీ. క్యారెక్టర్, స్టోరీ అన్ని రకాలుగా బిగ్ స్పాన్ వున్న సినిమా ఇది. చాలా ఎక్సయిట్మెంట్ వుంది. ఆల్రెడీ సినిమా చూశాం. చాలా కాన్ఫిడెంట్‌గా వున్నాం. సెకండ్ హాఫ్ అయితే యునాని మాస్‌గా చాలా బాగా చెప్పారు. నాకు కూడా ఎమోషనల్ హై ఇచ్చింది. చివరి ముప్ఫై నిమిషాలు వెరీ సాటిస్ఫాక్షన్. క్లైమాక్స్ గ్రేట్ ఎమోషనల్ హై ఇస్తుంది.

**'తండేల్' కథ ఎలా వచ్చింది?**
దూత సమయంలో ఈ కథ విన్నాను. వాసు గీత ఆర్ట్స్‌లో ఈ కథని హోల్డ్ చేశారని తెలిసింది. డెవలప్ చేసి మంచి షేప్ వస్తే చెప్పమన్నాను. నేను మొదట విన్నప్పుడు ఒక డాక్యుమెంటరీలా వుంది. సినిమాటిక్ లాంగ్వేజ్‌లోకి తీసుకు రావడానికి వర్క్ చేయాలి. అలా వర్క్ చేసిన తర్వాత అద్భుతంగా వచ్చింది.

**శ్రీకాకుళం వెళ్లి అక్కడి వారిని కలవడం ఎలా అనిపించింది?**
ఈ కథ మొదట ఓ ఐడియాగా చెప్పారు. పాత్రకు తగ్గట్టుగా మారాలంటే వాళ్ళ లైఫ్ స్టయిల్ తెలుసుకోవాలి. అలా తెలుసుకోవడానికి వాళ్ళని నేరుగా కలవాలని వెళ్లాం. మొత్తం హోం వర్క్ చేశాక నేను చేయగలనని కన్విన్స్ అయిన తర్వాత జర్నీ మొదలైయింది.

**మీరు ఈ సినిమాకి ప్రాణం పెట్టి వర్క్ చేశారని బన్నీ వాసు చెప్పారు. యాక్టర్ గా నెక్స్ట్ లెవల్ కి వెళ్తారని అంటున్నారు?**
ప్రతి సినిమాతో ఇంకా బెటర్ అవ్వాలని ప్రతి యాక్టర్‌కి వుంటుంది. అయితే ఈ కథ రియల్ లైఫ్ క్యారెక్టర్ దొరికింది కాబట్టి ఇంకా మోటివేట్ అయ్యాను. యాక్టర్‌గా నెక్స్ట్ స్టెప్ వెళ్ళే అవకాశం ఈ సినిమాలో కనిపించింది. దాదాపు ఎనిమిది నెలలు స్క్రిప్ట్, నా ట్రాన్స్ ఫర్మేషన్ మీదే వున్నాను. శ్రీకాకుళం యాస గురించి ట్యూషన్ తీసుకున్నాను. యాస రియల్లీ ఛాలెంజింగ్‌గా అనిపించింది.

**రాజు పాత్రని ఎంచుకోవడానికి కారణం?**
నాకు ఎప్పటి నుంచో రియల్ లైఫ్ స్టొరీస్ ఆధారంగా సినిమా చేయాలని వుండేది. పైగా ఇది మన తెలుగోళ్ళ కథ. ఇది నాకు స్ఫూర్తిని ఇచ్చింది. రూటెడ్‌గా వుండే కథలు చేయడానికి ఇష్టపడతాను.

**డైరెక్టర్ చందూ గురించి?**
చందుతో నాకు ఇది మూడో సినిమా. తనతో ట్రావెల్ అవ్వడం ఇష్టం. నన్ను కొత్తగా ప్రజెంట్ చేయడానికి ప్రయత్నిస్తాడు. నా కోసమే ఆలోచిస్తుంటాడు. ఈ సినిమా కమర్షియల్‌గా తీసుకు రావడానికి చాలా కష్టపడ్డాడు.

## డేల్' సాంగ్స్‌కి భారీ రెస్పాన్స్

యువ సామ్రాట్

అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదలకానుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషన్స్ కంటెంట్ హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేసింది. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ అందించిన పాటలు చార్ట్ బస్టర్ హిట్స్‌గా టాప్ ట్రెండింగ్‌లో వున్నాయి. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ విలేకరుల సమావేశంలో 'తండేల్' విశేషాలు పంచుకున్నారు.

**'తండేల్' పాటలన్నీ చాలా పెద్ద హిట్స్ అయ్యాయి.. పాటలకి వస్తున్న రెస్పాన్స్ చూస్తే ఎలా అనిపిస్తోంది?** చాలా హ్యాపీ అండి. చాలా రోజుల తర్వాత వస్తున్న లవ్ స్టొరీ. బుజ్జితల్లి రిలీజైన వెంటనే ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. సుకుమార్ పాట విని నీ ఆల్ టైం టాప్ ఫైవ్ లో ఉంటుదని చెప్పారు. అలాగే శివుని పాట, హైలెస్సో పాటలు గొప్పగా జనాల్లోకి వెళ్ళాయి. ఆడియన్స్ సాంగ్స్‌ని చాలా ఎంజాయ్ చేస్తున్నారు.

**లవ్ స్టోరీ అనగానే మీపేరే వినిపిస్తుంటుంది? ఎలా అనిపిస్తుంది?**
బిగినింగ్ లో చేసిన నువ్వు వస్తావంటే నేనొద్దంటానా?, వర్షం, ఆర్య, 100% లవ్ లాంటి లవ్ స్టొరీస్ తో పాటు శంకర్ దాదా, మాస్ లాంటి కమర్షియల్ సినిమాలుకు కూడా అంతే అద్భుతమైన రెస్పాన్స్ ఆడియన్స్ నుంచి వచ్చింది. ఎలాంటి సినిమా అయినా చేయగలననే పేరు రావడం, అందులో లవ్ స్టొరీస్‌కి నేనైతే బావుంటనని అందరూ భావించడం గాడ్ బ్లెస్సింగ్‌గా భావిస్తాను.

**సముద్రం బ్యాక్ డ్రాప్‌లో మీరు చేసిన ఉప్పెన పెద్ద హిట్. 'తండేల్'లో కూడా సముద్రం బ్యాక్ డ్రాప్ వుంది. కథ విషయంలో ఎలాంటి డిఫరెన్స్ వుంటుంది?** నాకు కంప్లీట్ రస్టిక్ ఫోక్ స్టొరీ వున్న సినిమా చేయాలనే వుండేది. ఆ కోరిక రంగస్థలంతో తీరింది. అందులో పాటలన్నీ జానపద మూలల్లో నుంచి చేసినట్లుగా వుంటుంది. మళ్ళీ అలాంటి ఫోక్ టచ్ వున్న సినిమా ఉప్పెన. అయితే అందులో కంపోజిషన్ కాస్త సూఫీ స్టయిల్, క్లాస్ మిక్స్ చేసినట్లుగా వుంటుంది. కథలు పరంగా రెండిటికి పొంతనలేదు. 'తండేల్' కూడా అంతే. ఇది ప్యూర్ లవ్ స్టోరీ. పాకిస్తాన్ సరిహద్దులలో చిక్కుకున్న మన మత్స్యకారుల కథ.

**ఈ సినిమాలో మిమ్మల్ని ఎట్రాక్ట్ చేసిన అంశాలు ఏమిటి?**
డైరెక్టర్ చందూ గ్రేట్ విజన్‌తో సినిమా తీశాడు. చాలా అద్భుతంగా ప్రజెంట్ చేశాడు. చైతు ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశారు. ఆయన ట్రాన్స్ఫర్మేషన్, పెర్ఫార్మెన్స్ చాలా సర్‌ప్రైజింగ్ గా వుంటుంది. ఎమోషన్స్ చాలా అద్భుతంగా పండించారు. కొత్త నాగచైతన్యని చూడబోతున్నారు. సాయి పల్లవి అద్భుతమైన నటి. ఇందులో కూడా సాయి పల్లవి పెర్ఫార్మెన్స్ ఎక్స్‌ట్రార్డినరీగా వుంటుంది. కళ్ళతో కూడా పెర్ఫార్మెన్స్ ఇచ్చారు, ఈ ఇద్దరి కెమిస్ట్రీ అదిరిపోయింది. సెకండ్ హాఫ్ లో వచ్చే ఓ సీక్వెన్స్ చాలా అద్భుతంగా వుంటుంది. అది బిగ్ స్క్రీన్‌పై చూడాల్సిందే.

**బుజ్జితల్లి పాట ఎలా పుట్టింది?**
కథ చెప్పినప్పుడే కొన్ని ట్యూన్స్ వచ్చేస్తాయి. బుజ్జితల్లి ట్యూన్ కూడా అలా వచ్చింది. హమ్ చేస్తూ పియోనో ప్లే చేశాను. ఆ వీడియో చందూ షూట్ చేసి పోస్ట్ చేశాడు. అప్పుడు వచ్చిన ట్యూన్ అది.

**మీది చాలా లాంగ్ కెరీర్ కదా.. ఈ జర్నీ ఎలా అనిపిస్తుంది?** ఇది బ్యూటీఫుల్ జర్నీ. చాలా యంగ్ ఏజ్‌లో కెరీర్ స్టార్ట్ చేశా. నేనే నా మ్యూజిక్ వింటూ పెరిగాను. (నవ్వుతూ). అన్ని జోనర్ సినిమాలు చేసే అవకాశం వచ్చింది. అన్ని ఏజ్ గ్రూప్స్‌కి నచ్చే మ్యూజిక్ ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నాను.




## జూనియర్ ఎన్టీఆర్ ప్రత్యేక ప్రకటన

తనపై అభిమానులు చూపిస్తున్న అపారమైన ప్రేమ, గౌరవానికి జూనియర్ ఎన్టీఆర్ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. తనను కలుసుకోవాలని ఎదురు చూస్తున్న అభిమానుల ఆసక్తిని అర్థం చేసుకుని, త్వరలో ఒక సజావుగా ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యక్తిగతంగా వారిని కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని అనుమతులు పొందుతూ, పోలీస్ డిపార్ట్‌మెంట్ మరియు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని శాంతి భద్రతల సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇంత పెద్ద సమావేశం నిర్వహించటానికి కొంత సమయం అవసరం అవుతుంది కాబట్టి, అభిమానులు ఓర్పుగా ఉండాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో, అభిమానులు తనను కలుసుకోవడానికి పాదయాత్ర వంటివి చేయరాదని జూనియర్ ఎన్టీఆర్ విజ్ఞప్తి చేస్తున్నారు. తన అభిమానుల ఆనందమే కాదు, వారి సంక్షేమం కూడా తనకు అత్యంత ప్రధానం అని ఆయన మరోసారి స్పష్టం చేస్తున్నారు.



## కోర్టు నన్ను నిర్దోషిగా తేల్చింది..

**నేనొక ఫిల్మ్ ఫైనాన్షియర్‌ని.** సినిమా అంటే పాషన్‌తో నిర్మాతగా మారాను. సినిమా నాకు తల్లి లాంటిది. మహాబలిపురంలో ఉన్న నా 10 ఎకరాల స్థలాన్ని ఒకరికి తెలియకుండా మరొకరికి.. ఇలా పలువురు వ్యక్తులకు అమ్మానని నాపై కేసు పెట్టారు. 14 ఏళ్ల పాటు న్యాయ పోరాటం చేశాను. అది తప్పుడు కేసని తేలింది. న్యాయస్థానం నన్ను నిర్దోషిగా తేల్చింది. తప్పుడు కేసులు కోర్టు ముందు నిలబడవు. నా న్యాయ పోరాటం గెలిచింది అన్నారు నిర్మాత శింగనమల రమేష్ బాబు. 'కొమరంపులి', 'ఖలేజా' లాంటి బిగ్ స్టార్ చిత్రాలని నిర్మించిన ఆయన ఓ కేసు నిమిత్తం 14 ఏళ్ల పాటు న్యాయపోరాటం చేశారు. ఈ కేసును విచారించిన కోర్టు ఇటీవల ఆయన్ని నిర్దోషిగా తేల్చి, కేసు కొట్టి వేసింది. ఈ క్రమంలోనే ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.




**రమేష్ బాబు మీపై కేసు పెట్టిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనుకుంటున్నారు?**
నాకు ఎలాంటి కక్ష సాధింపులు లేవు. ఏదైనా న్యాయ పరంగానే పోరాటం చేస్తా.

**భవిష్యత్‌లో సినిమాల్లో కొనసాగుతారా?** నేనొక ఫిల్మ్ ఫైనాన్షియర్‌ని. సినిమా అంటే పాషన్‌తో నిర్మాతగా మారాను. సినిమా నాకు తల్లి లాంటిది. భవిష్యత్తులోనూ ఇదే రంగంలో కొనసాగుతా. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిద్దరూ హీరోలుగా చేశారు. హిట్ అందుకున్నారు. ఇప్పుడు డైరెక్షన్ రైటింగ్ చేయాలని అనుకుంటున్నారు. నేను కూడా నిర్మాతగా చేస్తా. ఫైనాన్షియర్‌గా చేస్తాను.

**మీ మీద కేసు పెట్టింది ఎవరు? వాళ్లకు సినీ రంగంతో సంబంధం ఉందా?** నాపై కేసు పెట్టిన వాళ్లు ఇండస్ట్రీ చెందిన వారు కాదు.

**అగ్ర హీరోల చిత్రాలను నిర్మించి నష్టపోయారా?**
అప్పట్లో సినిమాలు ఆరు నెలలు, లేదా సంవత్సరంలోగా పూర్తయ్యేవి. కానీ నా దురదృష్టం కొద్ది నేను తెరకెక్కించిన కొన్ని పెద్ద హీరోల చిత్రాలు దాదాపు మూడేళ్ల సమయం చిత్రీకరణలోనే గడిచిపోయింది. అందుకు చాలా కారణాలు ఉన్నాయి. ఆ రెండు చిత్రాలకు రూ.100 కోట్ల వరకూ నష్టపోయా.


**అసలు మీపై పెట్టిన కేసు ఏమిటి?**
రూ.14 కోట్లు మోసం చేశానని నా మీద అభియోగం. మహాబలిపురంలో ఉన్న నా 10 ఎకరాల స్థలాన్ని ఒకరికి తెలియకుండా మరొకరికి.. ఇలా పలువురు వ్యక్తులకు అమ్మానని కేసు పెట్టారు. సుదీర్ఘంగా న్యాయ విచారణ జరిగింది. న్యాయస్థానం నన్ను నిర్దోషిగా తేల్చింది. ఇప్పటికీ ఆ ఆస్తులు నా పేరు మీదే ఉన్నాయి.

**మీ స్టోరీనే సినిమా కథలా వుంది.. సినిమా చేసే అవకాశం ఉందా?** వెబ్ సిరిస్ చేస్తే వెయ్యి ఎపిసోడ్ పెట్టొచ్చు. అయితే నా కథ ఎవరు చూస్తారు(నవ్వుతూ)

**ఫైనాన్స్ బిజినెస్ ఎంత లాభదాయకం ?** మేము సంపాదించింది ఫైనాన్స్ బిజినెస్ వలనే. నాన్న నుంచి అది నాకు వచ్చింది. ఐతే సినిమా మేకింగ్ అనేది ఎప్పటికీ ఓజూదమే. ఆ గ్యాంబ్లింగ్ వలనే నాకు రెండు సినిమాల్లో వంద కోట్లు పోయింది.

## 'డబ్ల్యూ/ఒ అనిర్వేష్' చిత్ర బృందానికి అభినందనలు

గజేంద్ర ప్రొడక్షన్స్ పతాకంపై మహేంద్ర గజేంద్ర సమర్పణలో గంగ సప్తశిఖర దర్శకత్వంలో వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మాతలుగా జబర్దస్త్ రాంప్రసాద్, జెమినీ సురేష్, కిరీటి, సాయి ప్రసన్న, సాయి కిరణ్, నజియా ఖాన్, అద్వైత చౌదరి తదితరులు నటించిన డబ్ల్యూ/ఒ అనిర్వేష్ చిత్రం యొక్క కొన్ని సన్నివేశాలను చూసి దర్శకుడు గంగ సప్తశిఖరను ప్రశంసించారు హీరో అల్లరి నరేష్. కొత్త తరహా స్క్రీన్ ప్లేతో అలరించబోతున్న ఈ సినిమాకి స్క్రీన్ ప్లే అందించింది సీనియర్ రైటర్ బాబీ కె ఎస్ ఆర్. ఒక కొత్త రకమైన క్రైమ్ థ్రిల్లర్ స్టోరీని ఎంగేజింగా ప్రేక్షకులకు త్వరలో చూపించబోతున్నటువంటి ఈ చిత్రం కచ్చితంగా విజయం చేకూర్చుతుందని అల్లరి నరేష్ అన్నారు. సంగీత దర్శకుడు షణ్ముఖ మ్యూజిక్ ఈ సినిమాకి ప్రాణం పోసిందని, వి ఆర్ కె నాయుడు కెమెరామెన్‌గా తన ప్రతిభను చూపించారని కొని ఆడారు చిత్ర దర్శకుడు గంగ సప్తశిఖర. ఈ చిత్రాన్ని ఎస్ కె ఎం ఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా ఆంధ్ర తెలంగాణలో త్వరలో రిలీజ్ చేయబోతున్నారు.







## 'ఒక పథకం ప్రకారం' హీరో ఇంటర్వ్యూ

స్టార్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తమ్ముడు, టాలీవుడ్ హీరో సాయి రామ్ శంకర్ నటించిన కొత్త సినిమా ఒక పథకం ప్రకారం. మలయాళ డైరెక్టర్ వినోద్ కుమార్ విజయన్ దర్శకత్వం వహించారు. గార్లపాటి రమేష్, వినోద్ కుమార్ విజయన్ నిర్మించారు. ఫిబ్రవరి 7న రిలీజ్ కాబోతున్న ఈ మూవీలో శృతి సోది, ఆషిమా నర్వాల్, సముద్రఖని కీలక పాత్రలు పోషించారు. ఇందులో సాయి రామ్ శంకర్ మల్టిపుల్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతున్నారు. సినిమా రిలీజ్ సందర్భంగా ఇచ్చిన తాజాగా ఇంటర్వ్యూలో పలు ఇంట్రెస్టింగ్ విషయాలు షేర్ చేసుకున్నారు సాయిరాం శంకర్. ఆ విశేషాలు తెలుసుకోండి.

**విలన్ ఎవరో ఇంటర్వెల్‌కు చెబితే రూ. 10,000 పట్టుకెళ్ళండి, పట్టుకుంటే 10 వేలు అంటున్నారు. అసలు ఈ ఐడియా ఎవరిది? రెస్పాన్స్ ఎలా ఉంది? దీనికి ముందు ఇంకేమైనా ఆలోచించారా?** రెస్పాన్స్ అయితే అద్భుతంగా ఉంది. సినిమా పేరు, రిలీజ్ అవుతుందన్న విషయం తెలియడానికి ఇది బాగా ఉపయోగపడింది. మొదటి నుంచి ఇదొక్కటే అనుకున్నాం. సినిమా చూశాక మా యూనిట్‌లో కీలక సభ్యులు పట్టుకుంటే పదివేలు అని చెప్పడంతో దీన్నే ఫిక్స్ అయ్యాము.

**ఒక పథకం ప్రకారం అంటున్నారు.. టైటిల్ జస్టిఫికేషన్ ఏంటి?**
ఒక పథకం ప్రకారం అంటే 80% క్రైమ్ జానర్ కథలకు వాడతాం. ఈ సినిమాలో ఉండే ప్రతి పాత్రకు ఎవరి ప్లానింగ్ వారికి ఉంటుంది. కాబట్టి ఒక పథకం ప్రకారం అనే టైటిల్ సెలెక్ట్ చేసుకున్నాం.

**దర్శకుడికి ఇదివరకే ఇంటర్నేషనల్ అవార్డు వచ్చింది. ఆయన ఎక్స్‌పీరియన్స్ ఈ సినిమాకు ఎంత వరకు ఉపయోగపడుతుంది?**
ఆయన 17 ఏళ్లకే డైరెక్టర్ అయ్యారు. ఆయన నా ఫస్ట్ మూవీ తర్వాత నుంచి నా ఫ్రెండ్. మేం 2005 నుంచి చేద్దాం చేద్దాం అనుకున్నాం. అన్నిటి మీద అవగాహన ఉన్న మంచి టెక్నీషియన్. ఆయన దర్శకనిర్మాతగా ఫాహద్ ఫాజిల్‌తో రెండు సినిమాలు నిర్మించారు. తెలుగులో అలాగే దర్శక నిర్మాతగా సినిమాలు చేద్దామని చెప్పారు. మా ఇద్దరికీ ఉన్న కామన్ ఫ్రెండ్ వినీత్ ఉన్నారు. వీళ్లిద్దరూ కలిసి తెలుగులో చేద్దాం అనుకున్నపుడు నా పేరును అనుకున్నారు.

**సముద్రఖనితో వర్క్ చేశారు కదా. ఏం నేర్చుకున్నారు?**
ఆయన ఆల్రెడీ సక్సెస్ ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్, నటుడు. డైరెక్టర్ కి ఏం కావాలో అదే చేస్తారాయన.

**పూరి జగన్నాథ్ ట్రైలర్ చూశారా? ఆయన రియాక్షన్ ఏంటి?**
సాయి రామ్ శంకర్: అన్నయ్య ట్రైలర్ చూశారు. కొత్తగా ఉందని అన్నారు. అలాగే పట్టుకుంటే రూ. 10,000 గురించి కూడా చెప్పాను.

**ఈ సినిమాలో మీ పాత్ర ఏంటి?** సాయి రామ్ శంకర్: మూవీ 50 సెంటర్స్‌లో రిలీజ్ అవుతుంది. ఇందులో నా పాత్ర క్రిమినల్ లాయర్. నెమ్మదిగా నా క్యారెక్టర్‌లో ఒక్కో షేడ్ బయట పడుతుంది. క్రిమినలా లేకపోతే క్రిమినల్ లాయరా అనిపించేలా ఉంటుంది. అయితే ఈ సినిమాలో నా పాత్ర కోసం వన్ మంత్ ట్రైనింగ్, వర్క్ షాప్స్ కూడా చేశాను.

**సినిమాలో యాక్షన్‌కి స్కోప్ ఉందా?** ఆయన మలయాళ డైరెక్టర్ అయినప్పటికీ తెలుగు సినిమాలు, ఇక్కడి స్టైల్ బాగా ఇష్టం. మలయాళంలో ఓ పాయింట్ పట్టుకుని వెళ్ళిపోతారు. కానీ ఇక్కడ అలా కుదరదు, కష్టం అంటారు డైరెక్టర్ విజయన్. కాబట్టి తెలుగు ఆడియన్స్ తగ్గట్టుగా ఫైట్ సీన్స్‌ని, సాంగ్స్ ను డిజైన్ చేశారు. తమిళ ఫైట్ మాస్టర్ ఢిల్లీ బాబు ఫైట్స్ డిజైన్ చేశారు.




**సినిమా అంతా క్రైమ్ జానర్‌లో సాగుతుందా? లవ్ స్టోరీ కూడా ఉంటుందా?**
ఇది లవ్ స్టోరీ బెస్ట్ క్రైమ్ మూవీ.

**షూటింగ్ చేసేటప్పుడు ఏదైనా మర్చిపోలేని అనుభవం?** షూటింగ్ కోసం 25 డాగ్స్ తెచ్చాము. ఆ క్లైమాక్స్ సీక్వెన్స్ ఏకంగా 4 రోజులు చేశారు. ఆ టైంలో డాగ్ పైకి బయటకు రావడంతో, గ్రిల్ ఎక్కేశాను. లక్కీగా ఎస్కేప్ అయ్యాను. ఆ ఫైట్ చాలా బాగుంటుంది. ముందుగా ఒక క్లైమాక్స్ సీన్ తీసి, సరిపోలేదని మళ్లీ ఎక్స్టెండెడ్ వెర్షన్ తీశారు డైరెక్టర్. ఏడెనిమిది రోజులు క్లైమాక్స్ కోసమే షూటింగ్ చేశాం.

**ఈ మూవీ తర్వాత సాయి రామ్ శంకర్ కంటిన్యూగా సినిమాలు చేస్తారా?** నాకు ఈ సినిమా మీద గట్టి నమ్మకం ఉంది.

## నూతన హీరో మారిశెట్టి అఖిల్ చిత్రం షూరు

హీరో కావాలన్న తన తనయుడు మారిశెట్టి అఖిల్ అభిరుచిని గమనించి, అతనిని హీరోగా పరిచయం చేసేందుకు పూనుకున్నారు అనకాపల్లి జిల్లాకు చెందిన ప్రముఖ రాజకీయవేత్త, మారిశెట్టి శ్రీకాంత్. మారిశెట్టి అఖిల్ హీరోగా, భానుశ్రీ హీరోయిన్‌గా శ్రీధన్ దర్శకత్వంలో ఎ.కె. టెక్ మార్కెటింగ్ మూవీ క్రియేషన్స్ పతాకంపై మారిశెట్టి శ్రీకాంత్. నిర్మించే నూతన చిత్రం చిత్రీకరణ అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని నిర్మాత సొంత గ్రామమైన లక్ష్మీపురంలోని రామాలయంలో ప్రారంభమైంది. టైటిల్ నిర్ణయించాల్సిన ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి సీనియర్ నిర్మాత నట్టి కుమార్ క్లాప్‌నిచ్చిన అనంతరం మాట్లాడుతూ, సినిమా పరిశ్రమ ఆంధ్ర ప్రదేశ్‌కు తరలి రావాలని, షూటింగులు ఆంధ్ర ప్రదేశ్‌లో చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏదైతే ఆకాంక్షించారో అందుకు అనుగుణంగా చిన్న సినిమా నిర్మాతలు ఆంధ్ర ప్రదేశ్ కు తరలివచ్చి, షూటింగులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అలా వచ్చిన నిర్మాతలకు సింగిల్ విండో సిస్టం లో పర్మిషన్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదా?. తెలియజేయాలని కోరుతున్నాను. టూరిజం లొకేషన్స్‌ను మరింతగా అభివృద్ధి చేయాలి. పాడేరు, అరకు, విశాఖ వంటి తదితర లొకేషన్స్‌లో షూటింగ్‌లకు అనువైన లొకేషన్స్‌ను గుర్తించి, వాటి అభివృద్ధితో పాటు నిర్మాతలకు అక్కడ షూటింగులు చేసుకునేందుకు సింగిల్ విండో సిస్టమ్ కింద త్వరితగతిన అనుమతులు ఇవ్వాలి. చిన్న సినిమాల మనుగడకు తగిన చర్యలను తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడుని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ని, ఐటీ మంత్రి నారా లోకేష్‌ని, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్‌ని కోరుతున్నాను. అనకాపల్లి రాజకీయాలలో మంచి పేరున్న మారిశెట్టి శ్రీకాంత్ తన కుమారుడి ఆసక్తిని గమనించి, సినిమా నిర్మాణానికి పూనుకోవడం అభినందనీయం' అని అన్నారు. నిర్మాత మారిశెట్టి శ్రీకాంత్ మాట్లాడుతూ, 'ఈ చిత్రం చిత్రీకరణ ఈ చుట్టు పక్కల ఐదు రోజులపాటు జరుగుతుంది. ఇందులో భాగంగా ఒక పాట, ఒక ఫైట్ చిత్రీకరణ జరుపుతాం. ఆ తర్వాత హైదరాబాద్, విశాఖపట్నం, అరకు తదితరప్రదేశాలలో షూటింగ్ చేస్తాం. హైదరాబాద్‌లో పెట్టబోయే ప్రెస్‌మీట్‌లో మిగిలిన అన్ని విషయాలను వెల్లడిస్తాం' అని చెప్పారు. హీరో మారిశెట్టి అఖిల్ మాట్లాడుతూ, మొదట్నుంచి నాకు సినిమా రంగమంటే ఎనలేని మక్కువ. హీరో కావాలన్న నా అభిరుచికి మా నాన్న మద్దతు పలికారు. దాంతో హైదరాబాద్‌లోని అన్నపూర్ణా ఫిలిం యాక్టింగ్ స్కూల్‌లో నటనలో శిక్షణ పొందాను.



6-2Pg5.qxd:6-2Pg5.qxd 01/01/01 7:59 AM Page 1



# పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోకి హమాస్ ఎంట్రీ!



## అప్రమత్తం అయిన భారత్ నిఘా సంస్థలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** ఇజ్రాయెల్ దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్న పాలస్తీనీ మిలిటెంట్ సంస్థ హమాస్ ఇపుడు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రవేశిస్తోందన్న ప్రచారంపెరిగింది. దీనితో భారత నిఘావర్గాలు ఒక్కసారిగా అప్రమత్తం అయ్యాయి. కాశ్మీర్ సంఘీభావ దినం సందర్భంగా బుధవారం పిఒకేలో ఆల్ అక్సా ఫ్లడ్స్ పేరిట ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో హమాస్‌కు చెందిన సీనియర్‌నేత ప్రసంగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సభను రావల్కోట్‌లోని సబీర్ స్టేడియంలో ఏర్పాటుచేసారు. ఉగ్ర సంస్థలు లష్కరే తాయిబా, జైషేమహ్మద్, సీనియర్ నాయకులు ఈ సభలో పాల్గొంటారని ప్రచారంచేసారు. హమాస్ ప్రతినిధి ఖలీద్ కద్దొమి ప్రసంగిస్తారని కరపత్రాలు ఇతర మార్గాల్లో ప్రచారం చేస్తున్నారు. ఆతడు కాశ్మీర్‌లోపోరాటాన్ని పాలస్తీనాతో ముడిపెట్టి మాట్లాడవచ్చని ఇంటెలిజెన్స్ వర్గాలు చెపుతున్నాయి. జీహాదీసంస్థలు తమ వాదనకు బలం చేకూరేలా వాదనలు సృష్టించేందుకు దీన్ని వాడుకోవచ్చన్న అంచనాలున్నాయి. మసూద్ అజర్‌సోదరుడు తల్హాసైఫ్, అస్గర్‌ఖాన్, ఇలియాస్ మసూద్ వంటి ఉగ్రవాదులు ఈ సభకు వస్తున్నట్లుప్రచారంచేస్తున్నారు. ఆ సమయంలో భారత హోంమంత్రి అమిత్‌షా జమ్ముకాశ్మీర్‌పై ఉన్నతస్థాయి సమావేశంనిర్వహించారు. అక్కడి భద్రతా పరిస్థితులు కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్ల పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌నున బలోపేతంచేయడం, సీమాంతర చొరబాట్లను అడ్డుకోవడం వంటిఅంశాలపై దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. కాశ్మీర్‌లో వాహన తనిఖీలనుకూడా తీవ్రతరం చేయాలని ఆదేశించారు. గత ఏడాది ఆగస్టులో హమాస్‌నేతలతో లష్కరే ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ భేటీ అయ్యాడు. ఖతార్ రాజధాని దోహా వేదికగా ఈ భేటీ జరిగింది. 2018లో సైఫుల్లాను అమెరికా ఉగ్రజాబితాలోచేర్చింది. లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్‌సయీద్‌కు ఆతడు అత్యంత సన్నిహితుడని కూడా అమెరికా ప్రకటించింది.



# గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకుంటాం

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 4:** ఇజ్రాయెల్ దాడులతో అతలాకుతలం అయిన గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రకటించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో భేటీ అనంతరం ఆయన ఈ ప్రకటన జారీచేసారు. ఇజ్రాయెల్ గాజా యుద్ధం నేపథ్యంలో తాజా పరిస్థితిపై నెతన్యాహుతో ట్రంప్ చర్చలుజరిపారు. గాజాను అమెరికా స్వాధీనం చేసుకుంటుంది. అక్కడ ధ్వంసమైన భవనాలను పునరుద్ధరిస్తాం. ఆ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధిచేస్తే అక్కడి ప్రజలకు అపరిమిత సంఖ్యలో ఉద్యోగాలు కల్పించవచ్చు. ఇళ్లు నిర్మించవచ్చని ట్రంప్ అన్నారు. ట్రంప్‌ప్రకటన చరిత్రను మారుస్తుందని నెతన్యాహూ అన్నారు. గాజాలో ఉద్రిక్తతల కారణంగా నిరాశ్రయులుగా మారిన పాలస్తీనీయులకు అరబ్‌దేశాలు ఆశ్రయం కల్పించాలని ట్రంప్‌ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈప్రతిపాదనను ఆదేశాలు ఖండించాయి. అలాచేస్తే తమ ప్రాంత అస్థిత్వం, స్థిరత్వం దెబ్బతింటుందని ఈజిప్టు, జోర్డాన్, సౌదీ అరేబియా, యుఎఇ, ఖతార్, పాలస్తీనా అతారిటీ, అరబ్‌లీగ్‌లు సంయుక్తప్రకటన చేసాయి. ఈ క్రమంలోనే గాజాను స్వాధీనం చేసుకుని అభివృద్ధిచేస్తామని ట్రంప్‌ప్రకటించారు. అయితే ట్రంప్‌ప్రకటనపై హమాస్ తీవ్రంగా ఖండించింది.

ఆయన గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మిలిటెంట్ సంస్థకు చెందిన ఒక సీనియర్ అధికారి అన్నారు. ఈ ప్రాంతంలో గందరగోళం ఉద్రిక్తతలు సృష్టించడానికే ట్రంప్ ఈప్రకటనచేసారు. మా ప్రజలు ఎంతమాత్రం ఆమోదించరని వారి భూమినుంచి వారిని తరలించడమే కాకుండా ఈ దురాక్రమణను అడ్డుకోవాల్సి ఉందని హమాస్ నేత సమీ అబు జుహ్రీప్రకటించారు.



## బావిలో పడిన భర్తను ప్రాణాలకు తెగించి కాపాడిన భార్య..

## కేరళలో చోటు చేసుకున్న ఘటన!

**తిరువనంతపురం, ఫిబ్రవరి 5:** భర్త తన కళ్ల ముందే ప్రమాదానికి గురైతే ఆ భార్య కన్నీళ్లు పెట్టుకుంటూ కూర్చోలేదు. ప్రాణాలకు తెగించి ఆ భర్తను కాపాడుకుంది. బావిలో పడిపోయిన అతడిని గట్టిగా ఒడిసిపట్టి పునర్జన్మ ప్రసాదించింది. కేరళలోని పిరవమ్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థాని మీడియా వివరాల ప్రకారం.. పిరవమ్ ప్రాంతంలో రమేశన్, పద్మ అనే దంపతులు నివసిస్తున్నారు. బుధవారం ఉదయం తమ నివాసంలోని మిరియాల చెట్టుపైకి ఎక్కి రమేశ్ (64) మిరియాలు తీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు విరగడంతో పక్కనే ఉన్న 40 అడుగుల లోతులో ఉన్న బావిలో పడిపోయాడు. వెంటనే స్పందించిన అతడి భార్య పద్మ (56) సమయస్ఫూర్తితో వ్యవహరించి తాడు సహాయంతో బావిలోకి దిగింది.

అయితే అప్పటికే స్పృహకోల్పోయే స్థితిలో ఉన్న భర్తను ఒడిసిపట్టుకుని దాదాపు 20 నిమిషాల పాటు అలాగే నీటిలో ఉంది. ఆమె కేకలు విని వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. వల సహాయంతో వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు. తన భర్త ప్రాణాలను కాపాడు కోవడం కోసం పద్మ చూపిన తెగువను అధికారులు, స్థానికులు ప్రశంసించారు.



## హైదరాబాద్-తిరుపతి విమానంలో సాంకేతిక లోపం

### విమానం రద్దు, ప్రయాణికుల ఆందోళన

**శంషాబాద్. ఫిబ్రవరి 5. ప్రభాతవార్త:** హైదరాబాద్ నుండి తిరుపతి వెళ్లాల్సిన విమాన సర్వీసు సాంకేతిక కారణల వల్ల రద్దు అయ్యింది. దీనితో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం తెల్లవారుజామున ఐదు గంటల 30 నిమిషాలకు బయల్దేరాల్సిన విమానంలో సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో విమాన సర్వీసును రద్దు చేశారు. చివరి నిమిషంలో ప్రయాణికులకు సమాచారం అందించడం పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 4 గంటల పాటు ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో పడిగాపులు పడ్డారు.

విమాన సర్వీసు టికెట్లతో పాటు తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకోవడానికి ముందుగానే ప్లాన్ చేసుకుని టికెట్లు బుక్ చేసుకున్నట్లు వారు తెలిపారు. చివరి నిమిషంలో విమానం రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల ఎయిర్‌వేస్ తీరుపై తిరుమల వెళ్లే ప్రయాణికుల ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల వెంకన్న దర్శన భాగ్యాన్ని దూరం చేయడం పట్ల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

# బ్యాంకులకు మొత్తంచెల్లించాం, స్టేట్‌మెంట్లు ఇవ్వాలి



## కర్ణాటక హైకోర్టులో మాల్యా పిటిషన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** బ్యాంకులకు వేల కోట్ల రుణాలను చెల్లించకుండా దేశం వదిలిపారిపోయిన విజయ్‌మాల్యా కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. తానుతీసుకున్న రుణాలకు అనేక రెట్లు బ్యాంకులు తననుంచి వసూలుచేసాయని అందుకు సంబంధించిన అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని కోరుతూ పిటిషన్ దాఖలుచేసారు. తనతోపాటు ప్రస్తుతం లిక్విడేషన్‌లో ఉన్న యుబిహెచ్‌ఎల్ ఇతర సంస్థలనుంచి వసూలు చేసిన మొత్తాల వివరాలను అందించాలని కోరారు. తాజాగా న్యాయస్థానం ఈ పిటిషన్‌పై విచారణచేసింది. ఈ సందర్భంగా మాల్యాతరపు న్యాయవాది తన వాదనలు వినిపించారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ సుమారు రూ.6200 కోట్లరుణాన్ని తీసుకోగా ఇందుకు సంబంధించి 14 వేల కోట్లురికవరీచేసారని తెలిపారు. లోక్‌సభలో ఆర్థికమంత్రి స్వయంగా చెప్పారని మాల్యాకు చెందిన రూ.14,131 కోట్లవిలువైన ఆస్తులను బ్యాంకులు రికవరీచేసాయని ఆమె చెప్పారని ఆయన తీసుకున్న రుణంలో సుమారు రూ.10,200 కోట్లు చెల్లించినట్లు రికవరీ అధికారి కూడా తెలిపారు. పూర్తిరుణం చెల్లించినప్పటికీ ఇంకా రికవరీ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. మాల్యాకు సంబంధించిన రికవరీ చర్యలపై స్టే విధించాలని కోర్టును కోరుతున్నాను. దీనికి సంబంధించి అన్ని బ్యాంకుల అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని న్యాయవాది అభ్యర్థించారు. వాదనలు విన్న న్యాయస్థానం ఈ అంశంపై స్పందించాలంటూ ఎస్‌బిఐ, పంజాబ్‌నేషనల్‌బ్యాంకుసహా 10 బ్యాంకులకు ఆదేశాలు జారీచేసింది. ఈనెల 13వ తేదీలోగా స్పందన ఇవ్వాలని గడువు విధించింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణాలపరంగామోసం చేసారనివిజయ్‌మాల్యా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దేశం విడిచి వెళ్లిపోయిన ఆయన మార్చి 2016 నుంచి బ్రిటన్‌లో నివసిస్తున్నారు. మాల్యాను భారత్‌కు రప్పించడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే ఆయన హైకోర్టును ఆశ్రయించగా బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చింది.

# అరె చుప్..తేరేబాప్ మేరే సాథీహై

## మాజీ ప్రధాని కుమారుడు, ఎంపిపై ఖర్గే అసహనం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లిఖార్జున్‌ఖర్గే రాజ్యసభలోనోరుపారేసుకున్నారు. తన ప్రసంగానికి అడ్డుతగులుతున్న అధికారపక్ష సభ్యుడిని నోరుమూసుకుని కూర్చో అంటూ అసహనం వ్యక్తంచేసారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో పాల్గొన్న ఖర్గే మాట్లాడుతుండగా భారత మాజీ ప్రధాని చంద్రశేఖర్ తనయుడు బిజెపి ఎంపి నీరజ్‌శేఖర్ అడ్డుతగలడంతో ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేసారు. అమెరికా డాలర్‌తోరూపాయి మారకం విలువభారీగా పతనం అవుతోందని కేంద్ర ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణమని ఖర్గే ఆరోపిస్తుండగా బిజెపి ఎంపి నీరజ్‌శేఖర్ అడ్డుతగిలారు. దాంతో సహనం కోల్పోయిన ఖర్గే 'తేరా బాప్‌కాభీ మెయిన్ ఐసా సాథీథా తూక్యాబాత్‌కర్తాహై? తుజ్‌కో లేకర్ గుమా చుప్‌చుప్ చుప్ బైట్ అంటూ అసహనం ప్రదర్శించారు. నేను నీ అయ్యకు సహచరుడిని ఏం మాట్లాడుతున్నావ్ నీ సంగతి చెప్పా నోర్ముయ్, నోరుమూసుకుని కూర్చో అంటూ చిరాకు ప్రదర్శించారు. ఖర్గే వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారంరేపాయి. దాంతో ఛైర్మన్ జగదీప్‌ధన్‌కడ్ కలుగచేసుకని అధికార ప్రతిపక్ష ఎంపిలను శాంతింపచేసారు. చంద్రశేఖర్ దేశంలోని గొప్ప నాయకుల్లో ఒకరు. ఆయనకున్న గౌరవం అమూల్యమైనదని ఆయన గురించి అగౌరవంగా మాట్లాడినందున ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోండి అని ఖర్గేను కోరారు. చంద్రశేఖర్ తాను కలిసి అరెస్టు అయ్యామని అందుకే ఆయన తన సమకాలికుడని చెప్పానని ఖర్గే బదులిచ్చారు. ఛైర్మన్ స్పందిస్తూ కానీ మీరు నీ అయ్య అనే పదం వాడారు. అలా మాట్లాడొచ్చా సాటి గౌరవ సభ్యుడితో మీరు నీ అయ్య అని వ్యాఖ్యానించారు. చంద్రశేఖర్‌గారిని మనం గౌరవించాలి. కాబట్టి మీ వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోండి అని ఛైర్మన్ ధన్‌ఖడ్ మరోసారి ఖర్గేనుకోరారు. కానీ ఖర్గే అందుకు ఒప్పుకోలేదు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ గురించి బిజెపి సభ్యులు అమర్యాదగా మాట్లాడిన సందర్భాలను గుర్తుచేసారు. మన్మోహన్‌సింగ్ స్నానం చేసేటపుడు కూడా రెయిన్‌కోట్ వేసుకుంటారని ఒకరు కించపరిచారు. ఒకరు ఆయన మాట్లాడనే మాట్లాడడని హేళనచేసారు. కొందరు ఆయనకు ప్రభుత్వం నడపడం చేతకాదనికించపరిచారు. ఇంత అవమానించినా ఆయన సహించారు. అందుకు కూడా ఆయన్ను మౌనిబాబా అంటూ అగౌరవ పరిచారు. ఇలా సాటివ్యక్తులను అగౌరవపరిచే తత్వం వాళ్లదే. మేం అవమానాలను సహించేవాళ్లమని చంద్రశేఖర్‌ను అవమానించే ఉద్దేశ్యంతోనేను ఆ మాట అనలేదని ఛైర్మన్ ధన్‌ఖడ్‌కు ఖర్గే జవాబిచ్చారు.

## అమెరికా అక్రమ వలసదారులను

# నేరస్తులుగా పంపడమా?

## కాంగ్రెస్ నేత పవర్ ఖేడా!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి:** అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులను అమెరికా ప్రత్యేక విమానాల్లో భారత్‌కు తరలిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ భారతీయుల చేతికి సంకెళ్లు వేసి వారిని నేరస్తులుగా పంపడం అవమానకరమని పేర్కొంది. ఓ భారతీయుడిగా అలాంటి దృశ్యాలు చూడలేకపోతున్నానని కాంగ్రెస్ నేత పవర్‌ఖేరా ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో భారత దౌత్యవేత్త దేవయాని ఖోబ్రగాడేకు అమెరికాలో ఎదురైన అవమానాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.

2013లో న్యూయార్క్‌లో దౌత్య కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఓ వీసా వ్యవహారంలో ఆమెను అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి అవమానించిన విషయం తనకు జ్ఞాపకానికి వస్తోందని అన్నారు. ఆ విధంగా ప్రవర్తినందుకు అదే సమయంలో దేశంలో పర్యటించిన అమెరికా కాంగ్రెస్ ప్రతినిధి బృందాన్నికలవడానికి అప్పటి యుపిఎ ప్రభుత్వ నేతలు నిరాకరించారని అన్నారు. యుఎస్ ఎంబసీకి ఇచ్చిన అనేక ప్రోత్సాహకాలను భారత్ ఉపసంహరంచుకుందని పేర్కొన్నారు. కాగా అమెరికా నుంచి అక్రమ భారతీయ వలసదారులను తీసుకువస్తున్న ఈ విమానం మొదటిది కాదని కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ అన్నారు. వాస్తవాలు బయటకు రాకుండా బిజెపి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో కూడా 1100 మంది భారత అక్రమ వలసదారులను అమెరికా నుంచి బహిష్కరించారని కానీ వారి వివరాలు వెల్లడించలేదని పేర్కొన్నారు. 2022 నాటికి యుఎస్‌లో 725,000 మంది భారతీయ అక్రమ వలసదారులు ఉన్నట్లు పలు నివేదికలు వెల్లడించాయని చెప్పారు. అక్రమ వలసదారులపై మొదటి నుంచి కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కడ అక్రమంగా ఉంటున్న విదేశీ వలసదారులను స్వదేశాలకు పంపుతున్నారు.

## ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు

# ఆగాఖాన్ కన్నుమూత!



ప్రణబ్ నుంచి పద్మవిభూషణ్ అందుకుంటున్న ఆగాఖాన్ (ఫైల్)


**లండన్, ఫిబ్రవరి 5:** అత్యంత సంపన్నుడు పద్మవిభూషణ్ గ్రహీత ప్రపంచ ఇస్మాయిలీ ముస్లిం అధ్యాత్మిక గురువు ఆగాఖాన్ 88వ ఏట కన్నుమూసారు. ఆగాఖాన్‌ఫౌండేషన్ అధికారికంగా ప్రకటించింది. ఆగాఖాన్ కుటుంబానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇస్మాయిలీ కమ్యూనిటీకి సంతాపం తెలియజేస్తున్నామని, వ్యక్తులంతా మతపరమైన భేదాలు లేకుండా ఆయన కోరుకున్నట్లుగా ప్రజల జీవితాన్ని మెరుగుపరిచేందుకు భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నట్లు ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ప్రకటన విడుదలచేసింది. ఆయన మరణవార్త కింగ్‌ఛార్లెస్3కి మనస్తాపం కలిగించింది. ఆయనకు కింగ్ ఛార్లెస్-3, ఆయన తల్లి దివంగత క్వీన్ ఎలిజబెత్-2కు మంచి సంబంధాలున్నాయి. ఆగాఖాన్ స్విట్జరాండ్‌లో జన్మించారు. 20 ఏళ్ల వయసు 1957లోనే ఇస్మాయిలీ ముస్లింల 49వ వంశపారంపర్య ఇమామ్‌గా నియమితులయ్యారు. వారసత్వంగా వస్తున్న గుర్రాల పెంపకంతోపాటు ఇతర వ్యాపారాల్లోను రాణించారు.

యునైటెడ్‌కింగ్‌డమ్, ఫ్రాన్స్, ఐర్లాండ్ వంటి దేశాల్లో ప్రముఖంగా నిర్వహించే రేసు గుర్రాల్లోను ఆయన పాల్గొంటుండేవారు. 1967లో ఆగాఖన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ స్థాపించారు. ప్రపంచంలోనే వందలాది ఆసుపత్రులు, విద్యా సాంస్కృతిక సంస్థలను అభివృద్ధిచేసింది. ఆయన సేవలకుగాను 2015లో కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్‌తో సత్కరించింది.

## సహజీనం జంటలు కూడా

# నమోదు చేసుకోవాల్సిందే

## ఉత్తరాఖండ్ యుసిసితో జంటల నిరుత్సాహం



**డెహ్రాడూన్, ఫిబ్రవరి 5:** ఉత్తరాఖండ్‌లోఉమ్మడి పౌరస్మృతి గతనెల 27నుంచి అమలులోకి వచ్చేసింది. ఈచట్టంతో అన్ని మతాల్లోని వ్యక్తులకు వివాహం, ఆస్తిహక్కులు తదితర అంశాల్లో ఒకే రకమైన నిబంధనలు అమలుచేస్తున్నారు. ఏ మతంలోనూ బహుభార్యాత్వాన్నియుసిసి అనుమతించదు. వీటికితోడు యూసిసికింద సహజీవనంచేసే జంటలుసైతం రిజిస్టర్‌చేసుకోవాలి. ఎవరైనా పెళ్లిచేసుకోకుండా కలిసి ఉండే జంటలు దరఖాస్తుచేసుకుని తమ సహజీవనాన్ని నమోదు చేసుకోవాలి. అయితే సహజీవనాల నమోదుకు ఇప్పటివరకూ ఐదే ఐదు దరఖాస్తులురాగా కేవలం ఒక సహజీవనం మాత్రమే రిజిస్టరు అయింది.

ఈ సహజీవనం జంటల రిజిస్ట్రేషన్‌ను కొందరు వ్యతిరేకిస్తున్నారు. చట్టంపై ప్రజల్లో అవగాహన రావడానికి సమయం పడుతుందని సహజీవనాల నమోదుకు చాలామంది ఇష్టపడటం లేదన్న వాదనకూడా ఉంది. అయితే సహజీవనం నమోదుచేసుకోకపోతే యుసిసికింద జరిమానాతోపాటు ఆరునెలల జైలు శిక్షను ఎదుర్కోనాలి. సహజీవనాల నమోదును చాలా మంది వ్యతిరేకించినప్పటికీ ఉత్తరాఖండ్‌లోని పుష్కరసింగ్ ధామి ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. శ్రద్ధావాకర్ తరహా ఘటనలు పునరావృతం కావద్దంటే సహజీవనాల నమోదు తప్పనిసరి అన్న నిబంధనను అమలుకు తెచ్చింది.

## యాచనచేస్తూ అత్త రెక్కీ

# రాత్రివేళల్లో అల్లుడు దొంగతనాలు!

**పాట్నా, ఫిబ్రవరి 5:** యాచకవృత్తిలో ఉన్న ఒక బిచ్చగత్తె ఇంటిపై పోలీసులు దాడిచేసి అక్కడ లభించిన వస్తువులను చూసి అవాక్కయ్యారు. ఖరీదైన సెల్‌ఫోన్లు, బైక్, విదేశీ నాణేలు ఇతర విలువైనవస్తువులు లభించాయి. అడుక్కునే నెపంతో ఆమహిళ రెక్కీనిర్వహించగా ఆమె అల్లుడు చోరీలకు ప్పాడుతున్నట్లుపోలీసులు గుర్తించారు. ఆ బిచ్చగత్తెను అరెస్ట్‌చేసారు. పరారీలో ఉన్న ఆమె అల్లుడికోసం వెతుకుతున్నారు.

బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. నీలందేవి అనే మహిళ పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి అడుక్కునేది. కొన్నిసార్లు దోమతెరలు అమ్మేది. ఆప్రాంతాల్లో పలు చోరీలు జరగడంపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీనితో దర్యాప్తుచేపట్టి సిసిటివి ఫుటేజ్‌లను పరిశీలించారు. బిచ్చగత్తె నీలందేవిని అన ఎమానించి ఆమె ఇంటిపై దాడిచేసారు. విలువైన బైక్, ఖరీదయిన 12 మొబైల్‌ఫోన్లు, నేపాల్ ఆఫ్ఘనిస్తాన్, కువైట్ వంటి పలుదేశాలకు చెందిన వెండి నాణేలు, బ్రిటిష్‌కాలంనాటి నాణేలు, బంగారు గొలుసు ఇతర విలువైన ఆభరణాలు ఆ మహిళ ఇంట్లో లభించాయి.

నీలందేవిని విచారించగా బిచ్చం ఎత్తుకునే నెపంతో రెక్కీ నిర్వహించి తాళాలు వేసి ఉన్న ఇతర ఇళ్లను ఆమె గుర్తించేదని తెలుసుకున్నారు. ఆమె అల్లుడు చుతుక్‌లాల్ తన అనుచరులతో కలిసి ఆయ ఇళ్లల్లో చోరీలకు పాల్పడినట్లు పోలీస్ అధికారి తెలిపారు. బిచ్చగత్తె నీలందేవిని అరెస్టుచేసినట్లు చెప్పారు. పరారీలో ఉన్న ఆమె అల్లుడికోసం గాలిస్తున్నా మన్నారు. ఆతడి అరెస్ట్ తర్వాత మిగతా నిందితులు కూడా అదుపులోకి వస్తారని ఆయన అన్నారు.

06 - 02 Pg6exHMNWJQE.qxd:06 - 02 Pg6exHMNWJQE.qxd 01/01/01 9:26 AM Page 1



# అసంఘటిత కార్మికులను ఇశ్రమ్ పోర్టల్లో రిజిష్టర్ చేయించాలి

## - కోటి 50 లక్షల మందిని చేర్చాలని లక్ష్యం, ఇప్పటికే 81 లక్షలు నమోదు

## - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**విజయవాడ,ఫిబ్రవరి5,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అంసఘటిత రంగంలో పనిచేసే కార్మికులందరినీ ఇశ్రమ్ పోర్టల్లో రిజిష్టర్ చేయించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఇశ్రమ్ పోర్టల్ కు సంబంధించి రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోటి 50 లక్షల మందిని ఇశ్రమ్ పోర్టల్లో రిజిష్టర్ చేయించాలని లక్ష్యం కాగా ఇప్పటికే 81 లక్షల 52 వేల మందిని రిజిష్టర్ చేశారని మిగతా వారిని కూడా వేగవంతంగా రిజిష్టర్ చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దేశంలో ఇశ్రమ్ పోర్టల్ ఇంటిగ్రేషన్ చేసిన రాష్ట్రాల్లో ఎపి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇశ్రమ్ పోర్టల్లో రిజిస్ట్రేన్ కు జిల్లాల వారీగా,శాఖల వారీగా లక్ష్యాలు నిర్ధేశించాలని,జిల్లా కలక్టర్ నేతృత్వంలోని జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీల సమావేశాలు నిర్వహించి త్వరితగతిని రిజిష్టర్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అంతేగాక ఇ శ్రమ్ పోర్టల్లో రిజిష్టర్ కావడం వల్ల కలిగే ప్రయోజనాలపై అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని కార్మిక తదితర శాఖల అధికారులను సిఎస్ విజయానంద్ ఆదేశించారు. దేశంలో అధిక శాతం మంది భవన నిర్మాణం వంటి అసంఘటిత రంగాల్లో పని చేస్తున్నారని వీరికి పిఎఫ్,ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు ఉండవని అంతేగాక వృద్ధాప్యంలో ఎదురయ్యే ఆర్ధిక సవాళ్లను అధికగమించేందుకు అలాంటి శ్రమ జీవుల భవిష్యత్ భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమే ఇశ్రమ్ పోర్టల్ అని సిఎస్ విజయానంద్ పేర్కొన్నారు. కేవలం ఇన్సూరెన్స్ మాత్రమే కాకుండా వారి పిల్లలకు ఉచిత సైకిళ్ళ,పనిముట్లు,కుట్టు మిషన్లు వంటి ఇతర ఆర్ధిక సహాయాలు ఈ పథకం కింద అందుకోవచ్చని తెలిపారు.కార్మిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ పథకంలో చేరేందుకు 16 నుంచి 59 ఏళ్ల వయస్సున్న వ్యక్తులు అర్హులేనని చెప్పారు.ఇశ్రమ్ పోర్టల్లో చేరిన కార్మికులు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల వరకు బీమా ప్రయోజనం పొందుతారని బీమా కోసం ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.కార్మికుడు ప్రమాదంలో మరణిస్తే 2లక్షల రూ.ల బీమా లభిస్తుందని లేదా పూర్తిగా అంగవైకల్యం చెందితే పాక్షిక వైకల్యానికి రూ.1 లక్ష బీమా లభిస్తుందని సిఎస్ విజయానంద్ తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇశ్రమ్ పోర్టల్ గురుంచి వివరిస్తూ అసంఘటిత రంగంలో పని చేసే అనగా వలస కార్మికులు,భవన నిర్మాణ కార్మికులు,చిన్న చిన్న వ్యాపారాలు చేసేవారు తదితరులంతా ఈపోర్టల్ లో రిజిష్టర్ కావచ్చని అన్నారు.

# సైబర్ మోసగాళ్ల వలలోపడి రూ.17లక్షలు పోగొట్టుకున్న మహిళ

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ధనలక్ష్మీనగర్లో నివాసం ఉంటున్న కె.సుజాత అనే గృహిణి అన్లైన్ మోసానికి బలై రూ.17లక్షల రుపాయాలు కోల్పోయినట్లు తిరుపతిరూరల్ పోలీసు స్టేషన్ సి.ఐ చిన్నగోవిందుడు తెలిపారు. ఫిర్యాదుదారు సుజాత సెల్ నెంబర్కు అజ్ఞాత నెంబర్ నుండి వచ్చిన వాట్సప్ సందేశానికి స్పందించిన అన్లైన్లో పార్ట్టైమ్ ఉద్యోగం చేసే అవకాశంగా భావించారు. ఆమెను టెలిగ్రామ్ గ్రూపులో చేర్చి, ఆమెకు కొన్ని లింక్లు పంపించి స్టార్ హోటల్స్కు రేటింగ్ ఇచ్చే టాస్క్ల పేరుతో మోసగాళ్లు నమ్మబలికారు. ప్రధమదశలో కొంత డబ్బు పంపించి, లాభాలు చూపించి, మరింత మొత్తాన్ని డిపాజిట్ చేయాలని ప్రేరేపించారు. ఈప్రక్రియలో సుజాత అప్పులు చేసి, బంగారం తాకట్టు పెట్టి మొత్తం రూ.17లక్షలు మోసగాళ్ల బ్యాంక్ ఖాతాలో ట్రాన్స్ఫర్ చేసారు. ఆ తర్వాత ఏక కాలంలో మోసగాళ్ల అన్ని అకౌంట్స్ బంద్ కావడంతో మోసపోయామని గ్రహించి, ఆమె తిరుపతిరూరల్ పోలీసు స్టేషన్ను ఆశ్రయించి,

ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మొబైల్కు అనవసరంగా వచ్చిన వాట్సప్, టెలిగ్రామ్ సందేశాలను నమ్మరాదు. అపరిచిత లింక్స్ క్లిక్ చేయడం వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు ఇవ్వడం మానుకోండి. అన్లైన్ పనుల పేరిట ముందుగా డబ్బు పంపాలని కోరితే అవి మోసమే అని గుర్తించుకోండి.

# బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన టీచర్ !

## ఆందోళనకు దిగిన తల్లితండ్రులు - చర్యలకు రంగం సిద్ధంచేసిన పోలీసులు

**నారాయణవనం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** విద్యార్థులకు విద్యా బుద్దులను నేర్పించాల్సిన ఓ ప్రభుత్వ టీచర్, తన వక్రబుద్దిని ప్రదర్శించాడు. నలుగురు విద్యార్థులకు మంచి జ్ఞానాన్ని అందించి వారి ఉన్నతకి తోడ్పాల్సిన అయ్యోరు విద్యార్థులను పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి ఉపాధ్యాయ వృత్తికే కలకం తెచ్చాడు. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం మండలం మిట్టనైనారుకండ్రిగ యుపి పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నాం ఈ సంఘటన చోటు చేసుకుంది. పూర్తి వివరాలు ఇలా వున్నాయి. పిచ్చాటూరు మండలం కీళపూడి దళితవాడకు చెందిన కుప్పయ్య కుమారుడు టి. వెంకటరమణ (40) నైనారుకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నాడు. మంగళవారం నుంచి మిట్టనైనారుకండ్రిగ యుపి పాఠశాలలో పనిచేసే టీచర్ ట్రనింగ్ కోసం రెండు రోజులు పాటు సెలవు పెట్టింది. ఆ స్థానంలో నైనారుకండ్రిగ పాఠశాల టీచర్గా పనిచేస్తున్న వెంకటరమణకు ఎంఇఓ ప్రభాకర్రాజు డిప్యూటేషన్ ఇచ్చారు. ఆ మేరకు మంగళవారం విధులకు వచ్చిన వెంకటరమణ మధ్యాహ్నాం భోజనం తర్వాత నలుగురు బాలికలను ఓ గదిలోకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడని, ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడని సమాచారం. దీంతో ఆ నలుగురు బాలికలు స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన తర్వాత మంగళవారం రాత్రి జరిగిన విషయాన్ని తల్లితండ్రులకు తెలిపారు. దీంతో ఆగ్రహించిన విద్యార్థునుల తల్లితండ్రులు బుధవారం ఉదయం పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు. వెంటనే సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ కె.రాజశేఖర్ తన సిబ ందితో వెళ్లి జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. కారణమైన టీచర్ని చాకచక్యంగా పోలీసులు వ్యవహరించి అదుపులోకి తీసుకున్నారు. ఫోక్సో క్రింద కేసు నమోదు చేయడానికి పోలీసులు సన్నధమవుతున్నారు. నలుగురు విద్యార్థునుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన టీచర్ వెంకటరమణ భాగోతాన్ని జిల్లా విద్యాశాఖ అధికారికి సమాచారం అందించడం జరిగిందని పుత్తూరు డిప్యూటీ డిఇఓ ప్రభాకర్రాజు ప్రభాతవార్తకు వివరణ ఇచ్చారు. ఉన్నత అధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే చర్యలు తప్పక వుంటుందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో జరగకుండా కఠినంగా వ్యవహరిస్తామన్నారు.



విచారణ జరుపుతున్న ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది

# రాష్ట్రంలో భవన నిర్మాణాలకు 24 గంటల్లో అనుమతులు

విజయవాడ,ఫిబ్రవరి5,ప్రభాతవార్త ప్రతినిధి: భవన నిర్మాణాలకు అనుమతుల్లో జాప్యాన్ని నిరోధిస్తూ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన పథకం అమలుకు సంబంధించి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంగళవారం మార్గదర్శకాలు జారీ చేసింది. 18 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో గ్రౌండుతో పాటు మరో నాలుగు అంతస్తుల భవన నిర్మాణాలకు వాటి యజమానుల స్వీయ ధ్రువీకరణతో కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీల నుంచి ఆన్లైన్లో అనుమతులు పొందవచ్చు ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో భవన నిర్మాణ అనుమతుల కోసం అనుమతులున్న లే అవుట్స్ లో నిర్మించే భవనాలకు మాత్రమే ఈ వెసులుబాటు కల్పించాలని నిర్ణయించారు. 2008, 2020 ఎల్ఆర్ఎస్ లో అనుమతులు పొందిన లే అవుట్లలో నిర్మించే భవనాలకు వెసులుబాటు కల్పించారు. ప్లింత్ లెవల్ ఇన స్పెక్షన్ నివేదికను లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టంకు సమర్పించాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. కోస్టల్ రెగ్యులేటరీ జోన్ లో నిర్మించే భవనాలకు ఈ స్వయం ధ్రువీకరణ వెసులుబాటు లేదని స్పష్టం చేశారు. అనధికార లేఅవుట్లో నిర్మించే భవనాలకు ఈ వెసులుబాటు లేదని వెల్లడించారు. ఆన్ లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టంలో ఎలాంటి ఉల్లంఘనలు చోటు చేసుకున్నా సంబంధిత భవనాల యజమానులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ మార్గదర్శకాలు జారీ చేశారు.ఇకపై కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పనిలేదు. ఇక అధికారులు అకారణంగా కొర్రీలు పెట్టి ఇబ్బంది పెడతారన్న భయం అంతకంటే లేదు. దరఖాస్తు పోర్టల్లో అప్లోడ్ చేసిన గంటల వ్యవధిలోనే అనుమతులు పొంది పనులు ప్రారంభించుకోవచ్చు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కూడా పొందవచ్చు. నిర్మాణాల అనుమతులు సులభతరం చేస్తూ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన స్వీయ ధ్రువీకరణ పథకం ప్రత్యేకతగా ఉంది. ఈ పత్రాల కోసం లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్ ద్వారా దరఖాస్తులు, అనుబంధ పత్రాలతోపాటు వాటిని ధ్రువీకరిస్తున్నట్లుగా అంగీకార పత్రాన్ని ఆన్లైన్ భవన నిర్మాణ అనుమతి వ్యవస్థ పోర్టల్లో అప్లోడ్ చేయాలి. అర్జీతోపాటు అనుబంధ పత్రాలను పోర్టల్ ద్వారా పరిశీలించి అనుమతులిచ్చేలా ప్రత్యేక సాఫ్ట్వేర్ను రూపొందించారు. 24 గంటల్లోగా అనుమతులు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఆ వెంటనే యజమానులు భవన నిర్మాణ పనులు ప్రారంభించవచ్చు. నిర్మాణం పూర్తయ్యాక మళ్లీ ఆన్లైన్ పోర్టల్లోనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. భవన నిర్మాణాలకు ఆన్లైన్లో అనుమతులు తీసుకున్నాక పనుల నిర్వహణపై పట్టణ ప్రణాళిక అధికారులు ఇప్పటివరకు చేపట్టిన పోస్ట్ వెరిఫికేషన్ పద్ధతిని ప్రభుత్వం తొలగించింది. అధికారులు కొందరు భవన నిర్మాణ యజమానులను డబ్బు కోసం ఇబ్బంది పెడుతున్నారనే ఫిర్యాదులతో ఈ నిర్ణయం తీసుకుంది. ఆమోదిత లేఅవుట్లలోని ప్లాట్లలోనే నిర్మాణాలకు అనుమతులు తీసుకోవాలి. వాటిపై యాజమాన్య హక్కులు కలిగి ఉండాలి. కొత్తగా ప్రవేశపెట్టిన స్వీయ ధ్రువీకరణ పథకంతో ఏటా 30,000ల భవన నిర్మాణాలకు ఇక సులువుగా అనుమతులు లభించనున్నాయి.

# విజన్ 2047 కోసం మరింత ప్రక్షాళన

## - నిర్ణయాల అమలు దిశగా కార్యాచరణ - 11న సిఎం చంద్రబాబుతో టిటిడి అధికారులు సమావేశం

**తిరుమల,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ ప్రసిద్ధ హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో పాలకమండలి తీసుకునే మంచి నిర్ణయాలే అమలుచేయాలని, బోర్డునే సుప్రీమ్ అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించిన విషయం విదితమే. గత ఐదేళ్ళ టిటిడిలో పలు రకాల వివాదాలు, నిర్ణయాలు భక్తులకు ఇబ్బందికలిగించడమోగాక నిధులు పక్కదారిపట్టాయనేది తెలిసిందే. అనేక వివాదాలు, ఆరోపణల నడుమ గత నాలుగునెలల టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్నాయుడు పాలనలో పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం, భక్తులకు సౌకర్యవంతమైన సేవలందించడం, త్వరితగతిన శ్రీవారి దర్శనం, అన్నప్రసాదాల నాణ్యత, తిరుమల విజన్ 2047 వంటి అంశాలు ఇప్పుడు టిటిడి కార్యాచరణ ప్రణాళికలో చేరాయి. ఇవన్నీ అమలుచేసే దిశగా ప్రస్తుత టిటిడి పాలకమండలి,, టిటిడి అధికారులు సమన్వయంతో పనిచేసేలా చూడటంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా సమావేశమవుతున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ఐదేళ్ళలో జరిగిపోయిన నష్టాన్ని, తప్పిదాలపై ప్రక్షాళన చేసేదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది. ఇప్పటికే పాలకమండలి, టిటిడి అధికారుల మధ్య సమన్వయం కుదిర్చిన సిఎం ఈనెల 11వతేదీ మరింత కొన్ని కీలక అంశాలపై వీరితో చర్చించి నిర్దేశం చేయనున్నారు. టిటిడి పాలనలో ప్రక్షాళన చేయ ల్సిన దిశగా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించడంలో ఇకనుండి వాట్సాప్ ద్వారా సమాచారంఅందించాలని కూడా నిర్ణయించారు. కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంక టేశ్వరస్వామిని దర్శించుకునేందుకు దేశవిదేశాల నుండి రోజువారీగా లక్షమందివరకు వస్తున్న భక్తులకు తిరుమలలో దర్శనం సమయం, గదుల లభ్యత తదితర వివరాలు మరింత త్వరగా,నాణ్యమైన సేవలందించేందుకు టిటిడి సాంకేతికతకను వినియోగించుకునే అంశంపై చర్చించనున్నారు. ఇందుకు వాట్సాప్ యాజ మాన్యంతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పం దంపై కూడా కీలకంగా చర్చించనున్నారు. పాలనాపరమైన సంస్కరణలు చేపట్టి కొండపై అనూహ్యంగా భక్తుల రద్దీ పెరిగినా రద్దీ నియంత్రణ మరింత మెరుగ్గా ఉండేలా చూడనున్నారు. భక్తులు, పేదప్రజల సౌకర్యార్థం విద్య వైద్య రంగాల్లోకూడా విశేషసేవలందిస్తున్న టిటిడికి పలు రకాలుగా విరాళాలిచ్చే దాతల విభాగాన్ని పూర్తిగా ఆడిట్చేయించాలని బోర్డులో నిర్ణ యించారు. అర్హులైన దాతలకు అందించే సేవలు, మధ్యవర్తులు,దళారులను పూర్తిగా అరికట్టేలా చూడనున్నారు. పారదర్శకంగా సేవలందించేలా ,మానవజోక్యాన్ని తగ్గించి ఏఐతో భక్తులకు త్వరితగతిన తిరుమలేశుని దర్శనం, వసతి సౌకర్యం కల్పించాలని యోచిస్తున్నారు. ప్రస్తుతం సిఫార్సులేఖలపై జారీచేస్తున్న విఐపి బ్రేక్ దర్శనాలు కూడా ఆన్లైన్ద్వారా అందించేందుకు ఆ విఐపిలకరు ఒక కోడ్నంబర్ ఇవ్వాలని దానిద్వారా వెసలుబాటును బట్టి బ్రేక్ దర్శనాలు బుక్చేసుకునే సౌలభ్యం కల్పించేలా సిఎంతో చర్చించనున్నారు. తిరుమల విజన్ 2047 అమలుపై కీలకంగా చర్చించే అవకాశం ఉంది. టిటిడి ఉద్యోగులకు నేమ్బ్యాడ్జ్లు అమలుచేయడం, తిరుమల పవిత్రత, ఆధ్యాత్మికత మరింత ఉట్టిపడేలా కొన్ని సూచనలు రానున్నాయి.



దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో ఆర్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి..రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బేటీ దృశ్యం

# దేవాదాయ మంత్రి ఆనంతో ఆలయాల అభివృద్ధిపై మంత్రుల చర్చలు

**విజయవాడ.ఫిబ్రవరి5,ప్రభాతవార్త ప్రతినిధి:** బనగానపల్లె నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధి గురించి ఎండోమెంట్స్ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ,రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసంలో ఆయనతో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి భేటీ కావడం జరిగింది.. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కూడా పాల్గొన్నారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సొంత నియోజకవర్గం బనగానపల్లెలోని పలు దేవాలయాల అభివృద్ధి, ఆయా ఆలయ ప్రాంగణాల అభివృద్ధి, మరమ్మతులు, సౌకర్యాల పెంపు తదితర అంశాలపై ఈ సమావేశంలో ఇరువురు మంత్రులు ప్రత్యేకంగా చర్చించడం జరిగింది. బనగానపల్లెలోని ప్రముఖ దేవాలయమైన శ్రీ కొట్నాల లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం కు డిబినీ నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కోరడం జరిగింది.ప్రస్తుతం బనగానపల్లె నియోజకవర్గంలో పలు ప్రాచీన దేవాలయాలను మరింత అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు, ప్రస్తుతం అమలు చేస్తున్న ప్రణాళికలు, వాటి పురోగతి గురించి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని మంత్రి అడిగి తెలుసుకోవడం జరిగింది. దేవాదాయ శాఖ ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టనున్న ఆయా అభివృద్ధి పనులను త్వరితగతిన అమలు చేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కోరడం జరిగింది.రాష్ట్రంలో ప్రసిద్ధ దేవాలయాలన్నింటికి భక్తుల అవసరాలకు అనుగుణంగా బస్సు సర్వీసులు అందుబాటులోకి తీసుకుని రావాలని మంత్రి మండిపల్లిను మంత్రి ఆనం కోరారు.

# దుర్గమ్మ ఆలయంలో ఉద్యోగులపై కొరడా!

## - ఆలయ ప్రక్షాళన చేస్తున్న ఇఒ కె రామచంద్రమోహన్

**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** దుర్గమ్మ ఆలయంలో పలువురు ఉద్యోగులపై వేటు పడింది. గత కొంతకాలంగా అనధికార దర్శనాలు చేయిస్తున్నట్లు వచ్చిన ఆలయాధికారుల ఫిర్యాదుల మేరకు పట్టుబడ్డ వ్యక్తితో పాటు అయిదుగురు సిబ్బందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ మేరకు ఇద్దరు శాశ్వత ఉద్యోగులయిన స్కానింగ్పాయింట్ వద్ద పనిచేసే అటెండర్ పుల్లారావు, మైక్ ఆపరేటర్ నాగేశ్వరరావు లను ఆలయ ఇఓ కె రామచంద్రమోహన్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. సెక్యూరిటీ గార్డు కోటేశ్వరరావు, డ్రైవర్ నాగరాజు, హోంగార్డు భాస్కరరావు లను శాశ్వతంగా విధులునుండి తొలగించారు.



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి దుర్గమ్మ జ్ఞాపిక అందిస్తున్న ఇఓ

- **దుర్గమ్మ ఆలయ ప్రక్షాళనకు ఇఓ చర్యలు:** దుర్గమ్మ ఆలయ ప్రక్షాళనకు ఇఓ కె రామచంద్రమోహన్ నడుం బిగించారు. గత కొంతకాలంగా ఆలయ శానిటేషన్పై శ్రద్ధ పెట్టిన ఇఓ తదుపరి భక్తులకు మంచినీటి సదుపాయం పెంచుతూ ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు, ప్రసాద కౌంటర్లు వద్ద మినరల్ వాటర్ ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా ఆలయంలో జరుగుతున్న అనధికార దర్శనాలపై తనదైనశైలిలో చర్యలు తీసుకున్నారు.
- **దుర్గమ్మవారి సేవలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి:** దుర్గమ్మవారిని బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కావేటి విజయానంద దర్శించుకున్నారు. ఆయనకు దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను ఇఓ కె రామచంద్రమోహన్ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.
- **మాఘమాసంలో లోకకళ్యాణార్థం సూర్యోపాసన సేవ:** దుర్గమ్మ ఆలయంలో లోకకళ్యాణార్థం మాఘమాసం సందర్భంగా వేదోక్తంగా నిర్వహించే సూర్యోపాసన సేవలో పాల్గొనాలని ఇఓ తెలిపారు. ఈ మాఘమాసంలో సూర్యోపాసన సేవలను ఈనెల 8వ తేదీ శనివారం భీష్మఏకాదశి, 9వ తేదీ ఆదివారం మాఘశుద్ధ ద్వాదశి, 12వ తేదీ మాఘమాస పూర్ణిమ, 16 ఆదివారం, 23వ తేదీ ఆదివారం, 24 సోమవారం బహుళ ఏకాదశి, 26 బుధవారం మాఘబహుళ చతుర్దశి పర్వదినాల్లో ఉదయం 8 గంటలకు అరుణ పారాయణ, సూర్యనమస్కారాలు, ఆదిత్యహృదయం, సూర్యాష్టకం పఠిస్తూ పండితులు పూజాదికాలు నిర్వహిస్తారన్నారు.

# వర్షాకాలంలోగా ఎన్బిడి రోడ్ల పనులు పూర్తి చేయాలి

## - ఆర్ అండ్ బి మంత్రి బిసి జనార్ధనరెడ్డి

**విజయవాడ.ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** న్యూ డెవలప్మెంట్ బా ్యంక్(ఎన్డీబీ) రుణంతో చేపట్టిన రహదారుల విస్తరణ పనులను వర్షాకాలం మొదలయ్యే లోపు పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి ఆదేశించారు. ఆయన ఈఎన్సీ నయిముల్లాతో కలిసి సచివాలయంలో ఎన్డిపి కాంట్రాక్టర్లుతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తేదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, త్వరగా పనులు చేస్తే వెంటనే వెంటనే బిల్లులు చెల్లించేలా చూస్తామన్నారు. ఈ రోడ్ల పనుల కాలపరిమితి వచ్చే ఏడాది వరకు పొడిగించాలని,కోవిడ్ కాలంలో ఇచ్చిన మినమాయంపు ఈ మార్చితో ముగుస్తున్నందున దాన్ని పొడిగించాలని గుత్తేదారులు కోరారు. దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ నిచ్చారు. ఎన్డీబీ ప్రాజెక్ట్ రూ.6,500 కోట్లతో మంజూరు కాడగా,దీనిని రెండు దశలుగా విభజించారు. ప్రస్తుతం మొదటి దశ అమలు చేస్తున్నారు. రెండో దశ ఇంకా కొనాగించకూడదని, మొదటి దశలో కూడ ఇప్పటికీ విస్తరణ మెదులకాని రోడ్ల పనులు పూర్తిగా ఆపేయాలని ప్రభుత్వం భావిస్తోంది.దీనిపై ప్రభుత్వం నుండి తగిన స్పష్టత వచ్చాక ఆర్ అండ్ బీ అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

# రాష్ట్రంలో ఉన్నత విద్య అభివృద్ధికి సాయం అందించాలి

## - కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్కు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి

విజయవాడ,ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:విదా ్యశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలోని ఆయన నివాసంలో ఈరోజు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించబోయే అఖిల భారత విద్యా మంత్రుల సమ్మేళనంను ఏపీలో ఏర్పాటు చేసే అవకాశం కల్పించాల్సిందిగా కోరినట్లు తెలిపారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ఏపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. విద్యారంగంలో కీలక సంస్కరణలపై చర్చించడానికి ఈ కాంక్లేవ్ ఒక వేదికగా ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ ఆర్థిక దుర్వినియోగం, కేటాయించిన వనరులను తక్కువగా ఉపయోగించడం వల్ల ఏపీలో విద్యావ్యవస్థ కుంటుపడిందన్నారు. దీనివల్ల మౌలిక సదుపాయాల అభివృద్ధితో సహా కీలక రంగాల్లో పెద్దఎత్తున బకాయిలు ఉన్నాయని తెలిపారు. కేజీబీవీలు, నైపుణ్య విద్య, ఐసీటీ ఆధారిత అభ్యాసం, నాణ్యత పెంపుదలకు కేంద్రం నుంచి ఏపీకి నిధుల కేటాయింపులు పెంచాలని కోరారు. ఏపీలో ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి ప్రతి పంచాయతీలో మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేసి భరోసా కల్పించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇందుకు అధిక బడ్జెట్ కేటాయింపు అవసరం అవుతాయని, 202526 బడ్జెట్ లో ఏపీకి అత్యధికంగా నిధులు కేటాయించాలని కోరామన్నారు. రాష్ట్రంలో పీఎం శ్రీ పథకం కింద ఏర్పాటైన పాఠశాలలు అద్భుతమైన పురోగతిని కలిగి ఉన్నాయని తెలిపారు. ఈ కారణంగా తల్లిదండ్రులు, కమ్యూనిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రాంతాల నుంచి డిమాండ్ పెరుగుతోందన్నారు. పీఎం శ్రీ ఫేజ్ 1, 2 లలో కలిపి ఏపీలో ప్రతిపాదించిన 2,369 పాఠశాలలకు గాను 855కు మాత్రమే మంజూరయ్యాయని తెలిపారు. గతంలో సిఫార్సు చేసిన మిగిలిన 1,514 పాఠశాలలను ఫేజ్ - 3 పీఎం శ్రీలో మంజూరు చేయండి. ఏపీలో ఉన్నత విద్య అభివృద్ధికి పూర్వోదయ పథకం కింద పెద్ద ఎత్తున సాయం అందించండి. యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.3,229 కోట్లు, రాష్ట్రంలో 37 ప్రభుత్వ కళాశాల భవనాల నిర్మాణానికి రూ. 555 కోట్లు, ఇప్పటికే పనిచేస్తున్న డిగ్రీ కళాశాలల్లో క్లాస్ రూమ్స్, ల్యాబరేటరీలు ఏర్పాటు చేయాలి.



ధర్మేంద్ర ప్రధాన్తో మంత్రి నారా లోకేష్

## ప్రదేశ్కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ శైలజానాథ్ వైఎస్సార్సీలోకి..

**అనంతపురం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త బ్యూరో** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు, మాజీ మంత్రి డా.సాకే శైలజానాథ్ వైసీపీ గూటిలోకి చేరేందుకు రంగం సిద్ధమైందని సమాచారం. ఈ నెల 7వ తేదిన విజయవాడలోని వైసీపీ కేంద్ర కార్యాలయం తాడేపల్లిలో వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్రెడ్డి సమక్షంలో వైసిపిలోకి డాక్టర్ శైలజానాథ్ చేరే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. డా.శైలజానాథ్ వైసిపిలో చేరితో శింగనమల వైసిపి రాజకీయం రసవత్తరం కానుంది. వైసిపిలో కీలకంగా పని చేసిన రాష్ట్ర విద్యాశాఖ మాజీ సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి, సతీమణి జొన్నలగడ్డ పద్మావతి గత ప్రభుత్వంలో వైసీపీ తరపున ఎమ్మెల్యేగా కొనసాగింది. గత ప్రభుత్వంలో ఆలూరు సాంబశివారెడ్డికూడా రాష్ట్రస్థాయిలో వైఎస్.జగన్కు సన్నిహితంగా మెలిగారు. అయితే 2024 శాసనసభ ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గానికే టికెట్ ఇవ్వాలని వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్రెడ్డి నిర్ణయించడంతో ఆలూరు సాంబశివారెడ్డి, తనకు సన్నిహితుడుకి టికెట్ ఇప్పించినప్పటికీ టిడిపి గాలిలో ఓటమి పాలు కావడం, బండారు శ్రావణి టిడిపి తరుపున ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం తెలిసిందే. గత ఎన్నికల్లోనే డాక్టర్ శైలజానాథ్ వైసిపిలోకి వచ్చి శింగనమల నుంచి వైసిపి తరపున బరిలో దిగాలని ఆశించారు. అయితే ఆయన ప్రయత్నాలు నెరవేరలేదు. డా.సాకే శైలజానాథ్ 1964 మార్చి 28వ తేదిన ధర్మవరంలో జన్మించారు. డా.శైలజానాథ్ ఎంబిబిఎస్ కూడా పూర్తి చేశారు. అనంతపురంజిల్లా శింగనమల నియోజకవర్గం నుంచి ఐదు సార్లు కాంగ్రెస్ తరపున పోటీ చేసి రెండు సార్లు గెలుపొందారు.

# శ్రీశైల దేవస్థానంలో పదోన్నతుల ఉత్తర్వులు నిలిపివేసిన హైకోర్టు

**విజయవాడ.ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీశైల దేవస్థానంలో పదోన్నతులకు సంబంధించి దేవాదాయ.ధర్మాశాఖ కమీషనర్ ఇచ్చిన ఉత్తర్వులు ఏపీ హైకోర్టు నిలిపివేసింది.ఈ ఏడాది జనవరి 16న ఇచ్చిన పదోన్నతుల్లో అనర్హులకు లబ్ధిపొందారని పలువురు అర్చకులు అభియోగాలు వ్యవక్తం చేసారు.ఈ నేపధ్యంలో పదోన్నతులను సవాల్ చేస్తూ పలువురు అర్చకులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై విచారించిన హైకోర్టు ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మ శాఖ కమిషనర్ ఇచ్చిన పదన్నోతుల ఉత్తర్వులను నిలిపివేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖను ఆదేశించింది.

# మద్యం దుకాణాల దరఖాస్తుల గడువు పొడిగింపు: ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్

**విజయవాడ, ఫిబ్రవరి 5,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం దుకాణాల కోసం దరఖాస్తులగడువును పొడిగించినట్లు ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు.ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ మచిలీపట్నం, వుయ్యూరు ఎక్సైజ్ స్టేషన్లను సందర్శించి అప్లికేషన్ ప్రక్రియను పరిశీలించారు.జ ఎక్సైజ్ నేరాలు తదితర అంశాలపై సమీక్షించారు. పర్యటన సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ఐడి లిక్కర్ను ఏ పరిస్థితుల్లోనూ సహించబోమని, అక్రమ మద్యం వ్యాపారులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ అక్రమ మద్యం వ్యాపారాన్ని అరికట్టేందుకు, పారదర్శకతను పెంపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చట్టాన్ని కచ్చితంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అధికారులు ప్రజల శాంతి భద్రతల పరిరక్షణలో సక్రమ చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. నవోదయం 2.0 ని కఠినంగా అమలు చేయాలని, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పనులు నిర్వహించాలన్నారు. అప్లికేషన్ దాఖలుకు మరింత సమయం కల్పించేందుకు గడువును ఫిబ్రవరి 8 సాయంత్రం 5 గంటల వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. వుయ్యూరు ఎక్సైజ్ స్టేషన్ లో అప్లికెంట్లతో నిశాంత్ కుమార్ మాట్లాడి, ఎవరైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా అని విచారించారు. అప్లికెంట్లు సులభమైన అప్లికేషన్ ప్రక్రియపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఎక్సైజ్ శాఖ కార్యశైలిని అభినందించారు.మరోవైపు, "బైండ్ ఓవర్" విధించిన వ్యక్తుల విషయంలో కఠిన ఆదేశాలు జారీ చేశారు.

06-2pg7exHMNWJQE.qxd:06-2pg7exHMNWJQE.qxd 01/01/01 9:29 AM Page 1



# క్రమశిక్షణా రాహిత్యంపై కఠిచర్యలు

ఎంతటి వారైనా పార్టీ నియమావళికి కట్టుబడి పనిచేయాల్సిందే

కులగణన ఎస్సీ వర్గీకరణతో దశాబ్దాల స్వప్నం సాకారం: టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్




బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మహేష్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** క్రమశిక్షణ రాహిత్యంపై కాంగ్రెస్‌పార్టీ ఎంతమాత్రం సహించదని కఠినచర్యలు ఉంటాయని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ఎంతటివారైనా పార్టీ నియమావళికి కట్టుబడి పనిచేయాల్సి ఉంటుందని పార్టీ నియమావళి పాటించకపోతే మూల్యం చెల్లిస్తారని అన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చొరవతో కులగణన ఎస్సీవర్గీకరణతో బిసి ఎస్సీల దశాబ్దాల స్వప్నం సాకారమైందని ఆయన అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత బిసి కులగణన జరిగిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మహేష్‌గౌడ్ స్పష్టం చేశారు. బిఆర్ఎస్ రాష్ట్రం కులగణన చేపట్టిన దాఖలాలు లేదని విమర్శించారు. ఏ లెక్కల ఆధారంగా కుల గణన తప్పని అంటున్నారో ప్రతిపక్షాలు చెప్పాలి. మీరు చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపండి. రాజకీయ నాయకుల ఉచ్చులో బీసీ సంఘాలు, బీసీ నాయకులు పడవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. బీసీలను అనగదొక్కిన పార్టీలు, నాయకుల మాటలు నమ్మి మోసపోకండి. బీసీ లెక్కలు తగ్గాయని మాట్లాడుతున్న వారికి ప్రామాణికం ఏంటి?. దేన్ని ఆధారం చేసుకుని వారు మాట్లాడుతున్నారు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు మాటలతో బీసీ ప్రజలను ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయి. గత పదేళ్లలో బీసీలకు ఏం న్యాయం చేశారో బిఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలి అని మహేష్ నిలదీశారు.

**స్థానిక సంస్థల్లో బీసీల జనాభా తగ్గించింది బీఆర్ఎస్ కాదా?**

ఎన్నో సంవత్సరాలుగా బీసీ కులగణన కోసం ఆ వర్గం నేతలు, ప్రజలు ఎదురుచూశారు. అది కాంగ్రెస్ ప్రభుత్వం నేరవేర్చింది. బీసీల ఆకాంక్ష నేరవేర్చామని ప్రతిపక్షాలకు కడుపుమంట. అడ్డగోలుగా కుటుంబంలో నలుగురికి మంత్రి పదవులు ఇచ్చే పార్టీ మాది కాదు. సమగ్ర కుటుంబ సర్వే మంచిదే అయితే దాన్ని ఎందుకు టేబుల్ చేయలేదో సమాధానం చెప్పాలి. ఇన్ని రోజులూ ఎడారిలో ఉన్నాం. బిందెడు నీళ్ళ దొరికితే వాటిని కాపాడుకోవాలి. గురువారం మా కుటుంబ (కాంగ్రెస్‌పార్టీ) మీటింగ్ జరుగుతుంది. కుల గణనపై ఎవరికైనా అనుమానాలు ఉంటే అన్ని విషయాలూ అక్కడ మాట్లాడుకుంటాం. కాంగ్రెస్ నేతలు ఎంత చిన్నవారైనా, పెద్దవారైనా పార్టీ క్రమశిక్షణ లోబడే ఉండాలి. పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు. ఎవరైనా కులగణన ఇంకా వివరాలు ఇవ్వాలనుకుంటే ఇవ్వొచ్చు అని మహేష్‌కుమార్ చెప్పారు.కులగణన సర్వే కోసం బిసిసంఘాలు చాల ఏళ్ళు ఎదురుచూశాయి. ఇది గొప్ప కార్యక్రమం అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభినందించాలి అని ఆయన అన్నారు. భవిష్యత్‌లోజరిగే జనాభా గణనలోనూ కులగణన అంశాన్ని చేర్చాలని ఆయన అన్నారు. బిజెపి జనగణనతోపాటు కులగణనచేస్తామని తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 3.66 శాతం మంది మాత్రమే సర్వేలో పాల్గొనలేదని వివరాలు ఇవ్వని వారిలో అధికులు హైదరాబాద్‌లోనే ఉన్నారని ఆయనఅన్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభినందించాల్సిందిపోయి ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

## కృష్ణా జిల్లా పరిషత్‌కు ఐసిఎఐ అత్యున్నత పురస్కారం

**విజయవాడ,ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లా పరిషత్‌కు కార్యకలాపాల నిర్వహణలో అత్యుత్తమ అకౌంట్స్ నిర్వహించినందుకు 202324 సంవత్సరానికి గానూ అత్యున్నత పురస్కారం లభించింది. ప్రతిష్టాత్మకమైన చార్టెడ్ అకౌంట్స్ సంస్థ ఐసిఎఐ వారు ఈ పురస్కారం ప్రకటించారు. ఫిబ్రవరి 1న ఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ విభాగాలకు పురస్కారాలు అందించారు. దీనిలో భాగంగా కృష్ణా జిల్లా పరిషత్‌కు ప్రకటించిన పురస్కారాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, ఐసిఎఐ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ చేతుల మీదుగా కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అందుకున్నారు. ఈ పురస్కారం రావడానికి కృషి చేసిన అధికారులు, ఉద్యోగులకు చైర్‌పర్సన్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.




కేంద్ర మంత్రి నుండి అవార్డు అందుకున్న చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

## నౌకా నిర్మాణ రంగంలో యువతకు ప్రావీణ్యం.. జపాన్ సంస్థతో సిఎం చంద్రబాబు చర్చలు

**విజయవాడ.ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** నౌకా నిర్మాణం,గ్రీన్ టెక్నాలజీలో యువత ప్రావీణ్యం సాధింయచేందుకు అవసరమైన నైపుణ్యాలపై జపాన్ లోని అతి పెద్ద నౌకా నిర్మాణ సంస్థ ఇమబారి షిప్ బిల్డింగ్ గ్రూప్ ప్రెసిడెంట్ యుకిటో హిగాకీతో మంగళవారం రాష్ట్ర సచివాలయంలో చర్చించినట్లు సిఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా తెలిపారు. ప్రముఖ వాణిజ్య,పెట్టుబడి సంస్థ సోజిట్జ్‌కి చెందిన నిషిమురాతోనూ మాట్లాడినట్లు ఆయన పేర్కొన్నారు. యువతకు వైఫల్యాలు అందించడం ద్వారా దేశీయ,అంతర్జాతీయ స్థాయిలో నైపుణ్యం కలిగిన నిపుణుల అవసరాలు తీర్చడానికి వీలుంటుందని సిఎం అన్నారు. రాష్ట్రంలో నౌకా నిర్మాణం,గ్రీన్ రీసైక్లింగ్,నౌకల నిర్వహణ యార్డులకున్న అవకాశాల పైనా చర్చించినట్లు వివరించారు. రాష్ట్ర అభివృద్ధికి ఉద్యోగ అవకాశాలు మెరుగు పర్చేందుకు ఈ చర్చలు ఫలప్రదం అవుతాయని ఆశిస్తున్నానని చంద్రబాబు అన్నారు

## తిరుపతిలో ఎస్‌బిఐ శాఖలో చోరీకి యత్నం



**తిరుపతి,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** ఖాతాదారుడి వేషంలో కొంతమంది ఏటిఎంలో నగదు డ్రాచేసే వారిని నమ్మించి డబ్బులాక్కెళ్ళే ఘరానా మోసగాడ్ని ఎస్‌బిఐ ప్రధానశాఖ సిబ్బంది పట్టుకున్నారు. పీలేరుకు చెందిన మోహన్ ఖాతాదారుడి వేషంలో బ్యాంకుల వద్ద తచ్చాడుతుంటాడు. అతని వద్ద ఆరేడు బ్యాంకు ఏటిఎం కార్డులు ఉన్నాయి. ఈ కార్డులతో నగదు డ్రాచేసే వాడిలా నటిస్తూ ఏటిఎంల వద్దకు వచ్చిన ఖాతాదారులతో మాటలు కలుపుతాడు. అమాయకులు, వృద్ధులైన వారిని మస్కాకొట్టి నమ్మించి నగదు డ్రాచేయిస్తానని వారి కార్డుపై నగదు తీసుకుని ఉడాయిస్తాడు. బుధవారం ఉదయం తిరుపతిలోని ఎస్‌బిఐ ప్రధానశాఖ ప్రాంగణంలోని గోడపైనుండి క్రిందకు దిగుతుండగా బ్యాంకు సెక్యూరిటీ సిబ్బంది గమనించి పట్టుకున్నారు. అనంతరం అతనిని తిరుపతి ఈస్టు పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెల్లడించడం, ఏటిఎం కార్డుల ద్వారా నగదు డ్రాచేసేవాడిలా మోసం చేస్తాడని పోలీసులు తెలిపారు.

## ఒఎన్‌యుని సందర్శించిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ



**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త :** ఏఎన్‌యులో మరో నైపుణ్య శిక్షణ కేంద్రానికి వేదిక కానుంది. విద్యార్థులకు,యువతకు మెరుగైన నైపుణ్యాలు నేర్పించి వారిని ఉపాధి మార్గాలవైపు పయనించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు లేబర్,బాయిలర్స్ అండ్ ఇన్సూరెన్స్, మెడికల్ సర్వీసెస్,ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ.వాణిప్రసాద్,ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి అండ సీఈవో గణేష్‌కుమార్ బృందం బుధవారం విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు.వర్సిటీ విసి ఆచార్యగంగాధరరావు,రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తో కలసి దూరవిద్య కేంద్రాన్ని పరిశీలించారు.దూరవిద్య కేంద్రం పై రెండు అంతస్తులను వాణి ప్రసాద్,గణేష్‌కుమార్‌లు పరిశీలించి స్కిల్ ఓరియంటేషన్,స్కిల్‌ఏకోసిస్టమ్ అభివృద్ధి,అందుకు అవసరమైన వసతులు గుర్తించారు.ఏఎన్‌యు,ఏపి ఎస్ఎస్‌డిసిలు సంయుక్తంగా చేపట్టాల్సిన పలు స్కిల్ ఇనిషియేటివ్స్ గురించి చర్చించారు.ఈ సందర్భంగా విసి ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ వర్సిటీలో స్కిల్ ఏకో సిస్టం ఏర్పాటు అయినట్లయితే అందుకు తగిన పూర్తి సహాయ సహకారాలు విశ్వవిద్యాలయం అందిస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంలో ఏపి ఎస్ఎస్ డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్,దూరవిద్య కేంద్ర డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాస్తారోకో చేస్తున్న నేతల అరెస్టు

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు వ్యతిరేకంగా రాస్తారోకో నిర్వహిస్తున్న అనేక మంది మాలలను బుధవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట పోలీసులు అరెస్టు చేశారు. మాల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో అనేక మంది కార్యకర్తలు తొలుత అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రోడ్డు మీదకు వచ్చి రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. అంతకు ముందు మాల సంఘాల జెఎసి ఛైర్మన్ జి.చెన్నయ్య, కో-ఛైర్మన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, చెరుకు రాం చందర్, గోపతి రమేష్ తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న మాలలను నటేట ముంచిందని ఆరోపించారు. 2011 జనాభా లెక్కల్లో ఉప కులాల గణన జరగలేదని తప్పుడు లెక్కలతో వర్గీకరణను చేశారని, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం చేయకుండా మంత్రి వర్గ ఉప సంఘంతో వర్గీకరణ చేశారని, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా మాలలకు ద్రోహం చేశారని వారు ధ్వజమెత్తారు.

ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు కరణం కిషన్, మన్నె శ్రీధర్‌రావు, అంగరి ప్రదీప్, మంచాల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



బుధవారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య తదితరుతు

## రిజర్వేషన్లు పెంచకుండా పార్టీ టికెట్లు ఇస్తారా?: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్ 42 శాతంకు పెంచకుండా పార్టీపరంగా టికెట్లు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం బీసీలను దగా చేయడమేనని ఆర్.కృష్ణయ్య విమర్శించారు. ఈమేరకు బుధవారంఢిల్లీలోని తెలంగాణ భవన్‌వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో 42 శాతంకు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ తీరా ఇప్పుడు తప్పించుకోవడానికి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక అసెంబ్లీ పెట్టిన సిఎం రేవంత్‌రెడ్డి 42 శాతం రిజర్వేషన్లు పెంచడానికి ఏమి అవరోధాలు ఉన్నాయో చెప్పాలని ప్రశ్నించారు. మీరు ఎన్ని కుట్రలు చేసిన 42 శాతం రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక ఎన్నికలను ఒప్పుకునేది లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి మొదటినుంచి బిసివ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాడని మంత్రివర్గంలో కూడా బీసీలకు అన్యాయం చేసి కేవలం ఇద్దరికే అవకాశం కల్పించారన్నారు.అలాగే బీసీ కార్పొరేషన్ ద్వారా 14 నెలల కాలంలో ఒక్కరికి కూడా రుణాలు ఇవ్వలేదని, ఛైర్మన్ లను నియమించలేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి బీసీ వ్యతిరేక చర్యలు మార్చుకోవాలని లేకుంటే బిసిల తిరుగుబాటు తట్టుకోలేరని కృష్ణయ్య హెచ్చరించారు. ఈ సమావేశంలో జాతీయకన్వీనర్ గుజ్జకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల పహారాలో డంపింగ్ యార్డ్ పనులు

### కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి నాయకుల ముందస్తు అరెస్టులు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** వేలాది మంది పోలీసు బలగాల పహారాలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు పనులను బుధవారం రాత్రి నుండి ప్రారంభించారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ భూముల్లో ఈ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడంతో అటవీ ప్రాంతంలో ఉన్నటువంటి వన్యప్రాణులతో పాటు వ్యవసాయ ఆధారిత గ్రామాలు కలుషితం అవుతాయని గత ఐదు సంవత్సరాల నుండి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు నిలిపివేయగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ డంపింగ్ యార్డ్ పనులను ప్రారంభించడం సబబు కాదని ఆయా గ్రామాల రైతు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే డంపింగ్ యార్డ్ ఏర్పాటు పనులను నిలిపివేసి వ్యవసాయ ఆధారిత ప్రాంతాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని హెచ్చరించారు. ఈ సందర్భంగా గుమ్మడిదల బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డిలతో పాటు పలువురు నాయకులు గతంలో జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వినతి పత్రాలు ఇచ్చినప్పుడు సాధ్యమైనంత వరకు వ్యవసాయ ఆధారిత ప్రాంతాన్ని కాపాడుకుం టామని హామీ ఇచ్చి గుమ్మడిదల ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా గ్రామంలో పోలీసు యంత్రాంగం తిరు గుతూ గ్రామం అంతా 144 సెక్షన్ అమల్లో ఉండడంతో ఎక్కడ కూడా ప్రజలు గుమి కూడి నిల బడద్దని హెచ్చరికలు జారీ చేయడంతో గ్రామ స్తులంతా ఆందోళన చెందుతున్నారు. వెంటనే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ డంపింగ్ యార్డ్‌ను వెంటనే నిలిపివేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ మహిళలు, రైతులు భారీ సంఖ్యలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




బుధవారం నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

**మండల నాయకులను ముందస్తు అరెస్టులు.. సంగారెడ్డిలోని చిదురుప్ప పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలింపు:** మంగళవారం అర్ధరాత్రి మండలంలోని అన్ని గ్రామాల నాయకులను ముందస్తు అరెస్టు చేసి సంగారెడ్డి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లకు, అలాగే చిదురుప్ప పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, మద్ది ప్రతాప్ రెడ్డి, మద్ది వీరారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నుండి మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, తాజా మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, అన్ని గ్రామాల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. అర్ధరాత్రి నుండి డంపింగ్ యార్డ్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, ఎక్స్‌క్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డిలతో పాటు పోలీస్ వివిధ ఉన్నత స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గీతం నూతన విసిగా డాక్టర్ ఎర్రోల్ డిసౌజా

**పటాన్‌చెరు,ఫిబ్రవరి 5,ప్రభావార్త:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ)గా ప్రముఖ విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞావంతుడు, ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ అహ్మదాబాద్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ఎర్రోల్ డిసౌజా నియమితు లయ్యారు. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ బుధవారం ఆన్ లైన్ లో నిర్వహించిన టౌన్ హాల్ సమావేశంలో ఈ విషయాన్ని సిబ్బందికి వెల్లడించి, నూతన వీసీని అందరికీ పరిచయం చేశారు. డాక్టర్ డిసౌజా నియామకం పట్ల గీతం అధ్యక్షుడు శ్రీభరత్ తన హర్షాన్ని వ్యక్తంచేస్తూ,"ప్రొఫెసర్ డిసౌజాతో నా సంభాషణలలో, మా కొత్త దృక్పథంతో ఆయన ఎంత దగ్గరగా ఉన్నారో చూసి నేను ముగ్ధుడయ్యాను. మార్పు తీసుకురావడాని నిజాయితీ, కరుణలతో ముందుకు సాగే గీతం, అసాధారణమైన జ్ఞానఆధారిత సంస్థ అవుతుంది. ముఖ్యంగా నిజాయితీ, కరుణ విలువల పట్ల ఆయన నిబద్ధత-నేను ఎంతో గౌరవించే సూత్రాలు-మమ్మల్ని ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తాయి అని వ్యాఖ్యానించారు.



## సిఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన పిడమర్తి రవి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి5:** ఎస్సీ ఉప కులాల వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదించిన నేపథ్యంలో జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పలువురు నేతలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ క్రమంలో బుధవారం సిఎంను కలిసి పిడమర్తి రవి, ఖమ్మం జిల్లా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యక్తిగత సిబ్బందిని సన్మానించిన టిపిసిసి చీఫ్ మహేష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** గాంధీభవన్ లో కులగణపై జరిగిన సంబరాలలో ఎనిమిది సెల్‌ఫోన్‌లను దొంగిలించిన దొంగను చాకచక్యంగా పట్టుకొన్న టిపిసిసి చీఫ్ వ్యకిగత సిబ్బందిని టిపిసిసి చీఫ్ మహేష్‌గౌడ్ సన్మానించారు. బుధవారం శాలువతో సన్మానం చేశారు. గాంధీ భవన్‌లో జరిగిన సంబరాల్లో దొంగ ప్రవేశించి తన హస్తలాఘవం ప్రదర్శించాడు. ఫోటోగ్రాఫర్ హరీష్ సలహాతో గన్‌మెన్ దేవరాజ్ దొంగను విచారించగా ఎనిమిది సెల్‌ఫోన్‌లు దొంగిలించినట్లు ఒప్పుకొని వాటిని అప్పగించారు.

## వడ్డీవ్యాపారుల నుంచి రక్షణ కల్పించండి

### గాంధీభవన్‌లో సీతక్కకు విన్నపాల వెల్లువ

**హైదరాబాద్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** వడ్డీవ్యాపారుల నుంచి రక్షణకల్పించాలని మహిళా చిరు వ్యాపారులు పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను ఆశ్రయించారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరుకాగా పార్టీశ్రేణులు,ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వారి సమస్యలు వివరించి పరిష్కారం చూపాలని వేడుకొన్నారు. మంత్రి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి వాటిని పరిష్కరిచాలని ఆదేశాలు జారీచేశారు. సహచర మంత్రి మండలిలోని మంత్రులకు సంబంధించిన అంశాలను ఆయా మంత్రులకు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచిస్తూ సిఫార్సు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మహిళా వ్యాపారులు పెద్దఎత్తువచ్చి అప్పుల ఉబిలో ఎలా కూరుకుపోయామో వివరించి వడ్డీవ్యాపారులను కట్టడి చేయాలని కోరారు. టిఆర్ఎస్ ర్యాలీలో తన భర్త ప్రమాదవశాత్తు మణించారని తనకు ఉద్యోగం ఇవ్వాలని కల్వకుర్తికి చెందిన మనీషా వినతి పత్రం అందించారు. ప్రైవేట్ కళాశాల ఫీజులు రాయితీ తగ్గింపు కోసం ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు కోసం వచ్చి ఆమెను వేడుకొన్నారు.




బుధవారం గాంధీభవన్‌లో ప్రజలనుంచి విన్నపాలను స్వీకరిస్తున్న మంత్రి సీతక్క

ధరణివల్ల నష్టపోయిన రైతులు కొంత మంది మహబూబ్‌నగర్ నుంచి వచ్చి తమ గోడు వెల్లబోసుకున్నారు.మారుమూల గ్రామాల్లో పనిచేస్తున్న కొంత మంది హైదరాబాద్‌కు బదిలీచేయాలని కోరుకున్నారు. తమగ్రామాలలో అంగన్‌వాడీలను కొత్త రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని కొంత మంది కోరారు. 2016లో రుణం తీసుకొన్నవారికి కూడా రుణమాఫీ చేయాలనికొంత మంది అభ్యర్థించారు. హోంగార్డులు తమను విధుల నుంచి తొలగించారని తిరిగి విధులలోకి తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.రోడ్డువసతి కావాలని కొన్ని గ్రామాలకు చెందినవారు వినతి పత్రం సమర్పించారు.

## బిసి హక్కులు అడ్డుకొనే మేకవన్నె పులులు బిఆర్ఎస్ నేతలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** బిసిల హక్కులను అడ్డుకొనేందుకు మేకవన్నెల పులిలా బిఆర్ఎస్ నేతలు పొంచి ఉన్నారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాశిశుసంక్షేమం మంత్రి సీతక్క హెచ్చరించారు. గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో బుధవారం పాల్గొని అనంతరం విలేఖరులతో ఆమె మాట్లాడినారు. 1931లో కులగణన జరిగిందని ఆ తరువాత అత్యంత శాస్త్రీయంగా ఇప్పుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి నాయకత్వంలో సమగ్రంగా సర్వే జరిగిందని కితాబు ఇచ్చుకున్నారు. బిసిల లెక్క 56శాతంకు పైగా తేలిందిన ఎవరికి నష్టం జరగలేదని ఆమె వివరించారు. గతంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వే అశాస్త్రీయంగా అసంబద్ధంగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. లిమ్‌కా బుక్ రికార్డుకోసం ఒక్క రోజు సర్వే పేరుతో పైపైనే సర్వేచేశారని ఆమె విమర్శించారు. సొంత కుటుంబ గణన కెసిఆర్ చేశారు తప్ప కుల గణన చేయలేదు అని అన్నారు. మేము చేపట్టిన కులగణన బహిష్కరించాలని టిఆర్ఎస్ పిలుపునిచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు కులగణన లెక్కల గురించి అడిగే హక్క బిఆర్ఎస్‌కు లేదని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి పదవి పార్టీ అధ్యక్షపదవి ఒకే సమాజికవర్గంకు గతంలో ఎందుకు ఇచ్చారని బిసి సమాజం బిఆర్ఎస్‌ను ప్రజలు నిలదీయాలని ఆమె కోరారు. కనీసం 20ఏళ్ళలో ఒక్క బిసి నేతకు పదవులు ఇవ్వలేదని ఆమె గుర్తుచేసుకున్నారు. బిసిలు ఎదిగితే వారిని పార్టీ నుంచి సాగనంపినారని ఆమె విమర్శించారు. నరేంద్ర నుంచి మొదలు కొని రాజేంద్ర వరకు అవమానాల పాలు చేశారని అన్నారు. టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇప్పుడు సర్వేను ప్రశ్నించడం కాదు మీ హయాంలో ఎందుకు కులగణ సమగ్రం చేయలేదో ఆలోచించుకోవాలని ఆమె కోరారు. తలసాని శ్రీనివాస యాదవ్ కులగణనలో ఎందుకు పాల్గొనలేదని ఆమె నిలదీశారు. దొరలు తమ వివరాలు నమోదు చేసుకోకపోతే వారికి నష్టం లేదు వారి మాటలు నమ్మి కులగణన సర్వేల్లో నమోదు చేసుకోని బిసిలు నష్టపోతారు అని ఆమె అన్నారు. కులగణన సమాచారం ఆధారంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఆమె తెలిపారు. కులగణన ఎక్కడ లెక్క తప్పలేదు ఆయా సమాజిక వర్గాల లెక్కలు పక్కాగా తేలాయి అని ఆమె తెలిపారు. కులగణన సర్వే సరిగాలేదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడటం ఆయన విజ్ఞత కే వదిలేస్తున్నాం అని అన్నారు. అభ్యంతరాలు ఉంటే పార్టీ వేదికపై మాట్లాడాలి కానీ ఇలా బహిరంగంగా మాట్లాడటం మంచిది కాదని ఆమె అన్నారు. ఆయన సంగతి పార్టీ చూసుకొంటది అని అభిప్రాయపడ్డారు. ప్రజల సంతోషాన్ని చూడలేక కొందరు వక్రీకరణ చేస్తున్నారు. 30 ఏళ్ళ ఎస్సీ వర్గీకరణ పంచాయతీని తెంచాము ఎవరి వాటా వారికి పంచాము అని ఆమె తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 21వేల కోట్లు రుణాలను మాఫీ చేశామని ఆమె అన్నారు. కెసిఆర్ హయాంలో రుణమాఫీ కానీ రైతులు తమకు రుణమాఫీ చేయాలని దరఖాస్తులు చేసుకుంటున్నారని సీతక్క చెప్పారు. గ్రామస్థాయి నుంచి గాంధీభవన్‌స్థాయి వరకు మంత్రులు దరఖాస్తులు ప్రజల నుంచి తీసుకొంటున్నామని అన్నారు. రెండో పర్యాయం గాంధీభవన్‌కు ముఖా ముఖి పాల్గొనేందుకు వచ్చానని చెప్పారు. భూసామజిక సమస్యలు వంటివి వచ్చాయని ఆమె తెలిపారు. భూమి ఒకరిది మరొకరికి నమోదైందని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.పదేళ్ళలో ఒక్కరికి ఇల్లు ఇవ్వలేదు, రేషన్‌కార్డులు ఇవ్వలేదని ఆమె ఆరోపించారు.

## కులగణన అసమగ్రంగా, అశాస్త్రీయంగా ఉంది: బిజెపి ఎంపి డా.లక్ష్మణ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన నివేదిక పూర్తిగా తప్పుల తడకగా ఉందని బిజెపి ఎంపి డా.లక్ష్మణ్ మండిపడ్డారు. ఢిల్లీలో ఎంపి డా.లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. కులగణన అసమగ్రంగా, అశాస్త్రీయంగా ఉందన్నారు. వాస్తవాలకు దూరంగా ఉందన్నారు. నిజంగా కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి సామాజిక న్యాయం పట్ల చిత్తశుద్ధి ఉన్నట్లయితే ఉంటే చట్టరూపంలో తీసుకొచ్చి అమలు చేసేందుకు, అందులో ఉన్నటువంటి లోటుపాట్లను సరిదిద్ది బిల్లురూపంలో తీసుకురావాల్సింది బదులు మొక్కుబడిగా, తూతూమంత్రంగా చేశారు. మండల్ కమిషన్‌లోనూ 51, బిఆర్ ఎస్ సమగ్రకుటుంబ సర్వేలోనూ 52 బిసిలున్నారని వెల్లడైంది. మరి ఈ సంఖ్య ఎలా 46కి వచ్చిందని ప్రశ్నించారు. 4కోట్ల జనాభాలో దాదాపు 6 తగ్గుదల బిసిలకు చేస్తున్న ద్రోహానికి అద్దం పడుతుందన్నారు. 12 ముస్లింల జనాభాను చూపిస్తూ 2 ముస్లిం బిసిలు, ముస్లిం ఓసిలు అని చూపించడందేనికి నిదర్శనం. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మతపరమైన రిజర్వేషన్లు ఉండవని చెప్పినా వీళ్ల మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. రాహుల్ గాంధీ రాజ్యాంగం చేతిలో పట్టుకుని తిరుగుతున్నారు. కానీ దాన్ని ఏనాడూ తెరిచి చూడలేదని అర్థమవుతోంది. రాహుల్ గాంధీ సమక్షంలో గతేడాది నవంబర్ 6నఈ సర్వేను ప్రారంభించారు. ఈ సర్వేదే శానికి ఓ రోల్ మాడల్ అని చెప్పారు. బిసిల ఓట్లను తగ్గించి ముస్లింలకు కట్టబెట్టడమే రోల్ మాడలా? గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో 150 సీట్లలో 50 సీట్లు బిసిలకు రిజర్వ్ చేస్తే.. ఇందులో 18 మాత్రమే బిసిలకు ఇచ్చి మిగిలినవి ముస్లింలకు కట్టబెట్టడం అత్యంత దారుణం.32 బిసి సీట్లలో ముస్లింలుగా గెలిచారు. సుప్రీంకోర్టు నిర్ణయానికి అనుగుణంగా 50లోపే రిజర్వేషన్లు ఉండాలి. మండల్ కమిషన్ స్పష్టంగా 1990లో ముస్లింలలోని రెండుతెగలు(దూదేకుల,మెహతర్) ను బిసిల్లో రిజర్వేషన్లు పొందుతున్నారు. దీన్ని రాజశేఖర్ రెడ్డి4కోసం ప్రయత్నిస్తే.. కెసిఆర్ ఏకంగా 12రిజర్వేషన్లు ముస్లింలకు ఇస్తామని చెప్పారు.

## సౌతాఫ్రికా టి20 లీగ్‌లో..
# ఫైనల్లోకి ముంబయి ఇండియన్స్




**న్యూఢిల్లీ:** ముంబై ఇండియన్స్ ఫ్యామిలీకి చెందిన ఎంఐ కేప్‌టౌన్ తొలి సారిసౌతాఫ్రికా టీ20 లీగ్‌లో ఫైనల్‌కు చేరింది. తొలి క్వాలిఫయర్లో ఎంఐ కేప్‌టౌన్ పార్ల్ రాయల్స్‌పై 39 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఎంఐ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. ప్రస్తుత సీజన్‌లో ఎంఐకు ఇది మూడో అత్యధిక స్కోర్. ముంబై ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్ (27 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), వాన్ డర్ డస్సెన్ (32 బంతుల్లో 40; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) సహా డెవాల్డ్ బ్రెవిస్ (30 బంతుల్లో 44 నాటౌట్; 4సిక్సర్లు), జార్జ్ లిండే (14 బంతుల్లో 26; 3 సిక్సర్లు), డెలానో పోట్‌గెటర్ (17 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు, సిక్స్) రాణించారు. రాయల్స్ బౌలర్లలో దునిత్ వెల్లలగే 2, ఫోర్టుయిన్, డేవిడ్ గేలియమ్ తలో వికెట్ పడగొట్టారు. 200 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన రాయల్స్, ఎంఐ బౌలర్లు కలిసికట్టుగా సత్తా చాటడంతో 19.4 ఓవర్లలో 160 పరుగులకే ఆలౌటైంది. ట్రెంట్ బౌల్ట్, కగిసో రబాడ, కార్బిన్ బాష్, కెప్టెన్ రషీద్ ఖాన్ తలో 2 వికెట్లు పడగొట్టగా, జార్జ్ లిండే ఓ వికెట్ దక్కించుకున్నాడు. రాయల్స్ ఇన్నింగ్స్‌లో డేవిడ్ మిల్లర్ (45) టాప్ స్కోరర్గా నిలువగా, దినేశ్ కార్తీక్ (31) ఓ మోస్తరు స్కోర్ చేశాడు. ఇక లక్ష్య ఛేదనలో రాయల్స్ ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. ఈ మ్యాచ్‌లో 2 వికెట్లు తీసిన రషీద్ ఖాన్ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అవతరించాడు. ఈ మ్యాచ్ ఓడినా ఫైనలుకు చేరేందుకు రాయల్స్‌కు మరో అవకాశం ఉంటుంది. ఈ నెల 6న జరుగబోయే క్వాలిఫయర్-2లో రాయల్స్, ఎలిమినేటర్ మ్యాచ్‌లో విజేతతో తలపడుతుంది.

## పతకాల పంట.. స్విమ్మర్లు ధినిధి, శ్రీహరి ఖాతాలో చెరో 9 పసిడి పతకాలు

**న్యూఢిల్లీ:** జాతీయ క్రీడల్లో కర్ణాటక స్విమ్మర్లు ధినిధి దెసింగు, శ్రీహరి నటరాజ్ పతకాల పంట పండించారు. ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడల స్విమ్మింగ్ ఈవెంట్లో ఈ ఇద్దరూ చెరో 9 పసిడి పతకాలు ఖాతాలో వేసుకున్నారు. పారిస్ ఒలింపిక్స్లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన 14 ఏళ్ల ధినిధి మహిళల 100 మీటర్ల ఫ్రీస్టయిల్లో జాతీయ రికార్డు తిరగరాస్తూ స్వర్ణం చేజిక్కించుకోవడంతో పాటు, 400 మీటర్ల ఫ్రీస్టయిల్, మిక్స్‌డ్ 4న400 ఫ్రీస్టయిల్, 200 మీటర్ల ఫ్రీస్టయిల్, 100 మీటర్ల బటర్‌ఫ్లయ్, 4న100 మీటర్ల ఫ్రీస్టయిల్ రిలే, 50 మీటర్ల ఫ్రీస్టయిల్, 4న200 మీటర్ల ఫ్రీస్టయిల్ రిలే, మిక్స్‌డ్ 4న100 మీటర్ల మెడ్లేలో పసిడిపతకాలతో మెరిసింది. దీంతో పాటు 50 మీటర్ల బటర్‌ఫ్లయ్‌లో రజతం, 4న100 మీటర్ల రిలే మెడ్లేలో కాంస్యంతో మొత్తం 11 పతకాలు ఖాతాలో వేసుకుంది. పురుషుల విభాగంలో శ్రీహరి మొత్తం 10 పతకాలు (9 స్వర్ణాలు, 1 రజతం) సాధించాడు. ఈ జాతీయ క్రీడల్లో స్విమ్మింగ్ పోటీలు ముగియగా ఓవరాల్‌గా పట్టికలో కర్ణాటక 37 పతకాలతో (22 స్వర్ణాలు, 10 రజతాలు, 5 కాంస్యాలు)తో అగ్రస్థానంలో ఉంది.

## ముంబయి ఓపెన్ టెన్నిస్:
# హైదరాబాద్ అమ్మాయి రష్మిక సంచలనం



**న్యూఢిల్లీ:** ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టెన్నిస్ టోర్నమెంట్లో భారత మూడో ర్యాంకర్, హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సంచలనంతో శుభారంభం చేసింది. ముంబైలో జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 325వ ర్యాంకర్ రష్మిక 6-1, 6-0తో ప్రపంచ 182వ ర్యాంకర్, రష్యాకు చెందిన ఎలీనా ప్రిడాన్కినాపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 64 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక కేవలం ఒక్క గేమ్ మాత్రమే కోల్పోవడం విశేషం. రెండు ఏస్లు సంధించిన రష్మిక మూడు డబుల్ ఫాల్టులు చేసింది. తన సర్వీసును ఒక్కసారి చేజార్చుకున్న రష్మిక ప్రత్యర్థి సర్వీసును ఏడు సార్లు బ్రేక్ చేసింది. ఓవరాల్‌గా మ్యాచ్ మొత్తంలో ప్రిడాన్కినా తన సర్వీసును ఒక్కసారి కూడా నిలబెట్టుకోక పోవడం గమనార్హం. ఇక భారత్‌కే చెందిన అంకిత రైనా, మాయ రేవతి రాజేశ్వరన్ కూడా తొలి రౌండ్లో నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. 15 ఏళ్ల క్వాలిఫయర్ మాయ 6-4, 6-1తో బెలారస్‌కు చెందిన ఇరీనా షైమనోవిచ్‌పైన, అంకిత రైనా 6-2, 6-2తో భారత్‌కే చెందిన వైష్ణవి అడ్కర్‌పై విజయం సాధించారు.

## నేటి భారత్, ఇంగ్లండ్ మ్యాచ్‌కు..
# టీమిండియాలో 10మంది ఔట్
### జట్టులో భారీ మార్పులు
### ప్రక్షాళన చేసిన బిసిసిఐ



**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు జరిగే సిరీస్ కోసం భారత జట్టులో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. టీమిండియాను ప్రక్షాళన చేసే పనిలో భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) ఉంది. ఇందులో భాగంగా ఈ నెల 6వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఇంగ్లండ్‌తో జరిగే వన్ డే టెస్టు మ్యాచ్‌లో భారత్ జట్టు నుండి 10 మంది ఆటగాళ్లను తొలగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. వారి స్థానంలో మరో 9 మంది ఆటగాళ్లకు అవకాశం కల్పించింది.

ఈ మార్పు ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికైన భారత జట్టులో చేయలేదు. కేవలం ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు జట్టులో మాత్రమే ఈ మార్పులు చేసింది. నిజానికి, ఇంగ్లాండ్‌తో జరిగే 5 టీ20ల సిరీస్‌కు ఎంపికైన 15 మంది ఆటగాళ్లలో 10 మంది వన్డే సిరీస్‌లో భాగం కాలేదు. వారిని మినహాయించడం ద్వారా, మరో 9 మంది ఆటగాళ్లకు భారత వన్డే జట్టులో స్థానం లభించింది. టీ20 సిరీస్ ఆడిన, వన్డే సిరీస్ కోసం టీమిండియా నుంచి తొలగించబడిన 10 మంది ఆటగాళ్ళలో సంజు సామ్సన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, శివం దుబే, రమణ్‌దీప్ సింగ్, రింకు సింగ్, ధ్రువ్ జురెల్ పేర్లు చేరాయి. సూర్య, శాంసన్, అభిషేక్, బిష్ణోయ్, వరుణ్, తిలక్ టీ20 సిరీస్‌లోని 5 మ్యాచ్‌లలోనూ ఆడటం కనిపించింది. కాగా, రింకు సింగ్ మొదటి 3 మ్యాచ్‌లలో పాల్గొన్నాడు. జురైల్, దూబే తలో 2 మ్యాచ్‌లు ఆడగా, రమణ్‌దీప్ సింగ్‌కు ఏ మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు.

ఇప్పుడు వన్డే సిరీస్ కోసం టీమిండియాలోకి ప్రవేశించిన ఆటగాళ్లలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, యశస్వి జైస్వాల్, రవీంద్ర జడేజా, రిషబ్ పంత్ ఉన్నారు. ఆ పేర్లలో కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, కుల్దీప్ యాదవ్ ఉన్నారు. వీరిలో కుల్దీప్ యాదవ్ అక్టోబర్ 2024 తర్వాత, శ్రేయాస్ అయ్యర్ ఆగస్టు 2024 తర్వాత అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడటం కనిపిస్తుంది. కాగా ఈ నెల 6 నుంచి ఇంగ్లాండ్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో భాగంగా తొలి వన్డే నాగ్‌పూర్‌లో జరుగుతుంది. రెండవ వన్డే కోసం, భారత, ఇంగ్లాండ్ జట్లు ఫిబ్రవరి 9న మ్యాచ్ జరిగే కటక్‌కు వెళతాయి. వన్డే సిరీస్‌లోని మూడవ, చివరి మ్యాచ్ ఫిబ్రవరి 12న అహ్మదాబాద్‌లో జరుగుతుంది.



## జాతీయ బాస్కెట్‌బాల్ టోర్నీలో..
# తెలంగాణ ఖాతాలో తొలి స్వర్ణం
### ఆంధ్రప్రదేశ్‌కు మూడు కాంస్యాలు

**న్యూఢిల్లీ:** జాతీయ క్రీడల్లో తెలంగాణ ఖాతాలో తొలి స్వర్ణం చేరింది. మహిళల బాస్కెట్‌బాల్ 3న3 ఈవెంట్లో తెలంగాణ జట్టు తొలి స్థానంలో నిలిచింది. ఫైనల్లో తెలంగాణ 21-11 పాయింట్ల తేడాతో కేరళపై విజయం సాధించింది. పసిడి పతకం సాధించిన మహిళల జట్టులో గులాబ్ షా అలీ, ఎస్.పుష్ప, కేబీ హర్షిత, పి.ప్రియాంక సభ్యులుగా ఉన్నారు. రెండేళ్ల క్రితం గోవా జాతీయ క్రీడల్లోనూ ఇదే ఈవెంట్లో విజేతగా నిలిచిన తెలంగాణ తమ స్వర్ణాన్ని నిలబెట్టుకుంది. మూడోస్థానం కోసం జరిగిన పోరులో 14-12 తేడాతో తమిళనాడును ఓడించి మధ్యప్రదేశ్ కాంస్యం సొంతం చేసుకుంది. అంతకుముందు సెమీస్‌లో తెలంగాణ 18-11తో తమిళనాడును, కేరళ 13-10తో మధ్యప్రదేశ్‌ను ఓడించాయి. మరో వైపు పురుషుల బాస్కెట్‌బాల్ 3-3 ఈవెంట్లో మధ్యప్రదేశ్, కేరళ, తమిళనాడు స్వర్ణ, రజత, కాంస్యాలు గెలుచుకున్నాయి. ఫైనల్లో మధ్యప్రదేశ్ 22-20 తేడాతో కేరళను ఓడించింది. కాంస్యం కోసం జరిగిన పోరులో తమిళనాడు చేతిలో 16-21తో ఓడిన తెలంగాణ నాలుగో స్థానంతో సరిపెట్టు కుంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు ఒక్క రోజులేనే మూడు కాంస్య పతకాలు లభించాయి. పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో కర్రి సాయిపవన్-షేక్ గౌస్ జోడీ, కనోయింగ్-కయాకింగ్ క్రీడాంశంలోని పురుషుల స్లాలోమ్-కే1 ఈవెంట్లో కొల్లకాని విష్ణు, మహిళల స్లాలోమ్-సీ1 ఈవెంట్లో దొడ్డి చేతన భగవతి కాంస్య పతకాలు సాధించారు. ఇక బ్యాడ్మింటన్ డబుల్స్ సెమీఫైనల్లో సాయిపవన్-షేక్ గౌస్ ద్వయం 13-21, 12-21తో నితిన్-ప్రకాశ్ రాజ్ (కర్ణాటక) జంట చేతిలో ఓడి కాంస్య పతకాన్ని ఖరారు చేసుకుంది. ఈ రోజు పోటీలు ముగిసిన తదుపరి ఆంధ్రప్రదేశ్ ఆరు పతకాలతో 21వ స్థానంలో, మూడు పతకాలతో తెలంగాణ 24వ స్థానంలో ఉన్నాయి.

# పసిడి డిమాండ్ పైపైకి

## వాణిజ్యం



**ముంబై, ఫిబ్రవరి 5:** దిగుమతి సుంకం తగ్గించడంతో దేశంలో బంగారానికి గిరాకీ పెరిగింది. దీనికి తోడు పెళ్లిళ్లు, పండగ సీజన్ కారణంగా 2024లో పసిడి డిమాండ్ 5శాతం పెరిగి 802.5 టన్నులకు చేరిందని ప్రపంచ స్వర్ణ మండలి వెల్లడిం చింది. ఈ యేడాదిలోనూ పుత్తడి గిరాకీ ఇదే స్థాయిలో ఉండొచ్చని అంచనా వేసింది. 2024 యేడాదికిగానూ ప్రపంచ వ్యాప్తంగా పసిడి వినియోగంపై ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజిసి) బుధవారం గణాంకాలు విడుదల చేసింది.

దాని ప్రకారం 2023లో బంగారం గిరాకీ 761 టన్నులుగా ఉండగా, గతేడాది ఆ మొత్తం 802.8 టన్నులకు పెరిగింది. 2025లో బంగారం గిరాకీ 700-800 టన్ను లు ఉండొచ్చని అంచనా వేస్తున్నాం. అయితే ఈ యేడాది ధరల్లో కొంత స్థిరత్వం వచ్చే అవకాశం ఉంది. దీంతో పెళ్లిళ్ల సీజన్‌లో బంగారు ఆభరణాల కొనుగోళ్లు పెరగొచ్చు. దిగు మతి సుంకాలు తగ్గించినప్ప టికీ, గత యేడా ది కాలంలో దేశీయ మార్కెట్లో పసిడి ధర విపరీతంగా పెరుగుతోంది. కొన్ని నగరా ల్లో పది గ్రాముల పుత్తడి ఏకంగా రూ.86 వేల పైన పలుకు తోంది. మరోవైపు గతేడాది బంగారంలో పెట్టుబడులు 29శాతం పెరిగి 239.4 టన్నులకు చేరినట్లు జైన్ తెలిపారు. 2013 తర్వాత పసిడి పెట్టుబడుల్లో ఇదే అత్యధికం కావడం విశేషం. ఇక గతేడాది రిజర్వ్ బ్యాంకు ఆఫ్ఇండియా ఏకంగా 73 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసినట్లు జైన్ వెల్లడించారు. 2023లో కొనుగోలు చేసిన 16 టన్నులతో పోలిస్తే ఇది ఏకంగా నాలుగు రెట్లు కావడం విశేషం. యుద్ధాలు, అధిక ద్రవ్యోల్బణం, ఇతర సవాళ్లను పరిగణనలోకి తీసుకొని రిస్కును తగ్గించుకునే ఉద్దేశంతో కేంద్ర బ్యాంకు బంగారం నిల్వలు పెంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు నిపుణులు విశ్లేషిస్తు న్నారు.

## హోండా, నిస్సాన్ విలీనం లేనట్లే!

**ముంబై, ఫిబ్రవరి 5:** జపాన్‌కు చెందిన దిగ్గజ వాహన తయారీ సంస్థలు హోండా మోటార్, నిస్సాన్ మోటార్ విలీనం కోసం గత కొంతకాలంగా చర్చలు జరుగుతున్నాయి. అయితే ఈ విలీన ప్రక్రియ ముందుకు కొనసాగడం లేదని తెలుస్తోంది. హోండా కంపెనీతో విలీనం ప్రతిపాదనలను రద్దు చేసుకోవాలని నిస్సాన్ భావిస్తోందని సంబంధిత వ్యక్తులు తెలియచేసినట్లు కొన్ని కథనాలు వెలువడ్డాయి. త్వరలో ఈ అంశంపై భేటీ అయి నిస్సాన్ బోర్డు సభ్యులు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పోటీని ఎదుర్కొనేందుకు జపాన్‌లోని రెండో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ హోండా, మూడో అతి పెద్ద సంస్థ నిస్సాన్ విలీన ప్రక్రియ కోసం చర్చలు జరుపుతున్నట్లు గతేడాది ప్రకటించాయి. చైనా వాహన తయారీ సంస్థ బివైడి, ఇతర ఎలక్ట్రిక్ వాహనాల సంస్థల నుంచి పోటీ ఎదుర్కొంటున్న తరుణంలో విలీనం కోసం సిద్ధమయ్యాయి. అయితే రెండు కంపెనీల మధ్య పెరుగుతున్న విభేదాల కారణంగా చర్చలు కష్టంగా మారాయని సంబంధిత వ్యక్తులు పేర్కొన్నారు. నిస్సాన్‌కంటే దాదాపు ఐదురెట్లు ఎక్కువ మార్కెట్ విలువ కలిగిన హోండా, దాని పునరుద్ధరణ ప్రణాళికలో భాగంగా నిస్సాన్ పురోగతిపై ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు ఈ విలీనం రద్దు కావచ్చని జపాన్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే అంశంపై ఇతర సంస్థల ప్రతినిధులు స్పందించేందుకు నిరాకరించారు.

## ఎఐలో రూ.2వేల కోట్లు పెట్టుబడి: భవీశ్ అగర్వాల్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** ఓలా ఎలక్ట్రిక్ వ్యవస్థాపకుడు భవీశ్ అగర్వాల్ తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ కృత్రిమ మేధలో క్రమంగా పెట్టుబడులు పెంచుకుంటున్నారు. తాజాగా ఈ స్టార్టప్‌లో రూ.2వేల కోట్లు పెట్టుబడి పెట్టారు. వచ్చే యేడాది నాటికి ఈ పెట్టుబడిని రూ.10వేల కోట్లకు పెంచాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని అగర్వాల్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. కృత్రిమ మేధ సాంకేతికతను మెరుగుపరిచేందుకు కొత్త ఎఐ ల్యాబ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. యేడాది నుంచి కృత్రిమ మేధ సాంకేతికతపై పనిచేస్తున్నట్లు అగర్వాల్ తెలిపారు. భారత్ కోసం ఎఐని అభివృద్ధి చేయడంపైనే తమ దృష్టి ఉందని పేర్కొన్నారు. దేశీయ భాషలు, డేటా కొరత వంటి వాటిపై ఎఐ పనితీరును మెరుగుపరిచేందుకు కృషి చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే భారత్ మొట్టమొదటి లార్జ్ లాంగ్వేజ్ మోడల్ కృత్రిమ్-1ను లాంచ్ చేసింది. అది బేసిక్ 7బి మోడల్. తాజాగా కృత్రిమ్-2 పేరిట మెరుగైన మోడల్‌ను విజన్ లాంగ్వేజ్ మోడల్ చిత్రార్థ్-1, స్పీచ్ ప్రాసెసింగ్ కోసం ధ్వని-1ను ప్రవేశపెట్టనుంది. ఈ కృత్రిమి మోడళ్లు తెలుగుతో పాటూ, ఇంగ్లీష్, హిందీ, బెంగాలీ, తమిళం, మరాఠీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, ఒడియా, అస్సామీ ఈ భాషలకు సపోర్ట్ చేస్తాయి. ఇప్పటి వరకు అమెరికా, చైనా సంస్థలు ఆవిష్కరించిన కృత్రిమమేధ మోడళ్లను ప్రపంచం వినియోగిస్తుండగా, మన దేశం నుంచీ సొంత ఎఐ మోడల్‌ను ఈ యేడాదిలో ఆవిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కేంద్రం తాజాగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత్‌లో మొట్టమొదటి జిబి200ఎఐ సూపర్ కంప్యూటర్‌ను ఎన్విడియా భాగస్వామ్యంలో తీసుకొచ్చేందుకు కృత్రిమ్ సిద్ధమవుతోంది. మార్చి నాటికి ఇది అందుబాటులోకి రానున్నట్లు ఓలా సిఇఒ తెలిపారు. క్లౌడ్ ఆధారిత ఎఐ సేవ కృత్రిమ్ క్లౌడ్‌ను కూడా కంపెనీ ప్రారంభించినట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. కృత్రిమ్ ఎఐని 2023లో ప్రారంభించారు. ఇప్పటికే వెంచర్‌కేపిటల్ ఫండ్ మ్యాట్రిక్స్ పార్టనర్స్ ఇండియా నేతృత్వంలోని ఇతర పెట్టుబడిదారుల నుంచి 50 మిలియన్ డాలర్లను సమకూర్చుకుంది. దీంతో 2024లో భారత్ మొదటి యూనికార్న్‌గా అవతరించింది. బిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరిన మొదటి భారతీయ ఎఐ సంస్థగానూ నిలిచింది.




## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఫిబ్రవరి 5:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిసాయి. అమెరికా-చైనా మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధ భయాలు, అధిక వెయిటేజీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేశాయి. దీంతో పాటు రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా మానిటరీ పాలసీ కమిటీ నిర్ణయాలు శుక్రవారం వెలువడ నున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటిస్తుండడం సూచీలు నష్టాలకు కారణమయ్యాయి. నిఫ్టీ 23,700 దిగువన ముగిసింది. చివరికి సెన్సెక్స్ 312.53 పాయింట్లు నష్టపోయి 78,271.28 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 42.95 పాయింట్ల నష్టంతో 23,696.30 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 39 పైసలు క్షీణించి రూ.87.46 వద్ద ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. ఏసియన్ పెయింట్స్, టైటాన్, నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్అండ్‌టి వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. అదానీ పోర్ట్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, టాటా మోటార్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, టాటా స్టీల్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14